www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



యాదగిరీశుడి చెంతన..

స్వామి వారి దర్శనానికి మిస్ వరల్డ్ పోటీదారులు

ఆలయ ప్రాంగణంలో కోలాటం.. ప్రత్యేక పూజలు

శుక్రవారం | 16-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 30 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: చవితి తె.5:14 తదుపరి పంచమి, నక్షత్రం: మూల సా.4:08 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: మ.2:23-4:08, రా.2:22-4:04, దుర్ముహూర్తం: ఉ.8:20-9:11, మ.12:37-1:28, అమృతఘడియలు: ఉ.9:11-10:55, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 5:46, సూర్యాస్తమయం: 6:36 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



భారత్ సూపర్ ఆఫర్!

అమెరికా సరుకులపై సుంకాలు మొత్తం ఎత్తేస్తానని ముందుకొచ్చింది

ఆ మేరకు ఒప్పందానికి సిద్ధమైంది

ట్రంప్ మరో సంచలన ప్రకటన

భారత్ బదులు అమెరికాలో ప్లాంట్లు నిర్మించాలని యాపిల్‌కు సూచన

భారత్-పాక్ యుద్ధాన్ని ఆపలేదు.. ఆపేందుకు సాయం చేశానని వెల్లడి

ఏమీ ఖరారు కాలేదు

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు నడుస్తున్నాయి

ముందే తీర్పులివ్వటం అపరిపక్వత

విదేశాంగమంత్రి జైశంకర్

సిందూర్ నిలిపివేతకు, ట్రంప్ ప్రకటనకు సంబంధముందా: జైరాం

దోహా, మే 15: అమెరికాకు చెందిన సరుకులపై అన్ని రకాల సుంకాలనూ ఉపసంహరించుకోవటానికి సిద్ధంగా ఉన్నట్లు భారత్ తమకు తెలిపిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. ఖతార్ పర్యటనలో ఉన్న ట్రంప్ ఆ దేశ రాజధాని దోహాలో గురువారం జరిగిన ఓ వాణిజ్య సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ సంచలన ప్రకటన చేశారు. ఎటువంటి సుంకాలూ లేని ఒప్పందానికి సిద్ధంగా ఉన్నట్లు భారత్ నుంచి ప్రతిపాదన వచ్చిందన్నారు. ట్రంప్ ప్రకటనపై భారత విదేశాంగ

మిగతా 2వ పేజీలో...

రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు

విధించడమా?

రాజ్యాంగంలోనే అటువంటి నిబంధన లేనప్పుడు తీర్పు ఎలా ఇస్తారు?.. అది ఎలా చెల్లుతుంది?

200, 201 అధికరణాల కింద గవర్నర్, రాష్ట్రపతికి బిల్లుల ఆమోదం విషయంలో అధికారాలుంటాయి

రాజ్యాంగం ఎలాంటి గడువూ విధించలేదు

అలాంటప్పుడు సుప్రీం కోర్టు ఎలా విధిస్తుంది?

14 ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

143(1) కింద తనకున్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకున్న రాష్ట్రపతి



న్యూఢిల్లీ, మే 15: రాష్ట్రాల బిల్లులను ఆమోదించే విషయంలో గవర్నర్, రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశ్నించారు. శాసనసభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై సుప్రీంకోర్టు గత నెల 8న సంచలన తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇలాంటి అంశాలపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. ఈ తీర్పును రాష్ట్రపతి ప్రశ్నించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని, అది ఎలా చెల్లుబాటు అవుతుందని ముర్ము అడిగారు. రాజ్యాంగంలోని 143(1) అధికరణం ప్రకారం తనకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించుకొన్న రాష్ట్రపతి ముర్ము.. ఈ మేరకు సుప్రీంకోర్టును వివరణ కోరారు. రాజ్యాంగంలోని 200 అధికరణం కింద బిల్లులకు ఆమోదం తెలపడం, నిలిపి ఉంచడం, రాష్ట్రపతి పరిశీలనకు పంపే ప్రక్రియలో గవర్నర్లకు కొన్ని అధికారాలు ఉంటాయి. అదేసమయంలో ఈ ప్రక్రియకు గడువు కూడా ఏమీ లేదు. అలాగే 201 అధికరణం ప్రకారం రాష్ట్రపతికి కూడా

మిగతా 2వ పేజీలో...

సుప్రీంకోర్టును రాష్ట్రపతి వివరణ కోరడమా?

ఇది సుప్రీంను సవాల్ చేయడమే

బీజేపీయేతర రాష్ట్రాల అసెంబ్లీలను స్తంభింపజేయాలని కేంద్రం యోచనా?

తమిళనాడు సీఎం స్టాలిన్ ధ్వజం

చట్టసభలు ఆమోదించిన బిల్లులపై మీకు అభ్యంతరం ఏమిటి!?

కేంద్రాన్ని నిలదీసిన వామపక్షాలు



ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, సీఎస్ విజయానంద్ తదితరులు

రాష్ట్రంలో పరిశ్రమల జోరు

32,271 కోట్ల పెట్టుబడులు | 35,371 ఉద్యోగాలు

తయారీ, పర్యాటకం, ఇంధన రంగాల్లో 19 ప్రతిపాదనలకు ఆమోదం

చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ భేటీ

డ్యాష్‌బోర్డు ద్వారా పురోగతిపై పర్యవేక్షణ

శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం దాకా నిరంతర పరిశీలన బాధ్యత అధికారులదే

పెట్టుబడులు, ఉద్యోగాల వివరాలు పోర్టల్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి

6 ఎస్ఐపీబీ సమావేశాల్లో 76 ప్రాజెక్టులు

మొత్తం 4,95,796 కోట్ల పెట్టుబడులు, 4.5 లక్షల ఉద్యోగాలు

పర్యాటక అభివృద్ధికి 50 వేల హోటల్ రూమ్‌లు అందుబాటులోకి తేవాలి: సీఎం

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఆకర్షితులవుతున్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఆరో రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో మొత్తం రూ.32,271 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలను

మిగతా 11వ పేజీలో...

'సంపద'పై శోకాలు!

జగన్ పత్రిక రోత రాతలు.. ఆదాయం తగ్గిందంటూ అబద్ధాలు

2023-24లో రూ.10 వేలకోట్ల రెవెన్యూ గ్రాంటు

ఆర్థిక సంఘం నిధులూ వచ్చింది అప్పుడే

అవి మినహాయిస్తే రాబడి రూ.1,60,813 కోట్లు

2024-25లో 1,68,443 కోట్లకు పెరిగిన రాబడి

పన్ను ఆదాయం, వాటాలూ ఎక్కువే

అయినా రాబడి తగ్గిందని అబద్ధాలు

13

ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

నేటి నుంచి జూన్ 2 వరకు ట్రాన్స్‌ఫర్లు

మే 31కి ఐదేళ్ల సర్వీస్ పూర్తయితే తప్పనిసరి

ఉమ్మడి జిల్లాలు యూనిట్‌గా ప్రక్రియ

14

మాకు కావాల్సిన ఉగ్రవాదుల చిట్టా పాక్ వద్ద ఉంది!

» ఉగ్రవాదంపై పాక్ చర్యలు తీసుకునేదాకా సింధు జలాల ఒప్పందం రద్దే: జైశంకర్

న్యూఢిల్లీ, మే 15: 'ఆపరేషన్ సిందూర్' ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించామని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భారత్‌కు అప్పగించాల్సిన ఉగ్రవాదుల చిట్టా ఇప్పటికే పాకిస్థాన్ వద్ద ఉందన్నారు. ఉగ్రవాదంపై ఆ దేశం చర్యలు తీసుకునేదాకా సింధు జలాల ఒప్పందం రద్దు కొనసాగుతుందని స్పష్టంచేశారు. దేశాల మధ్య లబ్ధి అనేది ద్వైపాక్షిక చర్చలతోనే సాధ్యమని, పాకిస్థాన్‌తో తమకు చర్చలంటూ ఉంటే అది పీవోకేను తిరిగి అప్పగించడంపైనే అని ప్రధాని మోదీ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కాల్పుల విరమణ ఒప్పందంపై మాట్లాడుతూ.. ఏ దేశం ఆ చర్యను కోరుకుందో అందరికీ స్పష్టంగా తెలుసునన్నారు.

'టీఆర్ఎఫ్'ను ఉగ్ర సంస్థగా ప్రకటించాలని భారత్ యత్నం

ఆపరేషన్ సిందూర్ తర్వాత లష్కరే తాయిబా అనుబంధ గ్రూపు ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)ను ప్రపంచ ఉగ్ర సంస్థగా ప్రకటించేలా భారత్ ఐక్యరాజ్యసమితిలో ప్రయత్నాలు చేస్తోంది. ఈ మేరకు భారత బృందం యూఎన్ భద్రతా మండలి ప్యానెల్‌కు టీఆర్ఎఫ్ కార్యకలాపాల గురించి వివరించింది. ఆంక్షల కమిటీ పర్యవేక్షణ బృందంతో పాటు ఐరాస భాగస్వామ్య దేశాలతోనూ చర్చించింది. అలాగే యూఎన్ ఆఫీస్ ఆఫ్ కౌంటర్ టెర్రరిజం, కౌంటర్ టెర్రరిజం కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరేట్ ఉన్నతాధికారులతోనూ భారత బృందం భేటీ అయింది.

ధూర్త పాక్ చేతిలో అణ్వాయుధాలు క్షేమం కాదు

» వాటిని ఐఏఈఏ పరిధిలోకి తేవాలి: రాజ్‌నాథ్ సింగ్

శ్రీనగర్, మే 15: పాకిస్థాన్ వంటి బాధ్యతారహితమైన, ధూర్త దేశం చేతిలో అణ్వాయుధాలు ఉండడం సురక్షితం కాదని, వాటిని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) పరిధిలోకి తెచ్చి, పర్యవేక్షించాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాక్‌తో చర్చలంటూ జరిగితే అది ఉగ్రవాదం నిర్మూలన, పాక్ ఆక్రమిత కశ్మీర్ అంశాలపైనే జరుగుతాయని స్పష్టం చేశారు. భారత్ సాయుధ దళాల సాయంతో త్వరలో ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తుందన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి గురువారం రాజ్‌నాథ్ జమ్మూ కశ్మీర్ పర్యటనకు వచ్చారు. శ్రీనగర్‌లోని బాదామి బాగ్ కంటోన్మెంట్‌లో సైనికులను కలిసి మాట్లాడారు. వారి ధైర్య సాహసాలను కొనియాడారు. పాకిస్థాన్ అణు బెదిరింపులను ఏమాత్రం లెక్క చేయకుండా ఉగ్ర స్థావరాలపై దాడులు చేశామని, ఇదే భారత్ సంకల్ప బలానికి నిదర్శనమని చెప్పారు.

మన బలగాల ధైర్యసాహసాలు భేష్: ఆర్మీ చీఫ్

శ్రీనగర్/జమ్మూ, మే 15: జమ్మూ కశ్మీర్ బారాముల్లా జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలను ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది గురువారం సందర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో, పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడంలో ఎల్‌వోసీ వెంబడి అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించిన బలగాలను ప్రశంసించారు. శత్రువుల నుంచి ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. చినార్ కార్ప్స్‌కు చెందిన డాగర్ విభాగాన్ని ఆర్మీ స్టాఫ్ చీఫ్ (సీవోఏఎస్) సందర్శించారని 'ఎక్స్'లో చేసిన పోస్టులో సైన్యం తెలిపింది. కాగా, ఆపరేషన్ సిందూర్ ద్వారా పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నందుకు సాయుధ దళాలను చూసి దేశం గర్విస్తోందని జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పేర్కొన్నారు.

మళ్లీ యుద్ధానికి దిగితే జాగ్రత్త!

» మోదీకి పాక్ ప్రధాని హెచ్చరిక.. ఆపై చర్చలకు ఆహ్వానం

» కశ్మీరు, సింధు జలాలపై మాట్లాడుకుందామని వ్యాఖ్య

ఇస్లామాబాద్, మే 15: 'ఆపరేషన్ సిందూర్'లో భారత్ చేతిలో చావు దెబ్బ తిన్నా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ యుద్ధ నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఇండియా మరోసారి తమపై యుద్ధానికే దిగితే సర్వస్వం కోల్పోతుందని హెచ్చరించారు. బుధవారం తమ సియాల్‌కోట్ వైమానిక స్థావరానికి వెళ్లి సిబ్బందితో మాట్లాడారు. తాజా ఆపరేషన్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి పాక్‌కు చెందిన 11 ఎయిర్‌బేస్‌లను నేలమట్టం చేసినప్పటికీ.. 1971 నాటి ఓటమికి పగతీర్చుకున్నామని షరీఫ్ అనడం గమనార్హం. మోదీ పేరెత్తుతూ యుద్ధానికి సన్నద్ధంగా ఉన్నామని చెప్పారు. మరోసారి తమపై దాడికి దిగితే అన్నీ కోల్పోతారని బెదిరించారు. అయితే యుద్ధానికి, చర్చలకు కూడా తాము సిద్ధమన్నారు. కశ్మీరు మంటను చల్లార్చుదామని.. అదే సమయంలో సింధు జలాల ఒప్పందంపై చర్చిద్దామని ఆహ్వానించారు. 'ఏది ఎంచుకుంటారో ఇక మీ ఇష్టం. సింధు జలాలపై మమ్మల్ని ఆదేశించే ప్రయత్నాలు చేయొద్దు. అదే మనకు లక్ష్మణ రేఖ. ఆ నీటిని మళ్లించాలన్న యోచనే వద్దు. నెత్తురు, నీరు కలిసి ప్రవహించలేవన్నది వాస్తవం' అని ఆయన పేర్కొన్నారు. కాగా.. సింధు జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేస్తూ భారత్ నిర్ణయం తీసుకున్న మూడు వారాల తర్వాత పాక్ అధికారికంగా స్పందించింది. ఈ అంశంపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఆ దేశ జలవనరుల కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తాజా భారత జలశక్తి కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి లేఖ రాశారు.

పాక్‌లో రేడియేషన్ లీక్ అవ్వలేదు: ఐఏఈఏ

న్యూఢిల్లీ, మే 15: పాకిస్థాన్‌లోని అణ్వాయుధ నిల్వల నుంచి ఎలాంటి అణుధార్మికత(రేడియేషన్) లీక్ అవ్వలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) స్పష్టం చేసింది. భారత్ 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా నిర్వహించిన దాడుల్లో పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్‌లో ఉన్న స్థావరాలకు నష్టం వాటిల్లినట్లు వస్తున్న వార్తలను ఐఏఈఏ పరోక్షంగా ఖండించింది. తమకున్న సమాచారం మేరకు పాక్‌లోని న్యూక్లియర్ కేంద్రాల వద్ద ఎలాంటి లీకేజీ లేదని పేర్కొంది. అటు భారత వైమానిక అధికారి, ఎయిర్ మార్షల్ ఏకే భారతి కూడా తాము కిరానా హిల్స్‌ను టార్గెట్‌గా చేసుకోలేదని ఇంతకు ముందే ప్రకటించిన విషయం తెలిసిందే..!

కాల్పుల విరమణ కొనసాగింపు

» ఈ నెల 18న మళ్లీ భారత్, పాక్‌ల డీజీఎంవోల భేటీ!

న్యూఢిల్లీ, మే 15: భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణను కొనసాగించాలని నిర్ణయించినట్లు భారత మిలటరీ ఆపరేషన్ల డైరెక్టర్ జనరల్ (డీజీఎంవో) వర్గాలు తెలిపాయి. ఈ నెల 10న ఇరు దేశాల డీజీఎంవోల మధ్య హాట్‌లైన్‌లో జరిగిన సమావేశంలో కాల్పుల విరమణకు నిర్ణయించిన విషయం తెలిసిందే..! వీరి మధ్య ఈ నెల 18న మరోమారు సమావేశం జరగనున్నట్లు తెలుస్తోంది. తదుపరి నిర్ణయం వెలువడే వరకు.. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఉంటుందని భారత వర్గాలు తెలిపాయి.

కర్నల్ సోఫియాను క్షమాపణలు కోరండి

» ఎంపీ మంత్రి విజయ్ షాకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మే 15: ఆపరేషన్ సిందూర్‌లో కీలకంగా వ్యవహరించిన కర్నల్ సోఫియా ఖురేషీ పట్ల అవమానకర వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా (బీజేపీ) పట్ల గురువారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెకు క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది. హైకోర్టుకు స్వయంగా వెళ్లి క్షమాపణలు అందజేయాలని సూచించింది. కర్నల్ సోఫియాను 'ఉగ్రవాదుల సోదరి' అని మంత్రి అభివర్ణించడంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయ్ షాపై మధ్యప్రదేశ్‌లో క్రిమినల్ కేసు నమోదు కాగా, దానిపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. అరెస్టు చేయకుండా అడ్డుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా 'ఒక్క రోజులో ఏమీ జరిగిపోదు, మీరెవరో మీకు తెలుసు' అని సీజేఐ వ్యాఖ్యానించారు.

ఆ వ్యాఖ్యలు నా వ్యక్తిగతం: శశిథరూర్

న్యూఢిల్లీ, మే 15: ఆపరేషన్ సిందూర్ సమయంలో తాను చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పష్టం చేశారు. పార్టీ నేతలు లక్ష్మణరేఖను దాటారని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వ్యాఖ్యానించిన నేపథ్యంలో శశిథరూర్ స్పందించారు. తాను పార్టీకి అధికార ప్రతినిధిని కాదని, అదే సమయంలో ప్రభుత్వ ప్రతినిధిని కూడా కాదన్నారు. తాను ఓ భారతీయుడిలా మాత్రమే స్పందించానని ఆయన పేర్కొన్నారు.

22కోట్ల ఏళ్ల నాటి రాక్షసబల్లి అవశేషాలు

» ప్రాణహిత-గోదావరి లోయలో గుర్తింపు

» అన్నారం వద్ద 1980లలోనే అవశేషాల సేకరణ

» అప్పటి నుంచి కొనసాగిన పరిశోధనలు

» తాజాగా ఆ డైనోసార్ వయసు నిర్ధారణ

» రాక్షసబల్లికి 'మలేరీరాపర్ట్ కుట్టీ' అని నామకరణ



న్యూఢిల్లీ, మే 15: మంచు యుగం.. రాతి యుగం నాటి చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు లభ్యమైన తెలంగాణ ఇప్పుడు మరో ప్రాచీన యుగానికి నిలయమని తేలింది. అంటే.. 26 లక్షల సంవత్సరాల క్రితం నాటి మంచు యుగాని కంటే ముందే.. ట్రయాసిక్ యుగంలోని తొలి భాగం(జురాసిక్ యుగం– 20-25 కోట్ల సంవత్సరాల క్రితం)లోనూ తెలంగాణ చరిత్రకు సంబంధించిన ఆధారాలు నిర్ధారణ అయ్యాయి. 1980లలో జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో.. ప్రాణహిత-గోదావరి లోయలోని అన్నారం అనే గ్రామానికి దక్షిణాన కిలోమీటరు దూరంలో శాస్త్రవేత్తలు ఓ రాక్షసబల్లి(డైనోసార్) అవశేషాలను గుర్తించారు. అప్పటి నుంచి కొనసాగిన పరిశోధనలు తాజాగా పూర్తయ్యాయి. ఈ పరిశోధనల్లో ఆ రాక్షసబల్లి వయసు 22.9-23.3 కోట్ల సంవత్సరాల మధ్య ఉంటుందని నిర్ధారణ అయ్యింది. ఆ అవశేషాలు ట్రయాసిక్ యుగంలో జీవించిన హరేరాసారియా వర్గానికి చెందినది శాస్త్రవేత్తలు తేల్చారు. ఇది మాంసాహార డైనోసార్. దక్షిణ అమెరికా వెలుపల ఈ జాతి రాక్షసబల్లిని కనుక్కోవడం ఇదే మొదటి సారి. ఈ డైనోసార్‌కు శాస్త్రవేత్తలు 'మలేరీరాప్టర్ కుట్టీ' అని పేరు పెట్టారు. ప్రాణహిత-గోదావరి లోయల్లోని మలేరీ ఘాట్ల వద్ద ఈ డైనోసార్ అవశేషాలు లభించడంతో ఆ ప్రాంతం పేరును.. తొలిసారి దీన్ని కనుగొన్న శాస్త్రవేత్త తారావత్ కుట్టీ పేరును కలిపి.. దీనికి 'మలేరి రాప్టర్ కుట్టీ' అని నామకరణం చేశారు. రాతి యుగానికి ముందు మంచు యుగం.. అంతకు ముందు ఉష్ణయుగం ఉన్నట్లు చరిత్రకారులు చెబుతుంటారు. ట్రయాసిక్ యుగంలోనూ వేడి ఎక్కువగా ఉండేదని చెబుతారు. అప్పటి వాతావరణ మార్పులకు అనుగుణంగా డైనోసార్లు ఎలా అభివృద్ధి చెందాయనే పరిశోధనలు ఇంకా సాగుతున్నాయి. తెలంగాణలో లభించిన డైనోసార్ అవశేషాలతో.. ఈ పరిశోధనల్లో మరింత వేగం పుంజుకోనున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు

విధించడమా?

(మొదటిపేజీ తరువాయి)





అధికారాలు ఉంటాయి. ఆ అధికరణంలో కూడా గడువు విధించలేదు. ఈ నేపథ్యంలోనే బిల్లుల ఆమోదానికి గవర్నర్, రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు విధించడంపై ముర్ము 14 ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. ఈ అంశంపై స్పందించేందుకు సుప్రీంకోర్టు నూతన సీజేగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

రాష్ట్రపతి సుప్రీంకోర్టును అడిగిన ప్రశ్నలివే..

1. గవర్నర్ వద్దకు బిల్లులు వచ్చినప్పుడు ఆర్టికల్ 200 కింద ఆయనకు ఉండే రాజ్యాంగపరమైన అవకాశాలు ఏంటి?
2. ఆ అవకాశాల విషయంలో మంత్రివర్గం సలహాలకు గవర్నర్ కట్టుబడి ఉండాలా?
3. ఆర్టికల్ 200 కింద గవర్నర్ విచక్షణ మేరకు తీసుకునే నిర్ణయంపై న్యాయ సమీక్ష చేయొచ్చా?
4. ఆర్టికల్ 200 కింద గవర్నర్ తీసుకునే నిర్ణయాలపై న్యాయ పరిశీలన చేయకుండా ఆర్టికల్ 361 ప్రకారం పూర్తిగా నిషేధించవచ్చా?
5. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్లకు అధికారాలు ఉండగా.. రాజ్యాంగపరంగా ఎలాంటి గడువూ విధించకపోయినా.. బిల్లుల ఆమోద ప్రక్రియలో వారికి కోర్టులు గడువులు విధించవచ్చా? ఏ ప్రక్రియను అనుసరించాలనే విషయాన్ని సూచించవచ్చా?
6. ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి విచక్షణాధికారాలపై న్యాయ సమీక్ష చేయొచ్చా?
7. రాష్ట్రపతికి కోర్టులు గడువు విధించవచ్చా? ఆర్టికల్ 201 ప్రకారం విచక్షణాధికారాల వినియోగానికి సంబంధించిన ప్రక్రియను సూచించవచ్చా?
8. గవర్నర్ రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయం తీసుకునే విషయంలో రాష్ట్రపతి తప్పనిసరిగా ఆర్టికల్ 143 ప్రకారం సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని తీసుకోవాలా?
9. అధికారికంగా చట్టం అమల్లోకి రాకముందు.. ఆర్టికల్ 200, 201 కింద గవర్నర్, రాష్ట్రపతి తీసుకునే నిర్ణయాలు న్యాయబద్ధమేనా?
10. ఆర్టికల్ 142 ద్వారా రాష్ట్రపతి లేదా గవర్నర్‌కు సంక్రమించిన రాజ్యాంగపరమైన అధికారాలను మార్చడం లేదా నిరాకరించడం న్యాయ వ్యవస్థకు సాధ్యమా?
11. ఆర్టికల్ 200 కింద గవర్నర్ ఆమోదం లేకుండానే రాష్ట్రంలో చట్టం అమల్లోకి వస్తుందా?
12. రాజ్యాంగ వివరణకు సంబంధించిన అంశాలున్న కేసుల్లో తీర్పులు ఇచ్చే ముందు ఆర్టికల్ 145(3) కింద కనీసం ఐదుగురు సభ్యులున్న విస్తృత ధర్మాసనానికి సిఫారసు చేయాల్సిన బాధ్యత సుప్రీం ధర్మాసనానికి ఉండదా?
13. ఆర్టికల్ 142 కింద విధానపరమైన అంశాల్లో చట్టపరమైన, రాజ్యాంగపరమైన నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు ఇచ్చే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా?
14. కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు ఆర్టికల్ 131 పరిధిలో కాకుండా, వాటిని పరిష్కరించే అధికారాన్ని రాజ్యాంగం సుప్రీంకోర్టుకు కల్పించిందా?

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇదే..

తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీనికి సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి/గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. బిల్లులను వెనక్కి పంపితే అందుకు గల కారణాలనూ తెలపాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తేల్చిచెప్పింది. రాజ్యాంగంలోని 142వ అధికరణం ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని తెలిపింది.

భారత్ సూపర్ ఆఫర్!

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి జైశంకర్ స్పందిస్తూ.. 'భారత్ అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. అవి సంక్లిష్టమైనవి. అన్నింటిపైనా స్పష్టత వచ్చే వరకూ నిర్ణయం తీసుకోవటం అంటూ ఉండదు. ఏ వాణిజ్య ఒప్పందమైనా ఇరుదేశాలకు లబ్ధి చేకూర్చాలి. దీనిపై ముందే తీర్పులు ప్రకటించేయటం అపరిపక్వత అవుతుంది' అని పేర్కొన్నారు. కాగా, భారత్ సుంకాలు వేయబోనని చెప్పిందన్న ట్రంప్ ప్రకటనపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పలు ప్రశ్నలు సంధించారు. 'కేంద్ర వాణిజ్యమంత్రి ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ట్రంపేమో దోహా నుంచి మరో భారీ ప్రకటన చేశారు. ప్రధానమంత్రి ఈ వ్యవహారంపై ఏమీ మాట్లాడటం లేదు. ఇంతకూ ఆయన (మోదీ) దేనికి అంగీకరించారు? ఆపరేషన్ సిందూర్ నిలిపివేతకు ట్రంప్ ప్రకటనకు మధ్య ఏమైనా సంబంధం ఉందా?' అని పేర్కొన్నారు. మరోవైపు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఖరారు కోసం చర్చలు జరిపేందుకు కేంద్ర వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. భారత ఉత్పత్తుల మీద ట్రంప్ ఇటీవల 26 శాతం సుంకం విధించి, ఆ తర్వాత 90 రోజుల తాత్కాలిక మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ గడువు ముగియక ముందే ఇరుదేశాల వాణిజ్య ఒప్పందాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని భారత్ ప్రయత్నిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

భారత్‌లో వద్దు.. అమెరికాలో నిర్మించండి

దోహా వాణిజ్య సదస్సులో ట్రంప్ మరో వివాదాస్పద ప్రకటన చేశారు. చైనా నుంచి భారత్‌కు ఐఫోన్ ప్లాంట్లను భారీ ఎత్తున తరలిస్తున్న ఆపిల్ కంపెనీకి ఆ పని చేయవద్దని ట్రంప్ సూచించారు. ఆపిల్ సీఈఓ టిమ్‌కుక్‌తో అంతకుముందు రోజు జరిగిన సంభాషణ వివరాలను ఈ మేరకు వెల్లడించారు. భారత్‌లో నిర్మించేబదులు అమెరికాలో ఐఫోన్ తయారీ ప్లాంట్లను నిర్మించాలని టిమ్‌కు సూచించానని, భారత్ తన అవసరాలు తాను చూసుకోగలదని చెప్పానన్నారు. ఇక మీదట అమెరికాలో యాపిల్ కంపెనీల్లో ఉత్పత్తి పెరగనుందన్నారు. అయితే, భారత్‌లో పెట్టుబడులకు సంబంధించి తమ ప్రణాళికలపై ట్రంప్ ప్రకటన ప్రభావం ఉండబోదని యాపిల్ కంపెనీ ఉన్నతాధికారులు స్పష్టం చేసినట్లు కేంద్రప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. యాపిల్ ఉత్పత్తుల తయారీ ప్రధాన కేంద్రాల్లో ఒకటిగా భారత్‌ను చూస్తామని వారు తెలిపినట్లు పేర్కొన్నాయి.



భారత్-పాక్ యుద్ధం ఆపటానికి సాయపడ్డా

భారత్-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపినట్లుగా పలుమార్లు చెప్పుకున్న ట్రంప్ తాజాగా కాస్త తగ్గారు. ఇరుదేశాల సమస్యను తానే మొత్తంగా పరిష్కరించకపోయినా, పరిష్కరించేందుకు సాయపడ్డానని తెలిపారు. ఖతార్‌లోని అల్ ఉదీద్ వైమానిక స్థావరంలో అమెరికా సైనికులను ఉద్దేశించి మాట్లాడుతూ, 'భారత్ పాకిస్థాన్ మధ్య పరిస్థితి రోజురోజుకీ తీవ్రమవుతూ వచ్చింది. ఆ సమయంలో నేను వారితో.. యుద్ధం బదులు వ్యాపారం చేసుకోవాలని చెప్పాను. దానికి ఇరుదేశాలూ చాలా సంతోషించాయి. వాళ్లు వెయ్యేళ్లుగా కొట్లాడుకుంటున్నారు. నేను దాన్ని ఆపగలనని చెప్పా. ఆపా. నేను దేన్నైనా ఆపగలను, పరిష్కరించగలను' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

తుర్కియే సంస్థ 'సెలెబి'పై వేటు..

» విమానాశ్రయాల్లో భద్రతా సేవల అనుమతుల రద్దు

» జాతీయ భద్రత దృష్ట్యా తక్షణమే అమల్లోకి..: బీసీఏఎస్

న్యూఢిల్లీ, మే 15: శత్రు దేశం పాకిస్థాన్‌కు వెన్నుదన్నుగా నిలుస్తున్న తుర్కియేపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. కేంద్రం కూడా చర్యలకు ఉపక్రమించింది. దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో భద్రతాపరమైన సేవలను అందిస్తున్న తుర్కియేకు చెందిన సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ఇండియాపై వేటు వేసింది. ఆ సంస్థ సెక్యూరిటీ క్లియరెన్స్ (భద్రతా అనుమతుల)ను రద్దు చేస్తున్నట్లు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) గురువారం ప్రకటించింది. జాతీయ భద్రత దృష్ట్యా తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కొచ్చి, అహ్మదాబాద్, గోవా, కన్నూర్ విమానాశ్రయాల్లో ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ఇండియా గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలను అందిస్తోంది. ఇక తుర్కియేతో పాటు పాక్‌కు మద్దతుగా అజర్‌బైజాన్‌లతో పర్యాటకం, వాణిజ్యం సహా వివిధ రంగాల్లో సంబంధాలను తెగదెంపులు చేసుకోవాలని కేంద్రం యోచిస్తోంది. రాబోయే రోజుల్లో ఆ రెండు దేశాలకు వెళ్లే వారి సంఖ్య, అక్కడ సినిమాల చిత్రీకరణలు గణనీయంగా తగ్గిపోవచ్చంటూ అధికార వర్గాలు చెబుతున్నాయి. 'భారత్ నుంచి యేటా లక్షలాది మంది ఆ రెండు దేశాలను సందర్శిస్తున్నారు. డెస్టినేషన్ వెడ్డింగ్‌లు, సినిమా చిత్రీకరణలకు కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఆ దేశాలకు భారీగా ఆదాయం సమకూరుతోంది. రాబోయే రోజుల్లో ఆ దేశాల పర్యటనలకు ప్రభుత్వం సహకరించకపోవచ్చు.. సినిమా షూటింగ్‌లు తదితరాలకు మద్దతు ఉండకపోవచ్చు' అంటూ సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే తుర్కియే, అజర్‌బైజాన్ ఉత్పత్తులు, ఆ దేశాల పర్యటనలను బహిష్కరించాలంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.

విదేశీ లాయర్లపై కఠిన ఆంక్షలు

» వస్తున్నట్టు ముందుగా బార్ కౌన్సిల్‌కు చెప్పాలి

» కక్షిదారు వివరాలివ్వాలి.. కొత్త నిబంధనలు జారీ

న్యూఢిల్లీ, మే 15: భారత్‌లోని కక్షిదారుల తరఫున వాదనలు వినిపించేందుకు వచ్చే విదేశీ న్యాయవాదుల విషయంలో కఠిన నిబంధనలు జారీ అయ్యాయి. గతంలో విదేశీ లాయర్లు వచ్చి వాదనలు వినిపించేందుకు 'ఫ్లై ఇన్.. ఫ్లై అవుట్' విధానం అమలయ్యేది. వారు వచ్చి కేవలం వాదనలు వినిపించి వెళ్లిపోయేవారు. 2023లో తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం విదేశీ, అంతర్జాతీయ చట్టాలకు సంబంధించిన కేసులు, కార్పొరేట్ చట్టం కేసులు వాదించేందుకు కార్యాలయాలు తెరవవచ్చు. ప్రస్తుతం కార్యాలయాలు తెరవకుండా కేవలం వాదనలు వినిపించేందుకు వచ్చే విదేశీ లాయర్లకు కొన్ని పరిమితులు పెడుతూ తాజాగా నిబంధనలు విడుదలయ్యాయి. దీని ప్రకారం వాదనలు నిమిత్తం భారత్ వచ్చే లాయర్లు ఆ విషయాన్ని ముందుగా బార్ కౌన్సిల్‌కు తెలియజేయాలి. క్లయింట్ సమాచారం, కాంటాక్టు వివరాలు ఇవ్వాలి. ఈ సమాచారంతో డిక్లరేషన్ అందజేయాలి. 12 నెలల్లో 60 రోజులకు మించి భారత్‌లో ఉండడానికి వీల్లేదు. అందువల్ల చేసే పని, ఎంత కాలం ఉండదలచుకున్నారనే విషయాలను ముందుగానే వెల్లడించాలి. దీనిని కొందరు న్యాయవాదులు వ్యతిరేకిస్తున్నారు. సరళీకరణ పేరుతో మరిన్ని ఆంక్షలు పెట్టారని వ్యాఖ్యానిస్తున్నారు. విదేశీ స్టాక్ లిస్టింగ్ కేసులు ఎక్కువ సమయం తీసుకుంటాయని, అలాంటప్పుడు 60 రోజుల వ్యవధి సరిపోదని అంటున్నారు. తప్పనిసరిగా కార్యాలయాలు ప్రారంభించాలనడం, బార్ కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వాలనడం సరికాదని చెబుతున్నారు. కార్యాలయాలు ఏర్పాటు చేయకుండానే వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వడం వల్ల ఎక్కువ మంది విదేశీ లాయర్లు వచ్చే అవకాశం ఉందని ఇంకొందరు భావిస్తున్నారు. స్థానికులకు నష్టం జరుగుతుందన్న కారణంతో విదేశీ లాయర్ల రాకను మొదటి నుంచీ బార్ కౌన్సిల్ వ్యతిరేకిస్తోంది.

లోకం తీరు



సుప్రీంకోర్టును రాష్ట్రపతి వివరణ కోరడమా?: స్టాలిన్

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా తమిళనాడు గవర్నర్ ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉంచడాన్ని తప్పుబడుతూ తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టును రాష్ట్రపతి ద్వారా కేంద్రం వివరణ కోరటంపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకున్న ఈ చర్య ద్వారా రాష్ట్ర గవర్నర్ బీజేపీ ప్రోద్బలంతోనే ప్రజాస్వామయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కించపరిచేలా వ్యవహరించినట్టు సుస్పష్టమవుతోందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది రాజ్యాంగానికి వ్యతిరేకంగా వెలువడే చర్యలను తనకున్న విచక్షణాధికారం ద్వారా అడ్డుకునే సమర్థత కలిగిన సర్వోన్నత న్యాయస్థానానికి ప్రత్యక్ష సవాలు విసరటమే తప్ప మరొకటి కాదన్నారు. 'బిల్లుల ఆమోదంలో నిరవధిక జాప్యాన్ని అనుమతించడం ద్వారా గవర్నర్ ఆటంకాలను కేంద్రప్రభుత్వం చట్టబద్ధం చేయాలనుకుంటోం దా? బీజేపీయేతర రాష్ట్రాల శాసనసభలను స్తంభింపజేయాలని అనుకుంటోందా?' అని ఆయన ప్రశ్నించారు.

మీకు అభ్యంతరం ఏమిటి!?: లెఫ్ట్

న్యూఢిల్లీ, మే 15: బిల్లుల ఆమోదానికి గవర్నర్లకు డెడ్‌లైన్ విధిస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్రపతి ద్వారా వివరణ కోరే మార్గాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంచుకోవడాన్ని వామపక్షాలు తప్పుబట్టాయి. ఈ చర్యను తమ పార్టీ ఖండిస్తోందని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ స్పష్టం చేశారు. ఇదే అంశంపై తమిళనాడు సీఎం స్టాలిన్ పోస్టును ప్రస్తావిస్తూ ఆయన ఎక్స్‌లో స్పందించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన చట్టసభలు రెండుసార్లు ఆమోదించి పంపిన చట్టాలను ఆమోదించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వచ్చిన అభ్యంతరం ఏమిటని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా నిలదీశారు.

2035 నాటికి కొత్తగా వచ్చే కార్లన్నీ డ్రైవర్ లెస్సే!

» టెస్లా ఏఐ సాఫ్ట్‌వేర్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అశోక్ ఎల్లుస్వామి

న్యూఢిల్లీ, మే 15: 2035 నాటికి డ్రైవర్ లెస్ కార్లు మాత్రమే తయారవుతాయని ఎలక్ట్రిక్ కార్ల సంస్థ టెస్లాలో ఏఐ సాఫ్ట్‌వేర్ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్న అశోక్ ఎల్లుస్వామి అన్నారు. డ్రైవర్ రహిత కార్లదే భవిష్యత్తు అని పేర్కొన్నారు. భారత సంతతికి చెందిన అశోక్ ఎల్లుస్వామి ఓ పాడ్‌కాస్ట్‌లో ఈ మేరకు మాట్లాడారు. "2035 నాటికి అన్నీ సెల్ఫ్ డ్రైవింగ్ కార్లే తయారవుతాయి. భవిష్యత్తులో ఎవరైనా సరదాగా కారు నడుపుదామని అనుకుంటే పాత మోడల్ కారు కొనుగోలు చేయాల్సిందే. డ్రైవర్ లెస్ కార్లదే భవిష్యత్తు" అని అన్నారు. అలాగే, అమెరికాలోని కొన్ని నగరాల్లో డ్రైవర్ లెస్ కార్లను అందుబాటులోకి తీసుకురావాలని టెస్లా ప్రయత్నాలు చేస్తోందని అశోక్ ఎల్లుస్వామి వెల్లడించారు.

సముద్రపు నీటి డీశాలినేషన్‌లో ముందడుగు

» స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేసిన డీఆర్‌డీవో

» ఐసీజీ నౌకలోని ప్లాంట్‌లో విజయవంతంగా పరీక్ష

న్యూఢిల్లీ/అల్వాల్, మే 15 (ఆంధ్రజ్యోతి): సముద్రపు నీటిని మంచినీటిగా మార్చే ప్రక్రియను అభివృద్ధి చేయడంలో డీఆర్‌డీవో కీలక విజయం సాధించింది. అధిక పీడనం కలిగిన సముద్రపు నీటి డీశాలినేషన్ కోసం స్వదేశీ నానోపోరస్ మల్టీలేయర్డ్ పాలిమెరిక్ మెంబ్రేన్‌ను అభివృద్ధి చేసింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా భారత తీర రక్షక దళం(ఐసీజీ) అవసరాల కోసం కాన్పూర్‌లోని డీఆర్‌డీవో ల్యాబ్ అయిన డిఫెన్స్ మెటీరియల్స్ స్టోర్స్ అండ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (డీఎంఎస్ఆర్‌డీఈ)లో ఈ సాంకేతికతను రికార్డు స్థాయిలో 8నెలల్లో అభివృద్ధి చేసినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఐసీజీకి చెందిన ఆఫ్‌షోర్ పెట్రోలింగ్ నౌకలోని డీశాలినేషన్ ప్లాంట్‌లో డీఎంఎస్ఆర్‌డీఈ నిర్వహించిన ప్రారంభ సాంకేతిక పరీక్షలు విజయవంతమైనట్లు పేర్కొంది. ఇప్పటి వరకూ జరిపిన పరీక్షలు సంతృప్తికరమైన ఫలితాలను ఇచ్చాయి. 500గంటల పాటు పరీక్షించిన తర్వాత దీనికి ఐసీజీ తుది ఆమోదం జారీ చేయనుంది. స్వల్ప మార్పుల అనంతరం తీర ప్రాంతాల్లో సముద్రపు నీటి డీశాలినేషన్ ప్రక్రియకు ఈ సాంకేతికత దోహదం చేస్తుందని భావిస్తున్నారు.

హాంకాంగ్, సింగపూర్‌లో కొవిడ్ అలజడి..!

» ఆసియా అంతటా పెరుగుతున్న కరోనా కేసులు

న్యూఢిల్లీ, మే 15: ఐదేళ్ల క్రితం యావత్ ప్రపంచాన్ని గడగడలాడించిన కొవిడ్-19 ఆసియాలో మళ్లీ అలజడి రేపుతోంది. జనసాంద్రత ఎక్కువగా ఉండే హాంకాంగ్, సింగపూర్‌లలో కొవిడ్ కేసులు పెరుగుతున్నాయని ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా హాంకాంగ్‌లో ఈ వారంలో కరోనా వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని స్థానిక ఆరోగ్యశాఖ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ నెల 3 నుంచి ఇక్కడ కొవిడ్ పాజిటివ్ కేసుల తీవ్రత పెరిగిందని, అలాగే కొన్ని మరణాలు కూడా నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. మరోవైపు సింగపూర్‌లో కూడా కొవిడ్ అలజడి కనిపిస్తోంది. ఈ నెల 3వ తేదీ తర్వాత ఏడు రోజుల్లోనే కేసుల సంఖ్య దాదాపు 28 శాతం పెరిగిందని స్థానిక ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం

శ్రీనగర్/ ట్రాల్, మే 15: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నిషేధిత జైషే మహ్మద్ సంస్థకు చెందిన ముగ్గురు కరుడుగట్టిన ఉగ్రవాదులు హతమయ్యారని పోలీసులు తెలిపారు. పుల్వామా జిల్లా అవంతిపోరాలోని ట్రాల్ పట్టణానికి సమీపంలోని నాదిర్ గ్రామంలో ఉగ్రవాదులున్నారని నిఘా వర్గాలకు ఉప్పందింది. దీంతో ఉగ్రవాదులు దాక్కున్న ఆ గ్రామాన్ని భద్రతాదళాలు చుట్టుముట్టి గాలింపు చేపట్టాయి. నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో దాక్కున్న ఉగ్రవాదులు భద్రతాబలగాలను చూసిన ఉగ్రవాదులు కాల్పులకు దిగినట్లు డ్రోన్ చిత్రీకరించిన వీడియోలో కనిపిస్తోంది. దీంతో భద్రతాదళాలు ఆత్మరక్షణార్థం జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు. వారిని జైషే మహ్మద్ సంస్థ ఉగ్రవాదులు ఆసిఫ్ అహ్మద్ షేక్, అమీర్ నజీర్ వనీ, యవార్ అహ్మద్ భట్‌గా గుర్తించిన భద్రతా దళాలు.. ఆ ముగ్గురూ పుల్వామా జిల్లా వాసులేనని తెలిపాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అగ్నిశ్వాసలు

నైరుతి ఋతుపవనాలు ముందుగానే వచ్చేస్తున్నాయని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. వర్షాగమనం ఆనందప్రదమే, గ్రీష్మతాపం నుంచి ఉపశమనం ఉల్లాసకరమే అయినా ప్రకృతి నుంచి ఎదురవుతున్న ఒక ఉపద్రవాన్ని ఉపేక్షించకూడదు. విషమిస్తున్న వేడిగాడ్పులే ఆ ముప్పు. నిజానికి ఈ ఏడాది ఋతుపవనాలే కాదు, వేసవి సైతం ముందుగానే ప్రవేశించింది. ఇది ప్రస్తుత సంవత్సరంలోనే కాదు, సుదీర్ఘకాలం ఏటా పునరావృతమయ్యే పరిణామమని వాతావరణ నిపుణులు చెప్పుతున్నారు. 'న్యాయ ధర్మములు బీడులు కాగా/ ఎండాకాలం ఎగసి మండినది' అని వాతావరణ మార్పు ప్రభావాలపై ప్రపంచం దృష్టిపెట్టని కాలంలోనే తెలుగు కవి ఒకరు ఆక్రోశిస్తే ఉగ్రమవుతున్న ఉష్ణోగ్రతలు ప్రజల డీఎన్‌ఏలో రసాయనిక మార్పులకు కారణమై అకాల వృద్ధాప్యానికి దారితీయవచ్చని అమెరికన్ శాస్త్రవేత్తలు ఇటీవల హెచ్చరించారు. కవి హృదయం, వైజ్ఞానిక మేధ మనిషి శ్రేయస్సుకు ఆరాటపడ్డాయి, సమస్త లోకులకు జీవనానందాన్ని ఆకాంక్షించాయి. మరి ప్రజల నుంచి అధికారాన్ని పొందిన పెద్ద మనుషులు 'పగళ్లన్నీ పగిలిపోయీ, నిశీథాలూ విశీర్ణిల్లు'తున్న వేసవిరోజుల్లో సామాన్యుల, శ్రామికుల ఆరోగ్యాలను, జీవనాధారాలను కాపాడేందుకు చిత్తశుద్ధితో శ్రద్ధ చూపుతున్నారా?

పనిప్రదేశాల్లో తీవ్ర వేడిగాడ్పులకు గురవుతున్న వారిలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలవారు అత్యధిక శాతంలో ఉంటున్నట్టు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదికలు వెల్లడిస్తున్నాయి. కాయకష్టంతో జీవనోపాధి పొందేవారు ప్రధానంగా ఈ సామాజిక వర్గాలవారే. వ్యవసాయం, నిర్మాణ రంగం జీవనాధారాలుగా ఉన్న ఈ సామాజికులు పని ప్రదేశాలలోనే కాకుండా అధ్వాన్న గృహవసతుల కారణంగా కూడా 'ఉష్ణ అన్యాయం' (థర్మల్ ఇన్జస్టిస్)కు గురవుతున్నారు. అనారోగ్యం బారిన పడి ఆదాయాన్ని, జీవన భద్రతను కోల్పోతున్నారు. ప్రపంచ శ్రామిక జనావళి (240 కోట్లు)లో 70 శాతం మంది తీవ్ర వేడిగాడ్పుల మూలంగా ఆరోగ్య, ఆర్థిక సమస్యలకు లోనవుతున్నారని ఐక్యరాజ్యసమితి నిర్ధారించింది. వేడి గాడ్పుల వైపరీత్యాలలో జెండర్ కోణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉంది. అమెరికా, భారత్, నైజీరియాలలోని కార్మిక జనాభాపై వేడిగాడ్పుల ప్రభావానికి సంబంధించి నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ దేశాలలో ఏటా రెండు లక్షల మందికి పైగా మహిళలు మరణిస్తున్నట్టు వెల్లడయింది. మన దేశంలో వడదెబ్బ మరణాల సంఖ్యను ప్రభుత్వం కచ్చితంగా నమోదు చేయడం లేదు. గత వేసవిలో 17 రాష్ట్రాలలో 733 మంది చండ్రగాడ్పుల మూలంగా చనిపోయినట్టు 'హీట్ వాచ్' నివేదిక పేర్కొనగా, ప్రభుత్వ గణాంకాలు అంతకంటే తక్కువగా ఉన్నాయి. తీవ్ర వేడిగాలుల ప్రభావం గర్భిణీ స్త్రీలపైన, నవజాత శిశువులపైన తీవ్రంగా ఉంటోంది. మన దేశంలో వేడిగాడ్పుల ప్రభావిత అనారోగ్యాలతో మరణించేవారి సంఖ్య 2050 సంవత్సరం నాటికి వేల సంఖ్యలో పెరిగిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడిగాడ్పులతో అసంఘటిత రంగంలోని శ్రామిక జనావళి ఆరోగ్యం, జీవనాధారాలకు ఏర్పడుతున్న ముప్పు కారణంగా భారత్ స్థూల దేశీయోత్పత్తికి 4.5 శాతం మేరకు నష్టం వాటిల్లవచ్చని గత ఏడాది రిజర్వ్‌బ్యాంక్ అంచనా వేసింది.

పట్టణ నగర ప్రాంతాలలో ప్రాణాంతక వేడిగాడ్పుల నెదుర్కొనేందుకు పలు నగరాలలో హీట్ యాక్షన్ ప్లాన్‌లను అమలుపరుస్తున్నారు. అయితే అవి లోపభూయిష్టంగా ఉండడంతో అసంఘటిత రంగ కార్మికులు కనీస ప్రయోజనం పొందలేకపోతున్నారు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ శ్రమ జీవుల సంక్షేమమే లక్ష్యంగా వేడిగాడ్పుల ఉపశమన ప్రణాళికలను రూపొందించి అమలు పరచాలి. ఈ విషయంలో తమిళనాడు ప్రభుత్వం గ్రీన్ తమిళనాడు మిషన్ ద్వారా చేస్తున్న కృషి పథనిర్దేశకమైనదిగా చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వడదెబ్బ మృతులకు చెల్లించే ఎక్స్‌గ్రేషియాను రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు పెంచడం అభినందనీయం. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ వేడిగాడ్పులను ఒక వ్యవస్థీకృత ముప్పుగా కాకుండా ఒక వార్షిక ఇబ్బందిగా మాత్రమే పరిగణిస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఉగ్రవాదంతో జాతీయ భద్రతకు సంభవిస్తున్న ప్రమాదాన్ని అరికట్టేందుకు ఎట్టకేలకు ఒక నిర్ణయాత్మక విధానానికి అంకురార్పణ చేసిన విధంగానే జాతి జనుల ఆరోగ్యానికి, ఆర్థికాభివృద్ధికి ఆటంకమవుతోన్న ఉగ్ర ఉష్ణోగ్రతలను నిరోధించేందుకు జరూరుగా ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలి.

ముగిసిన యుద్ధం, మిగిలిన ప్రశ్నలు!

'మన తోబుట్టువుల, కుమార్తెల సిందూరాన్ని తుడిచివేసిన పర్యవసానమేమిటో నేడు ప్రతి ఉగ్రవాదికి, ప్రతి ఉగ్రవాద సంస్థకు తెలిసివచ్చింది. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక పేరు కాదు, కోట్లాది భారతీయుల మనోభావాలకు ప్రతిబింబం'... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలోని మాటలవి. భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఆపరేషన్ సిందూర్‌లో ఒక విరామం మాత్రమేనని దేశ ప్రజలు విశ్వసించేలా చేసేందుకు ఆయన ప్రయత్నించారు. మోదీ స్వాభావిక వాక్చాతుర్యం, శ్రోతలను సమ్మోహం చేసే మాటకారితనం ఆ ప్రసంగంలో బాగా కనిపించాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న పాకిస్థాన్‌కు భారీ నష్టాన్ని కలిగించడంలో ఆపరేషన్ సిందూర్ సఫలమయిందని మోదీ అన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణ ప్రాతిపదికన కొత్త లక్ష్మణ రేఖలు నిర్దేశిస్తూ పాకిస్థాన్ ప్రభుత్వంతో చర్చలు ఉగ్రవాదం, ఆక్రమిత కశ్మీర్‌పైన మాత్రమే జరుగుతాయని ప్రధానమంత్రి ప్రకటించారు. ఇస్లామాబాద్ పాలకులు అణ్వస్త్రాల బూచిని చూపుతూ పాల్పడుతున్న బ్లాక్ మెయిల్‌కు భారత్ బెదరదు, జడవదు అని, మళ్లీ రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తే కఠినంగా ప్రతిస్పందించేందుకు భారత సైన్యం సదా యుద్ధ సన్నద్ధమై ఉందని నరేంద్రమోదీ హెచ్చరించారు.

ఒకపక్క, ఇక్కడ, ఇలా, భారత రాజకీయాల శక్తిమంతుడు తాను పాకిస్థాన్‌ను కాళ్ళబేరానికి రప్పించా కనే కాల్పుల విరమణ జరిగిందంటూ టీవీలో ప్రసంగిస్తుండగానే అక్కడ వేలమైళ్ళ దూరంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ కథనానికి వరుస తూట్లుపొడిచాడు. తాను, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తీవ్ర ప్రయత్నాలు చేసి దక్షిణ ఆసియాలోని రెండు అణ్వస్త్ర రాజ్యాలను కాల్పుల విరమణకు ఒప్పించామని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచ మీడియా పతాక శీర్షికల్లో ఉండేందుకు మోదీ కంటే ఎక్కువగా ట్రంప్ ఆరాటపడడం గత కొద్ది రోజుల్లో ఇది మూడోసారి. కాల్పుల విరమణకు అంగీకరించినట్టు భారత్, పాకిస్థాన్ ప్రభుత్వాలు ప్రకటించకముందే ట్రంప్ ఆ విషయాన్ని తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. మరి కొద్ది గంటల్లోనే, భారత్, పాకిస్థాన్‌లకు నచ్చచెప్పేందుకు అమెరికా ప్రభుత్వం రాత్రికి రాత్రి చేసిన ప్రయత్నాల గురించి సవివరంగా ట్వీట్ చేశారు. కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు తాను మధ్యవర్తిత్వం నెరపుతానని కూడా ఆయన ప్రతిపాదించారు.

మే 12న వైట్ హౌజ్‌లో మీడియా రోజువారీ గోష్ఠిలో ట్రంప్ ఆశువుగా చేసిన వ్యాఖ్యలు ఇంటా బయటా అసాధారణ వ్యక్తిలా వ్యవహరించే ప్రధాని మోదీని చిన్నబుచ్చేవిగా ఉన్నాయి. భారత్, పాకిస్థాన్‌లతో వాణిజ్య సంబంధాలను పూర్తిగా నిలిపివేస్తామని



ఆకస్మికంగా, అనూహ్యంగా అమలు జరిగిన కాల్పుల విరమణను యుద్ధోన్మాదులు హర్షించలేకపోయారు. యుద్ధం చుట్టూ బీజేపీ నిర్మిస్తూవచ్చిన దేశభక్తియుత, ఉద్వేగపూరిత వాతావరణాన్ని ఒక్కసారిగా ఛిద్రంచేసిన నిర్ణయమది. పాకిస్థాన్‌ను చావు దెబ్బకొట్టే అవకాశం వచ్చినా కూడా, అంతలోగానే అమెరికా ఒత్తిడికి మోదీ ప్రభుత్వం లొంగిపోయి కాల్పుల విరమణకు అంగీకరించిందనే అభిప్రాయం ప్రజలకు కలిగింది.

ఉభయ దేశాల ప్రధానమంత్రులకు గద్దించి చెప్పడం ద్వారా ఈ ఘర్షణ నుంచి విరమించుకునేలా చేశామని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇలా ట్రంప్ తనను వెంటాడడం కొనసాగుతుండడంతో సర్వత్రా తనకు ప్రచారాన్ని, ప్రాధాన్యాన్ని పొందడంలో అనితరసాధ్యుడైన మోదీ, ఇప్పుడు ఆ విషయంలో ఇబ్బందుల్లో పడ్డారు!

భారత్ పాకిస్థాన్‌ల మధ్య సైనిక ఘర్షణలు తమ ప్రయత్నాల వల్లనే నిలిచిపోయానని అమెరికా ఘనంగా చెప్పుకున్న అంశాన్ని, కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు తాను మధ్యవర్తిత్వం నెరపుతానన్న ట్రంప్ ప్రతిపాదనను ప్రధాని మోదీ తన ప్రసంగంలో మాట మాత్రంగానైనా స్పృశించకుండా యథావిధిగా తన ఉద్వేగపూరితమైన ప్రసంగంలో ప్రజలను ముంచెత్తారు. పాకిస్థాన్ నాయకులు తమ ప్రసంగాల్లో అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలుపగా, అమెరికా ఉనికిని భారత్ కనీసమాత్రంగానైనా అంగీకరించలేదు. భారతీయ ఆడపడుచుల నుదుటి 'సిందూరం'ను ఉగ్రవాదులు తుడిచేశారని మోదీ తన ప్రసంగంలో పదే పదే ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో భావోద్వేగాలను పురిగొల్పారు.

అమెరికా వ్యాఖ్యలు, వాటిపై నరేంద్ర మోదీ మౌనం వహించడం ప్రతిపక్షాలకు ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించేందుకు వీలు కల్పించింది. ప్రధానమంత్రిని 'విశ్వగురు'గా ఆరాధిస్తున్న భారతీయ జనతా పార్టీ శ్రేణులను ఈ పరిణామం కలవరపరుస్తోంది. మోదీ తన విదేశీ పర్యటనలలోను లేదా భారత్ పర్యటనకు వచ్చిన అంతర్జాతీయ నాయకులను ప్రేమపూర్వకంగా ఆలింగనం చేసుకోవడం లేదా అభినందనపూర్వకంగా వారి వెన్నుచరచడం పరిపాటి. అలాంటిది ఇప్పుడు ట్రంప్ ఆయన్ను, పాకిస్థాన్ ప్రధానమంత్రిని సమరీతిలో గౌరవించడం, ఇరువురినీ ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాగా పేర్కొనడం ద్వారా మోదీని తీవ్ర ఇబ్బందికి లోను చేశారు. ట్రంప్ తీరుతో మోదీ ప్రతిష్ఠ దెబ్బతిన్నది. విధేయ మీడియా, సామాజిక మాధ్యమాల శ్రేణులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ జరిగిన నష్టాన్ని భర్తీచేయడం అసాధ్యంగా ఉన్నది.

ఆకస్మికంగా, అనూహ్యంగా అమలు జరిగిన కాల్పుల విరమణను యుద్ధోన్మాదులు హర్షించలేకపోయారు. యుద్ధం చుట్టూ బీజేపీ నిర్మిస్తూవచ్చిన దేశభక్తియుత, ఉద్వేగపూరిత వాతావరణాన్ని ఒక్కసారిగా ఛిద్రంచేసిన నిర్ణయమది. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే అవకాశం వ్యర్థమయిందని వారి బాధ. ఉభయ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింతగా తీవ్రమయ్యేందుకు వారు ఎంతగా ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు. పహల్గాం ఊచకోతలకు ప్రతీకారంగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య రగుల్కొనే సైనిక ఘర్షణల గురించి ఈ యుద్ధోన్మాదులు అసాధారణ ఊహలు చేశారు. భారత సైనిక దళాలు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటాయని, బంగ్లాదేశ్‌ను విముక్తం చేసినట్టుగానే బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ శృంఖలాల నుంచి విడిపిస్తాయని వారు ఆశించారు. కానీ, ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టాలు వాటిల్లాయని నిరూపించే గట్టి సాక్ష్యాధారాలు ఏవీ ప్రజల దృష్టికి రాలేదు. పైగా పాకిస్థాన్‌ను చావుదెబ్బకొట్టే అవకాశం వచ్చినా కూడా, అంతలోగానే అమెరికా ఒత్తిడికి మోదీ ప్రభుత్వం లొంగిపోయి కాల్పుల విరమణకు అంగీకరించిందనే అభిప్రాయం ప్రజలకు కలిగింది. ప్రధానమంత్రి వ్యవహరించిన తీరుపట్ల అసంతృప్తితో సామాజిక మాధ్యమాలలో ట్వీట్లు వెల్లువెత్తాయి. కాల్పుల విరమణను ప్రకటించిన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఆయన కుటుంబ సభ్యులకు వ్యతిరేకంగా కూడా పోకిరీ వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పవిత్ర యుద్ధాన్ని ప్రారంభించాలని సంఖ్యానేకులు డిమాండ్ చేశారు. ఈ ధోరణులకు వ్యతిరేకంగా మే 13 రాత్రి మోదీ చాలా కఠినంగా మాట్లాడినప్పటికీ, ఆయన మాటలు వారి ఆవేశాన్ని తగ్గించలేకపోవచ్చు.

కశ్మీర్‌పై పాకిస్థాన్‌తో ఘర్షించడంలో ముందుకు సాగడంపై తమ మద్దతుదారుల ఆకాంక్షలు, అంచనాలను సహేతుకంగా ఉండేలా చేయడంలో ప్రధానమంత్రి, పాలక బీజేపీ చాలా కృషి చేయవలసిన అవసరమున్నది. తీవ్ర జాతీయవాద ఉన్మాదం లేదా దేశీయ రాజకీయాలలో తన ప్రభావ ప్రాబల్యాలు నిర్దేశించే విధానాలను అనుసరించడం వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి ప్రధాని మోదీకి కచ్చితంగా తెలుసు.

పాకిస్థాన్ సమీప భవిష్యత్తులో ఉగ్రవాద, సైనిక దుస్సాహసాలకు పాల్పడే అవకాశం లేదు కనుక భారత్‌కు తక్షణ సవాళ్లు దౌత్య రంగంలోనే ఎదురవుతాయి. అణుయుద్ధం కొద్దిలో తప్పిపోయిందని చెప్పడం ద్వారా కశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయ సమస్యగా చేసేందుకు ఇస్లామాబాద్ ప్రయత్నించి, సఫలమయ్యే అవకాశమున్నది. మే 7 అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు స్పష్టం చేస్తున్న ప్రధానాంశం ఒకటి ఉన్నది. అది: అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ఉన్నందున పాత వ్యూహాత్మక నిశ్చితాలు ఏవీ ఇక చెల్లుబాటు కావు. అంతర్జాతీయ వ్యవహారాలలో తనను తాను ఒక స్వతంత్ర శక్తిగా పరిగణించుకుంటున్న ఇండియా తాత్కాలికంగా ప్రతికూలతలను ఎదుర్కోవలసి రావడం తప్పనిసరి. కశ్మీర్ వివాదంలో అంతర్జాతీయ మధ్యవర్తిత్వాన్ని పాకిస్థాన్ మొదటి నుంచీ అంగీకరిస్తున్న దృష్ట్యా భారత్ సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ వాస్తవాల దృష్ట్యా భారత్ దౌత్య వ్యూహాలు పటిష్ఠంగా ఉండాలి. అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రధానమంత్రి స్వయంగా చొరవ తీసుకోవాలి.

■ అజయ్ బోస్
సీనియర్ పాత్రికేయుడు

(ది క్వింట్)

సిక్కిం విలీనానికి ఏభై ఏళ్ళు

స్వతంత్ర భారత చరిత్రలో సిక్కిం విలీనం ఒక ప్రధాన ఘట్టం. మే 16, 1975న జరిగిన ఈ చారిత్రక ఘట్టానికి ఏభై ఏళ్ళు నిండినందున నాటి గొలుసుకట్టు సంఘటనలు, రాజకీయ పరిస్థితులు, ఇందిరాగాంధీ దూరదృష్టి వంటి అంశాలను సింహావలోకనం చేసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. భారతదేశానికి ఈశాన్య సరిహద్దులో నేపాల్, భూటాన్‌ల నడుమ ఒక రాష్ట్రం సిక్కిం. వైశాల్యంలో గోవాకు ఒక మెట్టు పైన ఉండే సిక్కిం, జనాభా పరంగా అతి చిన్న రాష్ట్రం. ప్రకృతి సౌందర్యానికి, ప్రశాంతతకు నెలవై, హిమాలయాల పర్వతశ్రేణి ఒడిలో ఒదిగి 500 సంవత్సరాలుగా మనుగడ సాగిస్తున్న దీని చరిత్ర ఆద్యంతం ఆసక్తికరమైనదే.

ఎనిమిదవ శతాబ్దంలో పద్మసంభవ (టిబెటన్ భాషలో గురు రింపోచే) అనే బౌద్ధ గురువు టిబెట్‌తో పాటు సిక్కింకు వజ్రయాన బౌద్ధాన్ని పరిచయం చేయగా, కొన్ని శతాబ్దాల తరువాత రాజ వంశీకులు (చొగ్యాల్) దానిని అవలంబించారు. ఇరుగు పొరుగు రాజ్యాలైన నేపాల్, భూటాన్‌ల దాడులకు గురైనప్పుడల్లా సిక్కింను టిబెట్ కాపాడేది. 18వ శతాబ్దపు చివర్లో చైనాకు చెందిన క్వింగ్ రాజులు కొన్నాళ్ళు పాలించగా, 1853లో ఈస్ట్ ఇండియా కంపెనీ (బ్రిటిష్) పరమైంది. ఎన్నో మలుపులు తిరిగిన తరువాత 1918లో బ్రిటిష్ ప్రభుత్వం... రక్షణ, విదేశీ వ్యవహారాలు మినహా సిక్కింకు అంతర్గత వ్యవహారాలలో పూర్తి స్వేచ్ఛనిచ్చింది. సిక్కిం స్టేట్ కాంగ్రెస్ 1948లో రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించడం ప్రారంభించింది. సిక్కిం రాజు– భారత ప్రధాని నెహ్రూ సహాయం కోరగా, భారత్ ఒక దివాన్‌ను, కొంత భద్రతా బలగాన్ని అక్కడకు పంపించింది. అప్పుడు ఉత్పన్నమైన విలీన ప్రతిపాదనను "చిన్నదైన ఒక సార్వభౌమ దేశాన్ని కబళించామన్న అపప్రథ తమకు అక్కర లేదని, పైగా ఆ విలీనం చైనాను రెచ్చగొట్టేదిగా కనిపిస్తుంది" అంటూ తిరస్కరించారు నెహ్రూ. 1950లో భారత రక్షణలో మెసిలే రాజ్యంగా సిక్కిం అవతరించింది.



ఏభై ఏళ్లలో సిక్కిం ఒక ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకుంది. వంద శాతం సేంద్రీయ వ్యవసాయాన్ని కొనసాగిస్తోంది. తలసరి ఆదాయంలో భారత్‌లో ప్రథమ స్థానాన్ని అందుకుంది. ఎటువంటి వేర్పాటు ఉద్యమాలు లేని ఈశాన్య రాష్ట్రంగా సిక్కిం ప్రపంచ పరిశీలకులను ఆశ్చర్యపరిచింది.

1962లో జరిగిన చైనా–భారత్ యుద్ధం భారత రక్షణ వ్యవస్థలో పెను మార్పులకు దారి తీసింది. రక్షణ విషయంలో లాల్ బహదూర్ శాస్త్రి, తరువాత ఇందిరా గాంధీ కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. 1967లో సిక్కిం–చైనా సరిహద్దుల్లో గల నాథులా, చోలా కనుమల వద్ద ఇనుప కంచె వేస్తున్న భారత సరిహద్దు దళాల సైనికులను చైనా సైనికులు వెనక్కు జరగమన్నారు. అయినా భారత దళాలు వెనుకడుగు వేయలేదు. ఫలితంగా ఘర్షణ జరిగింది. నాథులా కనుమ వద్ద సెప్టెంబర్‌లో, చోలాలో అక్టోబర్‌లో జరిగిన ఘర్షణలలో ఇరువైపులా ప్రాణ నష్టం జరిగింది. భారత శక్తిని తక్కువ అంచనా వేసిన చైనా దళాలు, మన సైనికుల తెగువతో వెనుదిరిగారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ సిక్కిం భౌగోళిక, వ్యూహాత్మక ప్రాముఖ్యతపై దృష్టి సారించి, దీర్ఘకాలిక ప్రణాళికా రచనలో నిమగ్నమయ్యారు. సిక్కిం ఉత్తరాన ఉన్న చుంబి లోయపై చైనా కన్నువేసిందని ఆమెకు స్పష్టమైన సంకేతాలు అందాయి. సిక్కిం విషయంలో ఒక బలమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని గ్రహించి, వెంటనే పావులు కదిపారు.

1973లో జరిగిన ప్రజా ఉద్యమం ధాటికి చొగ్యాల్ (సిక్కిం చక్రవర్తిని చొగ్యాల్‌గా పిలిచేవారు) భారత ప్రభుత్వ సహాయాన్ని అర్థించగా, భారత్ 1200 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను పంపి ఉద్యమాన్ని నియంత్రించింది. అయినా 1974లో సిక్కిం ప్రధానమంత్రి కాజీ లెండుప్ దర్జీ, సిక్కింను భారత్‌లో విలీనం చేయమని ఇందిరా గాంధీకి విజ్ఞప్తి చేయగా, ఆ ప్రక్రియకు అంకురార్పణ జరిగింది. విలీనం రెఫరెండం ద్వారా జరగాలని నిర్ణయించి, భారత ప్రభుత్వ బలగాల పర్యవేక్షణలో సిక్కిం ఎలక్షన్ కమిషన్‌కు ఆ పని అప్పజెప్పారు. ఏప్రిల్ 6న భారత్ భద్రతా సైనికులు రాజప్రాసాదంలోకి ప్రవేశించి 243 మంది సిక్కిం సైనికులను నిరాయుధులను చేశారు. దురదృష్టవశాత్తు ఒక సైనికుడు మరణించాడు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా, విలీనానికి మద్దతుగా 59,637 ఓట్లు రాగా, వ్యతిరేకంగా కేవలం 1,496 ఓట్లు పడ్డాయి. ఈ రెఫరెండం ప్రక్రియ మోసపూరితంగా భారత భద్రతా దళాల తుపాకుల కనుసన్నలలో జరిగిందని చైనా, పాకిస్తాన్‌లు విమర్శించాయి. దీనిని తిప్పికొడుతూ ఆజాద్ కశ్మీర్, టిబెట్‌ల వైనాలను ఇందిరాగాంధీ ఉదహరించారు. సిక్కిం విద్యార్థుల నిరసనను మన దళాలు సునాయాసంగా అణచివేశాయి. ఆండ్రూ డఫ్ అనే ఆంగ్ల పాత్రికేయుడు తన 'Sikkim: Requiem for a Himalayan Kingdom' గ్రంథంలో నాటి సంఘటనలు పూసగుచ్చినట్లు వర్ణించాడు.

1975, ఏప్రిల్ 11–16 మధ్య జరిగిన రెఫరెండం భారత్‌లో సిక్కిం విలీనానికి మార్గం సుగమం చేసింది. సిక్కిం భారత్‌లో విలీనానికి రాజకీయ పరిస్థితులకు, సాంస్కృతిక కారణాలు కూడా తోడయ్యాయి. అదే ఏడాది మే 16న పార్లమెంట్‌లో 35వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను 22వ రాష్ట్రంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. మొత్తానికి సిక్కిం విలీనం ద్వారా ఇందిరాగాంధీ తన రాజకీయ నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని మరొకసారి ప్రపంచానికి చాటి చెప్పారు. ఈ ఏభై ఏళ్లలో సిక్కిం ఒక ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకుంది. వంద శాతం సేంద్రీయ వ్యవసాయాన్ని కొనసాగిస్తోంది. తలసరి ఆదాయంలో భారత్‌లో ప్రథమ స్థానాన్ని అందుకుంది. ఎటువంటి వేర్పాటు ఉద్యమాలు లేని ఈశాన్య రాష్ట్రంగా సిక్కిం ప్రపంచ పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. పర్యాటకుల స్వర్గధామమైన ఈ రాష్ట్రం, భారత సరిహద్దులలో ప్రకాశించే మణిపూసగా అభివర్ణించవచ్చు.

○ కొట్టు శేఖర్
ప్రొఫెసర్, మిజోరాం యూనివర్సిటీ

అక్కసుతోనే విష ప్రచారం!

అమరావతి రాజధాని నిర్మాణానికి, రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతూ వ్యాసాలు రాస్తున్నవారే నిజమైన ద్రోహులు. జగన్ ముఠా అమరావతిపై పచ్చి స్వార్థంతో పనిగట్టుకుని విషం చిమ్ముతున్నది. ఇటువంటి ద్వేషపూరితమైన ప్రచారాన్ని మేధావులు ఖండించకుండా మౌనం పాటించడం ప్రమాదకరం.

అమరావతి నమూనాలో ప్రజల జీవనోపాధి, సామాన్యుల గృహ వసతి, సామాజిక అభివృద్ధి, సమ న్యాయం, ఆర్థిక అసమానతల నిర్మూలన వంటి వాటికి ప్రాధాన్యత లేదు. ప్రైవేట్ పెట్టుబడులకు ఎలాంటి ఆటంకాలు ఎదురైనా సహించదు, అలాంటివి రాకుండా అడుగడుగునా ప్రభుత్వం నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నది. సంపన్నులకు, ఉన్నతి మధ్యతరగతి వర్గాలకు అత్యంత విలాసవంతమైన ఆకాశహర్మ్యాలు నిర్మించబోతున్నారు. వీరికి అవసరమైన విధంగా అన్ని రకాల సౌకర్యాలు, పార్కులు, క్రీడా, రిక్రియేషన్ వంటివి చేపడుతున్నారు. అలాగే మంచి నీరు, పారిశుధ్యం, రవాణా, విద్యుత్, పౌర సేవలు, మౌలిక సదుపాయాలు వంటివి ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పట్టణాల్లో వలే ఉండవు. ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించబడవు, కొద్దిమంది గుత్తాధిపత్యంలోకి మారతాయి. వీటికి ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పి.పి.పి), జాయింట్ వెంచర్, ప్రత్యేక ఉద్దేశ సంస్థ (స్పెషల్ పర్పస్ వెహికల్) ఇలా అనేక పేర్లతో ముసుగులు తొడుగుతారని ఇప్పటికే ప్రచారం ప్రారంభమయింది.

అమరావతి రాజధాని అనేది విశాఖపట్నం, విజయవాడ లేదా హైదరాబాద్ వలె అమరావతి మున్సిపల్ కార్పొరేషన్‌గా అమలులోకి తీసుకొస్తారా? లేదా? అనేది ప్రభుత్వం చెప్పటం లేదు. ఒకవేళ మున్సిపల్ కార్పొరేషన్‌గా మార్చినా ఇది ఆచరణలో నామమాత్రంగానే ఉంటుంది. పరిమితమైన అధికారాలు కలిగి, కేవలం పన్ను వసూళ్లకే పరిమితం కావొచ్చు. ఎందుకంటే భూమిపై అమరావతి కార్పొరేషన్‌కి ఎలాంటి అధికారం ఉండదు. ఈ భూమి మొత్తం ఇప్పుడు సీఆర్‌డీఏ ఆధీనంలో ఉంది. నివాసాలన్నీ స్వయం పాలనతో భారీ గేటెడ్ కమ్యూనిటీలుగా రూపొందుతున్నాయి. అమరావతి ఎన్నటికీ ప్రజా రాజధాని కాదు. ఒక వర్గం ప్రజలను రెచ్చగొట్టే విధంగా అమరావతిపై విషం కక్కుతూ వైసీపీ నేతలు వ్యాసాలు రాయిస్తున్నారు. అమరావతి రాజధానిపైనే నిధుల్ని వ్యయం చేస్తూ ఇతర ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారని, కోట్లాది రూపాయలు అమరావతికి అప్పు తెచ్చి వ్యయం చేస్తున్నారని కొందరు దుష్ప్రచారం చేస్తూ ప్రాంతీయతత్వం రెచ్చగొడుతున్నారు. కానీ వాస్తవంగా అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ పథకం. ఆ విషయం సామాన్య ప్రజలకు తెలియదు. రాష్ట్రానికి పదకొండేళ్లుగా లేని రాజధానిని నిర్మిస్తుంటే కళ్లుండీ చూడలేని కబోదులు, తమ రాజకీయ ప్రయోజనం కోసం అమరావతిపై తప్పుడు రాతలు రాయిస్తున్నారు.

అమరావతిపై విద్వేషాలను రెచ్చగొట్టేలా వైసీపీ నాయకులు చేస్తున్న యత్నాలను ఎప్పటికప్పుడు బలంగా తిప్పికొట్టాలి. అమరావతి నిర్మాణ దశ నుంచే రాష్ట్రానికి ఆదాయ వనరుగా మారుతుందని, ఉద్యోగాంధ్రప్రదేశ్‌గా మారుతుందనే విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి. అమరావతి నిర్మాణ వ్యయంలో అధిక శాతం రాజధాని భూముల నుంచే సమకూరనున్నది. అమరావతిలో రాజధాని ఏర్పాటు చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి పేరు వస్తుందన్న అక్కసుతోనే ఈ వికృత రాజకీయానికి వైసీపీ పూనుకొంటున్నది.

– నీరుకొండ ప్రసాద్

ఆపరేషన్ సిందూర్: శత్రుదేశానికి గట్టి హెచ్చరిక

'ఆపరేషన్ సిందూర్ లక్ష్మణరేఖ – ఇంకోసారి దాడి చేస్తే చొరబడి మరీ అంతు చూస్తాం'... పాకిస్థాన్ సరిహద్దుకు దగ్గరగా, తాము నాశనం చేశామని పాకిస్థాన్ ప్రకటించుకున్న అదంపూర్ ఎయిర్‌బేస్ వేదికగా, పాకిస్థాన్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన హెచ్చరిక ఇది. ఓ వైపు పాకిస్థాన్ డ్రోన్లను, మిస్సైళ్లను నేలకూల్చిన S-400, మరోవైపు బ్రహ్మోస్‌తో పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లను పనికి రాకుండా చేసిన సుఖోయ్ యుద్ధ విమానం ఉండగా మోదీ ఈ హెచ్చరిక చేశారు. ధీరులైన సైనికులు పిడికిలి బిగించి చేసిన 'భారత్ మాతాకీ జై' అనే నినాదాలు సమీపంలోని పాకిస్థాన్‌లోనూ ప్రతిధ్వనించి ఉంటాయి. భారత్ సామర్థ్యం, బలం ప్రధాని మాటల్లో, చేతల్లో ప్రపంచం అంతా చూసింది. భారత సైన్యం పరాక్రమానికి ఆపరేషన్ సిందూర్ ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది.

ప్రశాంతంగా ఉన్న కశ్మీర్ టూరిజం, పరిశ్రమల రాకతో ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఉగ్రవాద జాడలేమీ మిగలవని భయపడిన పాకిస్థాన్ ఆర్మీ తన కుట్రలను అమలు చేసి తన నెత్తిమీదే చేయి పెట్టుకుంది. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ కశ్మీర్ ప్రజలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించిన వారానికే పహల్గాంలో టూరిస్టులను చంపేశారు. వెళ్లి మోదీకి చెప్పుకోవాలని పర్యాటకులకు సూచించారు. భారతీయుల జోలికి వచ్చినందుకు వారికి అప్పటికే డెత్ డేట్ ఖరారు అయిందని తర్వాత పరిణామాలు నిరూపించాయి. భారత్ దాడి చేస్తుందని ప్రపంచం అంతా తెలుసు, పాకిస్థాన్‌కూ తెలుసు. అయినా సరే, ఊహించని విధంగా ఆపరేషన్ సిందూర్‌ను ప్రధాని మోదీ నేతృత్వంలో అమలు చేశారు. తమ ఉగ్రవాద శిబిరాల జాడలు భారత్‌కు తెలియవని అనుకున్నారు. ప్రార్థనా మందిరాల్లో ఉన్నాయి కాబట్టి టెర్రరిస్టుల్ని కాపాడుకోవచ్చని అనుకున్నారు. కానీ ఆపరేషన్ సిందూర్ వంద మందికిపైగా కరుడుగట్టిన ఉగ్రవాదుల అంతం చూసింది.

ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ ఆర్మీ, పాలకులు పాల్గొన్న సత్యాన్ని ప్రపంచానికంతటికీ భారత్ తెలియజెప్పింది. పాకిస్థాన్ పిచ్చిపట్టినట్లుగా భారత సరిహద్దుల్లో డ్రోన్ దాడులు చేస్తే, వాటిని కూల్చివేసి, నేరుగా పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలకు గురిపెట్టింది. తీవ్రంగా దెబ్బతిన్న పాకిస్థాన్... టర్కీ నుంచి తెచ్చుకున్న డ్రోన్లు, చైనా ఇచ్చిన హతాఫ్ క్షిపణులతో దాడికి ప్రయత్నించినా, అన్నింటినీ భారత్ నేలమట్టం చేసింది. భారత్ కొట్టిన దెబ్బకు పాకిస్థాన్‌కు ఉనికి సమస్య వచ్చేసింది, అందుకే కాళ్ల బేరానికి వచ్చింది.

'ఆపరేషన్ సిందూర్'లో మన సైన్యం ధ్వంసం చేసిన ఎయిర్ బేస్‌లలో అత్యంత ముఖ్యమైనది రావల్పిండిలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్. ఇది పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ లాజిస్టిక్, కమాండ్

ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన లక్ష్యాలను చాలావరకూ సాధించింది. వందమంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. పాకిస్థాన్ సైన్యం సమీపకాలంలో కోలుకోలేని విధంగా దాని మౌలిక సదుపాయాల్ని దెబ్బతీసింది. భారత్ కొట్టిన దెబ్బకు పాకిస్థాన్‌కు ఉనికి సమస్య వచ్చేసింది. అందుకే కాళ్ల బేరానికి వచ్చింది. భారత్ సామర్థ్యం, బలం ప్రధాని మాటల్లో, చేతల్లో ప్రపంచం అంతా చూసింది. భారత సైన్యం పరాక్రమానికి ఈ ఆపరేషన్ ప్రత్యక్ష సాక్షి



హబ్. ఇక్కడ ఉన్న C-130 ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్, IL-78 రీఫ్యూయలింగ్ ట్యాంకర్స్, ఎర్లీ వార్నింగ్ సిస్టమ్స్‌ను భారత దళాలు ధ్వంసం చేశాయి. చక్వాల్‌లోని మురిద్ ఎయిర్‌బేస్ మీద భారత్ చేసిన దాడిలో డ్రోన్ సౌకర్యాలు, ఫైటర్ జెట్‌లు ధ్వంసమయ్యాయి. JF-17, మిరాజ్ ఫైటర్ జెట్ స్క్వాడ్రన్‌లను కలిగి ఉన్న రఫీకీ ఎయిర్‌బేస్‌నూ భారత దళాలు టార్గెట్ చేసి ధ్వంసం చేశాయి. రహీం యార్‌ఖాన్ ఎయిర్‌బేస్ రన్‌వేలో భారీ గొయ్యి పడేలా భారత దళాలు బాంబులు వేశాయి. సింధ్ ప్రావిన్స్‌లోని సుక్కూర్ ఎయిర్‌బేస్ రన్‌వే, సౌకర్యాలు దెబ్బతిన్నాయి. పంజాబ్‌లోని చునియన్ ఎయిర్‌బేస్ మీద చేసిన దాడిలో ఎయిర్ డిఫెన్స్ రాడార్‌లు ధ్వంసమయ్యాయి. సింధ్‌లోని భోలారీ ఎయిర్‌బేస్ హ్యాంగర్, రన్‌వేకు పెద్ద నష్టం వాటిల్లి, అక్కడ 50 మందికి పైగా మరణించారు. వీరిలో స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసుఫ్, నలుగురు ఎయిర్‌మెన్ ఉన్నారు. ముషాఫ్ ఎయిర్‌బేస్‌పై భారత్ చేసిన దాడితో కిరనా హిల్స్‌లో భూగర్భ న్యూక్లియర్ నిల్వ స్థలాలకు సమస్యలు వచ్చాయని చెబుతున్నారు. ఈ దాడి పాకిస్థాన్‌లో ఆందోళనను రేకెత్తించింది. ఈ స్థావరం పాక్ ఆక్రమిత కశ్మీర్ సమీపంలో ఉంది. పాకిస్థాన్ సైన్యం లైన్ ఆఫ్ కంట్రోల్ వెంబడి 35–40 మంది సైనికులను కోల్పోయింది. ఎయిర్‌ఫోర్స్ అనేక హైటెక్ ఎయిర్ క్రాఫ్ట్‌లను కోల్పోయింది. ఈ దాడులు పాకిస్థాన్ రక్షణ సామర్థ్యాలను, ఆత్మస్థైర్యాన్ని బాగా దెబ్బతీశాయి. ఎంతగా అంటే భారత ప్రధాని అదంపూర్ ఎయిర్‌బేస్‌లో ప్రసంగిస్తే దానికి పోటీగా పాకిస్థాన్ ప్రధాని కూడా ఓ ఎయిర్‌బేస్‌కు వెళ్లారు. కానీ అక్కడ ఎయిర్ బేస్ లేదు. యుద్ధ ట్యాంక్‌పై నిలబడి మాట్లాడాల్సి వచ్చింది. మత మౌఢ్యంతో నిండిన టర్కీ... భారత్‌పై వ్యతిరేకతను నరనరాన నింపుకున్న చైనా తప్ప, ఎవరూ పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వలేదు.

బ్రహ్మోస్ క్షిపణుల దెబ్బకు పాకిస్థాన్ కాళ్ల బేరానికి వచ్చింది. కాల్పులు ఆపాలంటూ పాక్ ఆర్మీనే మొదట ప్రతిపాదించింది. అప్పటికే భారత్ తన లక్ష్యాలను చాలావరకూ సాధించింది. వందమంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. పాకిస్థాన్ సైన్యం సమీపకాలంలో కోలుకోలేని విధంగా దాని మౌలిక సదుపాయాల్ని దెబ్బతీసింది. మరొక్కరోజు ఘర్షణలు కొనసాగి ఉంటే కరాచీ పోర్టు నుంచి ఇస్లామాబాద్ ఎయిర్‌పోర్టు వరకూ ఏవీ మిగిలేవి కావు. భారత్ సాధించిన విజయం ఎంత పద్ధతిగా ఉందో చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోతున్నాయి. మన బ్రహ్మోస్ క్షిపణి కోసం 17 దేశాలు ప్రతిపాదనలు పెట్టాయి.

యుద్ధం ఎలాంటిదైనా వినాశనమే. అందులో విజేతలు సాంకేతికంగా ఉంటారు కానీ.. యుద్ధం చేసిన వారంతా నష్టపోతారు. ఆ విషయమే ప్రధాని మోదీ చెప్పారు. ఇది యుద్ధాల యుగం కాదన్నారు. అదే సమయంలో ఉగ్రవాద యుగం కూడా కాదని స్పష్టం చేశారు. శత్రువును ఓడించడమే యుద్ధంలో విజయం కానీ.. చంపడం కాదు. చంపడం కన్నా.. ఓడించడం ద్వారా జీవితకాలం ఆ విజయం నిలుస్తుంది. ఈ యుద్ధనీతిని బాగా ఔపోసన పట్టిన నేత ప్రధాని నరేంద్రమోదీ. ఈ భరతమాత ముద్దుబిడ్డ మనదేశాన్ని ప్రపంచంలో అత్యున్నత శక్తిగా నిలబెట్టారు. ఆపరేషన్ సిందూర్ భారత చరిత్రలో ఓ విజయ పతాక.

• ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి
ఉపాధ్యక్షుడు, ఏపీ బీజేపీ

నింగి నిండా నా జెండా

భరతదేశ గడ్డపైన
భరతజాతి బిడ్డగున్నా
వున్నా – నేనున్నా
మువ్వన్నెల జెండాతో
ముందే నేనున్నా ::భరత దేశ::


ఈ దేశం నాదని
ఈ ప్రజలు నావారని
అంటున్నా – నేనంటున్నా
దేశం కోసం ప్రాణాలైనా
ఇస్తానని – నేనంటున్నా
::భరతదేశ::

జై కిసాన్ అని
జై జవాన్ అని
విన్నా – నే విన్నా
ధీరత్వంతో నిల్చున్నా
వీరత్వంతో ముందున్నా
::భరతదేశ::

కులతత్వం లేక
మతతత్వం లేక
వుంటున్నా – నేనుంటున్నా
దేశ సమైక్యతే కావాలని
నేనంటున్నా ::భరతదేశ::

–నన్నపనేని రాజకుమారి
మాజీ మంత్రి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com





నందిగామలో కల్లాల్లో ఆరబోసి ఉన్న ధాన్యాన్ని చూసి ఆవేదన చెందుతున్న రైతు

ధాన్యం దిగుబడి	ఇప్పటివరకు కొన్నది	దళారులు కొన్నది	ఇంకా రైతుల వద్ద ఉన్నది
1.60 లక్షల టన్నులు	70 వేల టన్నులు	10 వేల టన్నులు	80 వేల టన్నులు



ఆంధ్రజ్యోతి విజిట్

ధాన్యం.. దైన్యం

జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లు నిలిపివేత.. ఆవేదనలో అన్నదాతలు

రబీలో ధాన్యం కొనుగోళ్ల నిలిపివేత రైతుల పాలిట శాపంగా మారింది. ప్రస్తుతం జిల్లాలో కొనుగోలు ప్రక్రియ నిలిచిపోవడంతో మిగులు ధాన్యం ఉన్న అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఓవైపు మిల్లర్లు, దళారులు దోపిడీకి దిగుతుండగా, ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం కొనకపోతే చేసేదేమిటి దేవుడా.. అంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఓవైపు వాతావరణ పరిస్థితులు రోజుకొక రకంగా ఉండటం, మరోవైపు కొనుగోలు ప్రక్రియ నిలిచిపోవడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో తలలు పట్టుకుంటున్నారు. ఉప్పుడు ధాన్యం పండించిన రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉండగా, ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యాన్ని పెంచాలని కోరుకుంటున్నారు.

- మొత్తం 1.60 లక్షల టన్నుల దిగుబడి
- ఇప్పటివరకు కొన్నది సగమే..
- ఇంకా రైతుల వద్ద సగానికిపైగా ధాన్యం
- కొనుగోళ్ల నిలిపివేతతో అగమ్యగోచరం
- భయాందోళన కలిగిస్తున్న వాతావరణం
- లక్ష్యాన్ని పెంచాలని రైతుల వేడుకోలు
- దళారుల దోపిడీ.. తక్కువకే కొనుగోళ్లు



రెడ్డిగూడెంలో..

నందిగామ/ఇబ్రహీంపట్నం/విస్సన్నపేట/తిరువూరు/రెడ్డిగూడెం/గంపలగూడెం/గొల్లపూడి/ ఎ.కొండూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రబీలో జిల్లాలో మొత్తం 1.60 లక్షల టన్నుల ధాన్యం పండింది. తొలుత కొనుగోళ్లు ప్రారంభించిన ప్రభుత్వం కేవలం 10 వేల టన్నుల ధాన్యం కొనుగోళ్లకే అవకాశం కల్పించింది. ఇంత తక్కువ మొత్తంలో ధాన్యం కొనుగోలు చేపట్టలేమని మిల్లర్లు భీష్మించడంతో ప్రభుత్వం 50 వేల టన్నుల కొనుగోళ్లకు అనుమతి ఇచ్చింది. గత ఏడాది ధాన్యం రవాణా చేసిన వాహనాలకు బిల్లులు చెల్లించకపోవడంతో ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ రబీ ధాన్యం రవాణా చేయడానికి నిరాకరించారు. దీంతో రైతులు రోడ్డున పడ్డారు. సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు.. ఆర్టీఏ అధికారుల సాయంతో దొరికిన ప్రతి లారీని పట్టుకుని డీజిల్ కొట్టించి ధాన్యం రవాణా చేయించారు. సకాలంలో సరిపడా లారీలు దొరక్క అటు అధికారులు, ఇటు రైతులు ఇబ్బందులు పడ్డారు. నిర్దేశించిన 50 వేల టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసిన పౌరసరఫరాల శాఖ అధికారులు మరికొంత అనుమతి సాధించి రెండు దఫాలుగా 10 వేల చొప్పున ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. అంతిమంగా 70 వేల టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేపట్టి, అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో ఇళ్లలో, కల్లాల్లో ధాన్యం నిల్వలు ఉన్న అన్నదాతల్లో కల్లోలం మొదలైంది.

మరో 80 వేల టన్నులకు అనుమతినివ్వాలి

జిల్లాలో 1.60 లక్షల టన్నుల ధాన్యం పండగా, ప్రభుత్వం 70 వేల టన్నులు కొనుగోలు చేసింది. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం, వాతావరణంలో వస్తున్న మార్పులకు భయపడి సుమారు 10 వేల టన్నుల ధాన్యాన్ని రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకున్నారు. ఇంకా రైతుల వద్ద మరో 80 వేల టన్నులు ధాన్యం ఉంది. ఈ మొత్తం కొనుగోళ్లకు ప్రభుత్వం ముందుకు రాకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. వీటిలో 1010 రకం, పీఆర్ 126 రకం ఉప్పుడు ధాన్యం 50 వేల టన్నుల వరకూ ఉంది. ప్రభుత్వం దన్నుగా నిలవకపోతే ఈ రకం ధాన్యాన్ని దళారులు అతి తక్కువ ధరకు కొనే అవకాశాలు ఉన్నాయి.

మిగులు ఇలా..

- విస్సన్నపేట మండలంలో ఇంకా 400 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉందని అధికారులు తెలిపారు. పుట్రేలలో 200 మెట్రిక్ టన్నులు, కలగలరలో 150 మెట్రిక్ టన్నులు, వేమిరెడ్డిపల్లిలో 50 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉంది. లారీలు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిగతా 6లో..



నున్న మార్కెట్‌లో వ్యాపారులు లేక దిగాలుగా..

మామిడీలా

వెలవెలబోతున్న నున్న మ్యాంగో మార్కెట్

- గతంతో పోలిస్తే పడిపోయిన అమ్మకాలు
- కోడిపేను తెగులుతో పాడైపోయిన కాయలు
- అకాల వర్షం, గాలివానల ప్రభావం ఎక్కువే..
- ఎగుమతులు లేక కుదేలైన రైతులు, వ్యాపారులు



విజయవాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది మామిడి వ్యాపారం కుదేలైంది. కరోనా సమయాన్ని మినహాయిస్తే దశాబ్దకాలంలో ఎన్నడూ లేనంతగా ఎగుమతులు పడిపోయాయి. ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులు, వాహనాలతో ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ మార్కెట్ ఆసియాలోనే అతిపెద్దది. అలాంటి మార్కెట్‌లో ఈసారి దుకాణాలు అరకొర కాయలతోనే కనిపిస్తున్నాయి. అకాల వర్షాలు, గాలివానలకు తోడు అటు కోడిపేను తెగులు, ఇటు మామిడి రైతులనే కాకుండా వ్యాపారులను కూడా నిండా ముంచేసింది.

అకాల వర్షాలు, తెగుళ్లతో తగ్గిన దిగుబడి

ఈ ఏడాది ఎన్నడూ లేనంతగా మామిడి పూత పూసింది. అయితే, కాయకాసే సమయానికి కోడిపేను తెగులు పట్టి పూత మొత్తం మాడిపోయింది. గోరుచుట్టు మీద రోకలిపోటు అన్నట్టు అకాల వర్షాలు, గాలివానలతో పంట దిగుబడి భారీగా తగ్గిపోయింది. కాసిన అరకొర కాయలు కూలీలను పెట్టి కోసి మార్కెట్‌కు తీసుకొచ్చే పరిస్థితులు లేవు.

పడిపోయిన ఎగుమతులు

గతంతో పోలిస్తే మ్యాంగో మార్కెట్‌లో ఎగుమతులు భారీగా పడిపోయాయి. గతంలో ఇక్కడి నుంచి సీజన్‌లో రోజుకు 400 నుంచి 500 టన్నుల ఎగుమతులు జరిగేవి. అయితే ఈ ఏడాది రోజుకు 200 టన్నులు ఎగుమతులు

మిగతా 6లో..

ఎగుమతులు (రోజుకు)
గతంలో 400 టన్నులు
ప్రస్తుతం 200 టన్నులు

బంగినపల్లి, రసాల ధర (టన్నుకు)
గతంలో రూ.50 వేల నుంచి రూ.55 వేలు
ప్రస్తుతం రూ.25 వేలు..అంతకంటే తక్కువ..

రాత్రి గొడవ.. ఉదయం హత్య

- మద్యం మత్తులో స్నేహితుల వార్
- గడ్డకట్టిన సిమెంట్ బస్తాతో దాడి



ఘటనాస్థలిలో లక్ష్మణ్ మృతదేహం

గుణదల, మే 15 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుల మధ్య చోటుచేసుకున్న ఓ చిన్న వివాదం.. చివరికి పెద్దదై హత్యకు దారితీసింది. గుణదల, విజయనగర్ కాలనీలో గురువారం ఉదయం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం.లక్ష్మణ్ (36)కు వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. అదే ప్రాంతానికి చెందిన మల్లేశ్.. లక్ష్మణ్‌కు మంచి స్నేహితుడు. ఇద్దరూ కొంతకాలం హైదరాబాద్‌లో సెంట్రింగ్ పనిచేశారు. రెండు నెలల క్రితమే లక్ష్మణ్.. విజయనగర్ కాలనీకి వచ్చి, రూమ్ అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. స్నేహితుడు మల్లేశ్ కూడా మూడు రోజుల క్రితమే గుణదల చేరుకుని లక్ష్మణ్‌తో కలిసి సెంట్రింగ్ పనికి వెళ్తున్నాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఇద్దరూ మద్యం సేవించి రూమ్‌కు చేరుకున్నారు. మత్తులో ఇద్దరూ గొడవ పడుతుండటంతో స్థానికులు సర్దిచెప్పారు. దీంతో ఎవరికి వారు నిద్రపోయారు. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో లక్ష్మణ్ నిద్రమత్తులో ఉండగా, మల్లేశ్ గడ్డకట్టి ఉన్న సిమెంట్ బస్తాను లక్ష్మణ్ తలపై మోదాడు. దీంతో లక్ష్మణ్ అక్కడికక్కడే చనిపోవడంతో మల్లేశ్ పరారయ్యాడు. తెల్లవారాక స్థానికులు వెళ్లి చూడగా, లక్ష్మణ్ రక్తపు మడుగులో పడి కనిపించాడు. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ప్రకాశ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పరారీలో ఉన్న మల్లేశ్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

స్థానిక సమరానికి సన్నద్ధమయ్యేలా..

18 నుంచి ఉమ్మడి కృష్ణాలో మినీ మహానాడుకు సన్నాహాలు

- మూడు రోజులు అసెంబ్లీల పరిధిలో.. 6
- 22, 23 తేదీల్లో జిల్లాస్థాయిలో నిర్వహణ
- ఏర్పాట్లలో తలమునకలైన నెట్టెం, కొనకళ్ల
- విజయవంతం చేయాలని సూచనలు

దేవదాయ శాఖ మాజీ అధికారిణి శాంతి విచారణ

- ఆలయాలు, సత్రాల్లో అవినీతి, అక్రమాలపై ఆరా
- నివేదిక సిద్ధమయ్యాక ప్రభుత్వానికి.. 8

వంశీకి జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు



- అనారోగ్య కారణాల వల్లే..
- అనంతరం జైలుకు తరలింపు 6

బస్టాండ్ ప్రాంగణంలో బ్లేడ్‌బ్యాచ్ ఆగడాలు

- కొరవడిన పోలీసు నిఘా 8



ప్రచార పోరు

విజయవాడ కార్పొరేషన్‌లో ప్రకటనల వార్

- ఓ కార్పొరేట్ యాడ్ ఏజెన్సీకి అనుకూల నిర్ణయాలు
- వైసీపీ హయాంలో ఓ వెలుగు వెలిగిన సంస్థ
- కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అదే హవా
- ఇబ్బందుల్లో చిన్న, మధ్యతరహా యాడ్ ఏజెన్సీలు
- అందరూ ఒకే ఫీజు చెల్లించేలా స్టాండింగ్ కమిటీ ఆమోదం
- అమలు చేయకుండా అడ్డుకుంటున్న కార్పొరేట్ ఏజెన్సీ

కార్పొరేట్ యాడ్ ఏజెన్సీలకు విజయవాడ కార్పొరేషన్ అధికారులు ఊడిగం చేస్తున్నారు. నగరంలో ప్రకటన బోర్డులు ఏర్పాటుచేసే ఏ సంస్థలైనా సరే ఒకే రకమైన పన్ను చెల్లింపులు జరపాలన్న ప్రతిపాదనను మార్చిలో స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించినా.. ఇప్పటికీ అమల్లోకి తీసుకురావట్లేదు. దీనివెనుక ఓ బడా కార్పొరేట్ సంస్థ చక్రం తిప్పుతున్నట్టు తెలుస్తోంది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో సమాచార శాఖ పరిధిలో జరిగిన పలు అక్రమాలపై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అవుట్‌డోర్ ప్రకటనలకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా నాటి ప్రభుత్వం చెల్లింపులు జరిపిన సంస్థగా ఈ బడా కార్పొరేట్ సంస్థ పేరు తెరపైకి వచ్చింది. అలాంటి సంస్థకు కార్పొరేషన్ అధికారులు నేటికీ జీ హుజూర్.. అంటున్నారు.

చిన్న సంస్థలపై ప్రతాపం

కార్పొరేట్ సంస్థలు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి కార్పొరేషన్‌లో వ్యవహారాలు నడుస్తున్నాయి. ఓపక్క చిన్న, మధ్య తరగతి పారిశ్రామిక యూనిట్లను (ఎంఎస్ఎంఈ) ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాలసీలను తీసుకొస్తుంటే, ఇంకోపక్క కార్పొరేషన్ అధికారులు మాత్రం చిన్న, మధ్య తరగతి ఏజెన్సీలను టార్గెట్ చేస్తున్నారు. నగరంలో నూటికి 90 శాతానికి పైగా ప్రకటన బోర్డులన్నీ కార్పొరేట్ ఏజెన్సీల చేతుల్లోనే ఉన్నాయి. వీటిలో కూడా ఒకేఒక్క సంస్థ గుత్తాధిపత్యం చెలాయిస్తోంది. విగిలిన 10 శాతం మాత్రమే చిన్న, మధ్య సంస్థల చేతుల్లో ఉన్నాయి. ఎక్కడపడితే అక్కడ బోర్డులు ఉన్నాయన్న పేరుతో చిన్న సంస్థల ప్రకటన బోర్డులను వైసీపీ ప్రభుత్వ హయాంలో తొలగించారు. దీని వెనుక ఓ బడా కార్పొరేట్ యాడ్ ఏజెన్సీ పాత్ర ఉందనే ఆరోపణలు వచ్చాయి. ఆ ఏజెన్సీకి నాటి వైసీపీ ప్రభుత్వంతో ఉన్న సంబంధాల నేపథ్యంలోనే ఇలా చేశారు. దీంతో సదరు కార్పొరేట్ సంస్థ వ్యాపారానికి అడ్డు లేకుండాపోయింది. నగరంలో తమ వ్యాపారానికి అడ్డొస్తారన్న ఉద్దేశంతో కార్పొరేషన్ స్థలాల్లో ప్రకటన బోర్డులు పెడితే పన్నులతో పాటు అద్దె చార్జీలను కూడా వసూలు చేయించేలా ఆదేశాలు ఇప్పించారు. దీంతో చిన్న, మధ్య తరహా యాడ్ ఏజెన్సీలు అనేక ఇబ్బందులు పడ్డాయి. అలాగే, చిన్న, మధ్య తరహా సంస్థలు కోలుకోనివ్వకుండా చేయటానికి కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే.. 2021లో రెండు రకాల పన్ను వసూళ్ల గజిట్లను కూడా తీసుకొచ్చేలా ఆ కార్పొరేట్ సంస్థ చక్రం తిప్పింది. ఆ సంస్థకు తక్కువగా, చిన్న, మధ్య తరహా యాడ్ ఏజెన్సీలు మూడు రెట్లు ఎక్కువ చెల్లించేలా

మిగతా 6లో..

ఈ వ్యత్యాసమేంటి?

నగరంలో నూటికి 90 శాతానికి పైగా ప్రకటన బోర్డులన్నీ కార్పొరేట్ యాడ్ ఏజెన్సీల ఆధీనంలోనే ఉంటాయి. వారికే ఎక్కువ వ్యాపారం జరుగుతుంది. పైగా ఈ కార్పొరేట్ ఏజెన్సీలన్నీ ఏ కేటగిరీకి సంబంధించిన రోడ్లు, ప్రాంతాల్లోనే ఏర్పాటు చేస్తాయి. కాబట్టి భారీ ఆదాయం వస్తుంది. చిన్న, మధ్య కేటగిరీ సంస్థలు బీ, సీ కేటగిరీ రోడ్లు, ప్రాంతాల్లోనే బోర్డులు పెట్టగలవు. వీటి వ్యాపారం తక్కువ కాబట్టి.. అందరికీ ఒకేలా పన్నులు, ఫీజులు నిర్దేశించటం సమంజసం కాదు. పెద్ద ఏజెన్సీలకు ఎక్కువగా, చిన్న ఏజెన్సీలకు తక్కువగా పన్నులు, ఫీజులను నిర్దేశించడమే కరెక్టనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేడు భారత శౌర్య తిరంగా యాత్ర

- 5 వేల మంది విద్యార్థులతో నిర్వహణ
- సాయంత్రం 5 గంటలకు ఐజీఎంసీ స్టేడియం నుంచి..
- హాజరుకానున్న సీఎం, డిప్యూటీ సీఎం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు
- దేశభక్తి పెంపొందేలాకార్యక్రమాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'ఆపరేషన్ సిందూర్' పేరుతో మనదేశ సైన్య శౌర్యపరాక్రమాలను ఘనంగా చాటేందుకు శుక్రవారం నగరంలో 'భారత శౌర్య తిరంగా యాత్ర' నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలన్నీ పాల్గొంటున్నాయి. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో యాత్రలో పాల్గొంటారు. ర్యాలీ ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు జరుగుతుంది.

కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్

5 వేల మందితో ఈ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించాయన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం 5 వేల మందితో భారత్‌మాతాకీ జై అంటూ నగరం మార్మోగేలా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 5 గంటలకు ఇందిరాగాంధీ స్టేడియం నుంచి ప్రారంభమై బెంజిసర్కిల్ వరకు చేరుకుంటుందన్నారు. 500 మీటర్ల జాతీయ పతాకాన్ని విద్యార్థులు పట్టుకుని ర్యాలీ చేస్తారని తెలిపారు. ర్యాలీ విజయవంతమయ్యేలా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

- నగరంలో నేడు తిరంగా ర్యాలీ నేపథ్యంలోనే..
- సాయంత్రం 4 నుంచి రాత్రి 8 వరకూ..

8



హోంమంత్రికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనా నాయక్

కనకదుర్గమ్మ సేవలో హోంమంత్రి అనిత

ఇంద్రకీలాద్రి, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను రాష్ట్ర హోంమంత్రి అనిత కుటుంబసభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈవో వీకే శీనా నాయక్ ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వారికి వేదపండితుల ఆశీస్సులు, ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

అమరావతిలో నాక్ ఏర్పాటుకు కృషి

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణ రంగంలో నాణ్యత, నిపుణత సాధించిన భవన నిర్మాణ కార్మికులతో పాటు అవసరమైన సిబ్బంది అమరావతి నిర్మాణానికి అవసరమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ మాదాపూర్‌లోని జాతీయ నిర్మాణ అకాడమీ (నాక్)ను గురువారం ఆయన సందర్శించారు. ఎంపీతో పాటు ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ సలహా కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు తదితరులు నాక్ సంస్థ పనితీరును పరిశీలించారు. అక్కడ ఇంజనీరింగ్ విద్యార్థులు, నిరుద్యోగులు, భవన నిర్మాణ కార్మికుల కోసం నైపుణ్యాభివృద్ధి సంస్థలో ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను ట్రైనింగ్ డైరెక్టర్ శాంతిశ్రీ ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ.. అమరావతిలో జాతీయ నిర్మాణ అకాడమీ ఏర్పాటు చేయాలనే ఆలోచన చంద్రబాబుకు ఉందన్నారు. అమరావతి రాజధాని పనులు రూ.60వేలకోట్ల అంచనాతో ప్రారంభమయ్యాయని, ఇందుకు ఎంతో మంది సివిల్ ఇంజనీర్లు, సివిల్ వర్కర్లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల అవసరం ఉందన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పదో తరగతి, ఇంటర్, అంతకంటే తక్కువ చదువుకే పరిమితమైన యువతకు ఉపాధి అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. ఇటువంటి వారికి ఊతంగా ఉండేందుకే అమరావతిలో నాక్ ఏర్పాటుకు కృషి జరుగుతోందన్నారు. ఇందుకు తగిన సహకారం ఇవ్వాలని ఆయన అక్కడి అధికారులను కోరారు. కార్యక్రమంలో తెలంగాణ నాక్ సీటీటీఐ ఎం.రాజరెడ్డి, రీజనల్ డైరెక్టర్ పి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్‌లో సత్తాచాటిన విద్యార్థులు

మచిలీపట్నం/విజయవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 6న నిర్వహించిన ఏపీఈసెట్-2025పరీక్షల్లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల విద్యార్థినీ విద్యార్థులు సత్తా చాటారు. కృష్ణా జిల్లాలో మొత్తం 1013 మంది దరఖాస్తు చేసుకోగా 1000 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 958 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 95.80 నమోదైంది. అదే విధంగా ఎన్టీఆర్ జిల్లా నుంచి 3123 మంది దరఖాస్తు చేసుకోగా 3045 మంది పరీక్షకు హాజరయ్యారు. 2489 మంది ఉత్తీర్ణత సాధించి 93.56 శాతం నమోదు చేశారు.

వంశీకి జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు

విజయవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ జిల్లా జైల్లో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు జైలు అధికారులు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. మూడు రోజుల క్రితం రిమాండ్ పొడిగింపు నిమిత్తం ఏసీబీ కోర్టుకు హాజరైనప్పుడు అనారోగ్య సమస్యల గురించి న్యాయాధికారికి విన్నవించుకున్నారు. దీంతో ఆయనకు చికిత్స చేయించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. బుధవారం ప్రభుత్వాసుపత్రిలోని ఆర్ఎంవో గదిలో కొన్ని వైద్య పరీక్షలు చేశారు. గురువారం పల్మనాలజీ, న్యూరోకు సంబంధించిన పరీక్షలు చేశారు. వాటితోపాటు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. అరగంటపాటు ఆయనను వైద్యుల బృందం పరీక్షించింది. అనంతరం జైలుకు తరలించారు.

హిజ్రాను వివాహమాడిన ముస్లిం యువకుడు



ఇబ్రహీంపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): వయస్సులో తనకంటే ఏడేళ్ల పెద్ద అయిన హిజ్రాను ఏడాది ప్రేమించి పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నాడు కొండపల్లికి చెందిన షేక్ బాజీ. కొండపల్లి మున్సిపాలిటీలోని కుమ్మరి బజారుకు చెందిన షేక్‌బాజీ (24) బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. బీ.కాలనీ సమీపంలోని నేతాజీనగర్‌లో నివాసం ఉంటున్న హిజ్రా గాదె కౌశల్య అలియాస్ షబానా (31)ని ఏడాది నుంచి ప్రేమిస్తున్నాడు. ఈ విషయం తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాడు. వారు అభ్యంతరం చెప్పడంతో కౌశల్య తరపున హిజ్రా పెద్దలు విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కౌశల్యతో పెళ్లి చేయాలని హిజ్రా పెద్దలను కోరడంతో వారు నేతాజీనగర్‌లో స్నేహితుల సమక్షంలో ముస్లిం మతాచారం ప్రకారం బాజీకి కౌశల్య (హిజ్రా)కు వివాహం జరిపించారు.

పాలిటెక్నిక్‌లో కోర్సులకు దరఖాస్తులు

భారతీనగర్, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వల్ప కాలిక వ్యవధి కోర్సుల శిక్షణకు ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయసారధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 10, ఇంటర్, డిగ్రీ, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 23లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9985759304, 8328252829 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రచార పోరు

(5వ పేజీ తరువాయి)

చేసింది. ఈ నిర్ణయాలపై చిన్న, మధ్య తరహా యాడ్ ఏజెన్సీలు కోర్టును ఆశ్రయించాయి. ఈ విధానాన్ని న్యాయస్థానం కూడా తప్పుబట్టింది. ఆతర్వాత వైసీపీ హయాంలో కమిషనర్లుగా పనిచేసిన ప్రసన్న వెంకటేశ్, స్వప్నిల్ దినకర్ వంటి వారికి ఎన్నోసార్లు చిన్న, మధ్య తరహా యాడ్ ఏజెన్సీల వారు కలిసి గోడును వెళ్లబోసుకున్నా ఫలితం లేకపోయింది. కమిషనర్‌గా ధ్యానచంద్ర వచ్చాక స్పష్టమైన విధానాన్ని తీసుకొద్దామనుకున్నా జరగలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మార్చిలో స్థాయీసంఘం ముందుకు అన్ని సంస్థలకూ ఒకే రకమైన ఫీజు వసూలు చేసే ప్రతిపాదనను తీసుకురాగా, ఆమోదం లభించింది.

ఆమోదం సరే.. అమలేదీ..?

అందరికీ సమానంగా ఫీజులు విధించే విధానానికి స్టాండింగ్ కమిటీలో ఆమోదం లభించినా అమలు మాత్రం చేయట్లేదు. వైసీపీ ప్రభుత్వంలో తనకున్న పలుకుబడిని ప్రదర్శించిన సదరు బడా కార్పొరేట్ ఏజెన్సీ కూటమి ప్రభుత్వంలోనూ ఈ ప్రతిపాదనను అడ్డుకుంటున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ప్రతిపాదన లీగల్ సెల్‌కు వెళ్లడంపై అనేక విమర్శలు వచ్చాయి. లీగల్ సెల్ నుంచి అభ్యంతరం రావటంతోనే స్టాండింగ్ కమిటీ ఆమోదించినా ఈ విధానం అమలు కావటం లేదని తెలుస్తోంది.

స్థానిక సమరానికి సన్నద్ధమయ్యేలా..

» 18 నుంచి ఉమ్మడి కృష్ణాలో మినీ మహానాడుకు సన్నాహాలు

» మూడు రోజులు అసెంబ్లీల పరిధిలో..

» 22, 23 తేదీల్లో జిల్లాస్థాయిలో నిర్వహణ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మినీ మహానాడు కార్యక్రమాలకు ఉమ్మడి కృష్ణా జిల్లాలు సమాయత్తమయ్యాయి. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పార్టీ రథసారథులైన నెట్టెం రఘురామ్, కొణకళ్ల నారాయణలు మినీ మహానాడు ఏర్పాట్లపై తలమునకలయ్యారు. జిల్లా అధ్యక్షులుగా నియమితులైన తర్వాత తొలిసారిగా జరుగుతున్న మహానాడు కావటంతో ఇరువురూ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. రెండు జిల్లాల్లో కార్యకర్తలను పెద్ద ఎత్తున సమీకరించి ముందుగా నియోజకవర్గ స్థాయిలో, చివరగా జిల్లా స్థాయిలో మినీ మహానాడులను నిర్వహించి రాష్ట్రస్థాయి కార్యక్రమానికి సన్నద్ధం కావాలని భావిస్తున్నారు. రెండు జిల్లాల నుంచి భాగస్వామ్యం కావాల్సిన అంశాలపై మినీ మహానాడు కార్యక్రమాలలో చర్చించనున్నారు.

మినీ మహానాడు సమావేశాలలో తొలిభాగంలో పార్టీ ఎలాంటి పరిస్థితుల్లో ఆవిర్భవించింది? రాష్ట్రంలో, దేశంలో సాధించిన విజయాలు.. ఎదుర్కొన్న సంక్షోభాలు, ఆటుపోట్లు.. తిరిగి ఏ విధంగా శక్తిని పుంజుకున్నది.. అన్న విషయాలపై సీనియర్ నేతలు ప్రసంగిస్తారు. రెండో భాగంలో కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు.. ఫలితాలు.. ఇతర రాజకీయ పార్టీల దాడులను పార్టీశ్రేణులు తిప్పికొట్టి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఏ విధంగా సన్నద్ధం కావాలన్న అంశాలపై నేతలు ప్రసంగిస్తారు. అంతిమంగా రాష్ట్ర మహానాడు కార్యక్రమం విజయవంతంపై కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

18 నుంచి మినీ మహానాడు కార్యక్రమాలు

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఈనెల 18 నుంచి 20 వరకు నియోజకవర్గ స్థాయిలో మినీ మహానాడు కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. 22, 23 తేదీల్లో జిల్లా స్థాయి కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ మేరకు రెండు జిల్లాల పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్, కొణకళ్ల నారాయణలు పార్టీ నాయకత్వాలకు దిశా నిర్దేశం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ ఈస్ట్, సెంట్రల్, పశ్చిమ, జగ్గయ్యపేట, నదిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో మినీ మహానాడు కార్యక్రమాలు నియోజకవర్గ అధ్యక్షుల పర్యవేక్షణలో జరుగుతాయి. అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, మంత్రులు, గ్రామ, మండల, నియోజకవర్గ నేతలు, అనుబంధసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారు. జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.

ఎన్టీఆర్ జిల్లాస్థాయి మినీ మహానాడును మే 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇంకా తేదీపై స్పష్టత రాలేదు. కృష్ణాజిల్లాలో ఈనెల 18, 19, 20 తేదీల్లో నియోజకవర్గ కార్యక్రమాలను నిర్వహించేందుకు జిల్లా అధ్యక్షుడు కొణకళ్ల నారాయణ నిర్ణయించారు. 18న అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల పరిధిలో కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మిగిలిన వాటిపై స్పష్టత రావాల్సి ఉంది. కృష్ణా జిల్లా స్థాయి మినీ మహానాడు మే 23న మచిలీపట్నం సత్య కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నట్టు, జిల్లాలోని ఎమ్మెల్యేలు, వివిధ మండల కమిటీల ప్రతినిధులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కొణకళ్ల అధ్యక్షత వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, మంత్రి కొల్లు రవీంద్రలతో సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయనున్నట్టు కొణకళ్ల 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. మినీ మహానాడుకు ప్రత్యేక, విశిష్ట అతిథులుగా ఎవరిని పిలవాలన్నదానిపై కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి

» వత్సవాయిలో ఘటన

వత్సవాయి, మే 15 (ఆంధ్రజ్యోతి) : బ్యాంక్‌కు వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా ప్రమాద వశాత్తు సిమెంట్ ట్యాంకర్ కిందపడి నిండు గర్భిణి మృతి చెందిన ఘటన వత్సవాయిలో జరిగింది. పోలంపల్లి గ్రామానికి చెందిన రంగా సతీష్, రాజేశ్వరి దంపతులకు రెండేళ్ల బాబు ఉన్నాడు. ప్రస్తుతం రాజేశ్వరి (22) ఏడుమాసాల గర్భిణి. మామ రంగా రమేష్‌తో కలిసి ఆమె ద్విచక్రవాహనంపై గురువారం బ్యాంక్‌కు వెళ్లి పని ముగించుకొని తిరిగి పోలంపల్లి వస్తుండగా వత్సవాయి సమీపంలో ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్‌ను తప్పించే క్రమంలో రాజేశ్వరి ట్యాంకర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇరుకుదారిలో తరచూ ప్రమాదాలు

లింగాల కాజ్‌వేకి మరమ్మతులు చేపట్టడంతో ట్రాఫిక్‌ను మక్కపేట మీదుగా పెనుగంచిప్రోలు, వేమవరం, వత్సవాయి మీదుగా ప్రధాన రహదారికి చేరుకునే విధంగా మళ్లించారు. రహదారి ఇరుకుగా మారడంతో వాహనాలు తప్పుకునే వీలు లేకుండా పోయింది. దారి మొత్తం మూసుకుపోయి రహదారిపై ఇసుక పోయడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు కాజ్‌వే వద్ద డైవర్షన్ రహదారి ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రతిభ చాటారు

» మంత్రి సవిత అభినందన

» బీసీ విద్యార్థులకు నగదు పురస్కారాలు



విద్యార్థినికి నగదు పురస్కారం అందజేస్తున్న మంత్రి సవిత

వన్‌టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీ విద్యార్థుల విద్యకు బలమైన పునాదులు వేయటం వల్లే పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం ఏర్పాటు చేసిన పది, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన బీసీ హాస్టల్స్, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేసే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పది, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించి వారిలో స్ఫూర్తి నింపేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష అన్నారు. బీసీ సంక్షేమ వసతి గృహాలలో మరమ్మతులు, తదితర మౌలిక ఏర్పాట్లు చేశామన్నారు. బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. రాష్ట్రంలో మరిన్ని బీసీ గురుకులాలను నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అన్ని హాస్టల్స్‌లో ఏపీఎఫ్ఆర్ఎస్ ద్వారా విద్యార్థుల హాజరు తీసుకుని భోజనం అందిస్తున్నామన్నారు. బీసీ యువతకు సివిల్ సర్వీసు శిక్షణతో పాటు మెగా డీఎస్సీకి శిక్షణ అందిస్తున్నామన్నారు. విదేశీ విద్యకు కూడా శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. పాఠశాలలు తెరచిన వెంటనే రాష్ట్రంలో అన్ని బీసీ హాస్టల్స్‌కు సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. విద్యాదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన రాష్ట్రానికి చెందిన వీర జవాన్ మురళీ నాయక్ త్యాగాలను అందరూ గుర్తుంచుకోవాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ, ఏ విద్యార్థి అయినా నిరంతరం శ్రమిస్తేనే ఉన్నతంగా జీవితంలో స్థిరపడతాడన్నారు. అడిషనల్ డైరెక్టర్ బి.చంద్రశేఖర్‌రాజు మాట్లాడుతూ, విద్యార్థులు ఇదే ప్రతిభను నిరంతరం కొనసాగించాలని సూచించారు. అనంతరం 200 మంది విద్యార్థులకు బ్యాగ్‌లు, సర్టిఫికెట్‌లు, మెమెంటోలు.. 12మందికి రూ.20వేలు, ఏడుగురికి రూ.15వేలు, ముగ్గురుకి రూ.10వేలు చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి, అధికారులు భోజనం చేశారు. తొలుత జ్యోతిరావు పూలే విగ్రహానికి, వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకులు ఎ.మల్లికార్జున్, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల సొసైటీ కార్యదర్శి పి.మాధవీలత, ఎ.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం.. దైన్యం

(5వ పేజీ తరువాయి)

- గంపలగూడెంలో మండలం నెమలిలో 30 లారీలు, చినకొమెరలో 10 లారీలు ధాన్యం కొనాల్సి ఉంది. అనుమతులు ఇంకా రాలేదు. ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకుంటున్నారు.
- గొల్లపూడిలో ఒక లారీ ధాన్యం బస్తాలు కొనాల్సి ఉంది. అనుమతులు లేక కొండపల్లి శాంతినగర్ మిల్లు వద్ద నిలిచిపోయింది.
- ఎ.కొండూరు మండలంలో 3,500 మెట్రిక్ టన్నులు కొనాల్సి ఉంది.
- తిరువూరు మండలంలోని వావిలాల, ముష్టికుంట్ల, చింతలపాడు గ్రామాల్లో 50 లారీలకు పైగా ధాన్యం కొనాల్సి ఉంది. లారీలు రాకపోవడంతో ముష్టికుంట్ల రైతులు ట్రాక్టర్లపై మిల్లులకు ధాన్యం తరలించేందుకు సిద్ధమయ్యారు.
- రంగాపురం, రెడ్డిగూడెం గ్రామాల్లో ఐదు లారీల ధాన్యం కాటా వేయాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాలకు లారీలు రావడం లేదని, టార్గెట్ అయిపోయిందని చెబుతున్నారని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

ధాన్యం కొనుగోళ్ల వివరాలు

కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలతో ఏప్రిల్ 2 నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. క్వింటా గ్రేడ్-ఏకు రూ.2,320, కమాన్ (ఉప్పుడు బియ్యం) రకానికి రూ.2,300 నిర్ణయించారు. 107 ఆర్ఎస్‌కేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. విజయవాడ డివిజన్‌కు 7.47 లక్షలు, తిరువూరు డివిజన్‌కు 8.62 లక్షలు, నందిగామ డివిజన్‌కు 3.55 లక్షల గన్నీబ్యాగ్‌లు అందజేశారు. పీఏసీఎస్‌లు, డీసీఎంఎల ఆధ్వర్యంలో మొత్తం 107 ఆర్ఎస్‌కేలు ధాన్యం సేకరణ చేపట్టాయి. ఇప్పటి వరకు 69,858 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు. జిల్లాలో మొత్తం 5,956 మంది రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి చెల్లించాల్సింది రూ.154.91 కోట్లు కాగా, రూ.127.08 కోట్ల మేర చెల్లింపులు జరిగాయి. అనేక ఆటుపోట్ల నడుమ ప్రభుత్వం, అధికార యంత్రాంగం రైతులను సంతృప్తి పరిచినా.. మిగిలిన ధాన్యం ఏమిటన్నదే ప్రశ్నగా మారింది.

ఉత్కంఠగా ఎడ్ల బండ లాగుడు పోటీలు



బండ లాగుతున్న ఎడ్లజత



విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

నందిగామ రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి) : లింగాలపాడు గ్రామంలో తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. గురువారం న్యూ కేటగిరి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలలో ఎనిమిది జతలు పాల్గొన్నగా 20 నిముషాల వ్యవధిలో 14.50 క్వింటాళ్ల బండ లాగినట్లు రైతు కమిటీ సభ్యులు తెలిపారు. ఎడ్ల యజమానులకు అంబారుపేట సత్యమ్మ అమ్మవారి మాజీ ఛైర్మన్ గరికపాటి భాస్కరం సోదరులు వస్త్రాలు, జ్ఞాపికలు అందజేశారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఆరు పళ్ల విభాగం విజేతలు

బుధవారం రాత్రి జరిగిన ఆరు పళ్ల జతల విభాగంలో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన శ్రీకావ్య నంది బ్రీడింగ్ బుల్స్ నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత 3,911.08 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ. 40వేలు గెలుచుకుంది. అదే విధంగా కృష్ణాజిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన ఏఎస్ఆర్ మెమోరియల్ అనంతనేని శ్రీకావ్య శ్రీమధు ఎడ్ల జత ద్వితీయ స్థానంలో నిలిచి రూ.35 వేలు, బాపట్ల జిల్లా మంగళూరు మండలం పంగళూరు గ్రామానికి చెందిన గొట్టిపాటి రవికుమార్ యూత్ చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్ల జత తృతీయ స్థానంలో నిలిచి రూ. 25వేలను గెలుచుకుందన్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామానికి చెందిన గాదే అశేర్ సమన్వీ రెడ్డి ఎడ్లజత నాలుగవ స్థానంలో నిలిచి రూ.20 వేలను గెలుచుకున్నాయి.

మామిడీలా

(5వ పేజీ తరువాయి)

కావడమే కష్టంగా మారింది.

టన్ను రూ.25 వేలు పలికితే ఎక్కువే..

మామిడి సీజన్ ప్రారంభ, ముగింపు సమయాల్లో బంగినపల్లి, రసాలు టన్ను రూ.50 వేల నుంచి రూ.55 వేల వరకు పలికేది. ఇక సీజన్‌లో టన్ను రూ.30 వేల నుంచి రూ.35 వేలు ఉండేది. అయితే, ఈ ఏడాది సీజన్‌లో టన్ను మొదటి క్వాలిటీ రూ.25 వేలు పలకడం గగనమైంది. తక్కువ రకం కాయల ధరలు రూ.10 వేల నుంచి రూ.15 వేలు పలికితే ఎక్కువగా ఉంది. సాధారణంగా మూడు టన్నుల కాయలు కూలీలను పెట్టి కోసి మార్కెట్‌కు వాహనాల ద్వారా తరలించేందుకు రూ.10 వేలపైనే రైతులకు ఖర్చవుతుంది. మొదటి రకం కాయలైతే ఫర్వాలేదు కానీ, తక్కువ రకం కాయలైతే రైతులకు కూడా మిగిలేదేం ఉండదు.

అకాల వర్షంతో లావెక్కిన కాయలు

నున్న మామిడి మార్కెట్ నుంచి ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ఎగుమతులు అవుతుంటాయి. ఆయా రాష్ట్రాల్లో మన మామిడికి మంచి డిమాండ్ ఉంది. అయితే, అకాల వర్షం కారణంగా కాయ నీరెక్కి సైజు పెరగడం ఎగుమతులపై ప్రభావం చూపిందని వ్యాపారులు చెబుతున్నారు. సైజు పెరిగిన కాయ కొనడానికి ఆయా రాష్ట్రాల్లో వినియోగదారులు ఇష్టపడరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విపత్తుపై అప్రమత్తం

ఖరీఫ్‌కు సమాయత్తం!

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

- **మార్చి 19న సైబరాబాద్ పోలీసులు పెద్దఎత్తున నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాలను పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు లారీలో తీసుకువస్తున్న రూ.98.75 లక్షల విలువైన 3,750కిలోల బీటీ-3 విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.**
- **ఏప్రిల్ 12న వికారాబాద్ జిల్లా పోలీసులు, గుంటూరు నుంచి తరలిస్తున్న 44 లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు.**

..పంట భూముల్లో దుక్కులు దున్నింది మొదలు పంట చేతికి వచ్చేంతవరకు రైతులు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ఆశాజనకమైన పంట దిగుబడులు రావాలంటే ఎరువులు, పురుగుమందులతో పాటుగా విత్తనాల కొనుగోళ్లలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే నామమాత్రపు దిగుబడులు కూడా లేక, పెట్టుబడులు తిరిగి చేతికి అందక నష్టాలను మూటగట్టుకోవాల్సిన ప్రమాదం ఉంది. గతంలో అక్రమార్కుల వలలో చిక్కుకుని అమాయకత్వంతో నకిలీ విత్తనాలు, నాసిరకం విత్తనాలు సాగుచేసి, రోడ్డున పడిన అన్నదాతల కుటుంబాలకు కొదవలేదు. అక్రమ సంపాదన కోసం అన్నదాతలను నట్టేట ముంచుతున్న అక్రమార్కులపై పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోలేకపోవటమే కాకుండా బాధితులకు సకాలంలో తగిన న్యాయం లభించటం లేదు.

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న వేళ..

కొద్దిరోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నది. ఇప్పటికే అకాల వర్షాలు పడుతుండటంతో పలువురు రైతులు చెత్తా చెదారం తొలగించి పంట భూములను బాగుచేశారు. రుతుపవనాలు రాగానే భూములు పదును అయిన వెంటనే విత్తనాలు వేసేందుకు రైతులు భూములను సిద్ధం చేస్తున్నారు. అయితే విత్తనాల బెడద రైతులకు పెనుసవాల్‌గా మారుతున్నది. ఏది మంచిదో, ఏది నకలీదో అర్థంకాని విధంగా విత్తనాల ప్యాకెట్స్ ఉంటున్నాయి. గతంలో జరిగిన సంఘటనల దృష్టిలో పెట్టుకుని పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న, పెసర తదితర పంటల విత్తనాలు కొనేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనాలి. ఎట్టి పరిస్థితుల్లో కూడా అనుమతుల్లేని దుకాణాల్లో, అనధికార వ్యక్తుల వద్ద కొనగూడదు. కొన్న విత్తనాలకు సంబంధించి రశీదు (బిల్లు) దుకాణాదారుడు నుంచి తీసుకోవాలి. ఈ బిల్లును పంట దిగుబడి వచ్చేంతవరకు, పంట కాలం పూర్తి అయ్యేంత వరకు భద్రపరుచుకోవాలి. విత్తనాలు నకిలీవి అని తేలితే సదరు విత్తన ఉత్పత్తిదారుడి నుంచి తగిన నష్టపరిహారం పొందేందుకు ఈ రశీదు చాలా ముఖ్యం. ఈ రశీదుపై విత్తన రకం, కంపెనీ పేరు, బ్యాచ్, లాట్ నెంబర్లు, ధర తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. రశీదుపై విత్తనాలు అమ్మిన దుకాణం ముద్ర ఉండేలా చూసుకోవాలి. విత్తన ప్యాకెట్ తయారైన తేదీ (డీఓపీ), పరీక్షించిన తేదీ (డీఓటీ), గడువు తేదీ సరిగా ఉన్నాయో లేవో సరిచూసుకోవాలి. విత్తన సంచులు చిరిగినా, రంధ్రాలు ఉన్న, తడిసిన కొనుగోలు చేయవద్దు. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమ శాతం కూడా చూసుకోవాలి.

అక్రమార్కుల వలలో పడొద్దు..

గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు అమ్మే వారివద్ద కొనుగోలు చేయకూడదు. కొంతమంది అక్రమార్కులు, గ్రామాల్లో పెద్దలను ఆకట్టుకుని, నకిలీ విత్తనాలను బ్రాండెడ్ కంపెనీలవని చెపుతూ, అందమైన ప్యాకెట్లలో నింపి అమ్ముతుంటారు. ధర చాలా తక్కువంటూ ఇంకొందరు విత్తనాలను లూజుగా అమ్ముతుంటారు. తక్కువ ధరకు లభిస్తున్నాయని ఆశపడి ఎట్టిపరిస్థితుల్లో కూడా అనుమతి లేని విత్తనాలు కొనవద్దు. ముఖ్యంగా నాణ్యమైన మిర్చి విత్తనాల ధర కిలో వేలల్లో ఉంటుంది. కొంత మంది లూజుగా విత్తనాలు తీసుకువచ్చి నాణ్యమైన విత్తనాలంటూ తక్కువ ధరకు అమ్ముతుంటారు. వీరిపట్ల జాగ్రత్తగా ఉండటమే కాకుండా, అట్టి వారి గురించి వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలి.

నిషేధిత విత్తనాలకు దూరంగా ఉండాలి

పత్తికి సంబంధించి బీటీ-3 విత్తనాలు కొనగూడదు.. సాగుచేయకూడదు. పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించటంతో బీటీ-3 పత్తి విత్తనాలకు కేంద్ర ప్రభుత్వ అనుమతి ఇవ్వలేదు. ఈ విత్తనాలు నిషేధం. అయినప్పటికీ పలుచోట్ల అనధికార వ్యక్తులు బీటీ-3 విత్తనాలు గుట్టుగా అమ్ముతున్నారు. అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో జిల్లాలో అక్కడక్కడ రైతులు సాగు చేస్తున్నారు. ఈ విత్తనాలను కొనవద్దని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు.

బెంజి సర్కిల్ ఫీడర్ రోడ్డులో వృద్ధురాలి మృతదేహం

ఆటోనగర్, మే 15(ఆంధ్రజ్యోతి): బెంజి సర్కిల్ ఫీడర్ రోడ్డులో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించినట్టు పటమట పోలీసులు గురువారం తెలిపారు. వృద్ధురాలు వయసు 75 ఏళ్లు ఉంటుందని, ఆకుపచ్చని చీర దేహంపై ఉందని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. వృద్ధురాలికి సంబంధించిన వారు పటమట పోలీస్‌స్టేషన్‌కు 93471 52223 ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.



'న్యాయమిత్ర'ను తక్షణమే అమలు చేయాలి

- బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఏకే బాషా, కేవీ రంగారావు

విజయవాడ లీగల్, మే 15(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో కొద్దికాలంపాటు ఇచ్చిన లా నేస్తంను కూటమి ప్రభుత్వం న్యాయమిత్రగా పేరు మార్చిందని, జూనియర్ న్యాయవాదులను ఆర్థికంగా ఆదుకొనేందుకు ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలని బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఏకే బాషా, కేవీ రంగారావు కోరారు. గురువారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండు రోజుల క్రితం న్యాయమిత్ర పథకాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు, న్యాయవాద రక్షణ చట్టాన్ని త్వరగా అమల్లోకి తెచ్చేలా సహాయం చేయాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు న్యాయవాదులు వినతిపత్రం ఇచ్చినట్లు వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గత ప్రభుత్వం లా నేస్తం ద్వారా జూనియర్ న్యాయవాదులకు ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని చెప్పిందని, దీనిని అమలు చేయాలని కోరారు. కార్యవర్గసభ్యులు ముద్దాడ సత్యనారాయణ, కె.అనురాధ, జి.వరాహ లక్ష్మి పాల్గొన్నారు.

ఆదిలోనే అడ్డంకి

పుల్లేటికట్ట విస్తరణ పనుల కోసం అధికారుల మార్కింగ్

- అంగీకరించని స్థానికులు.. వెనుదిరిగి వెళ్లిన అధికారులు

గుణదల, మే 15(ఆంధ్రజ్యోతి): బెంజిసర్కిల్ పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు వద్ద నుంచి వచ్చే మురుగునీరంతా లయోల కళాశాల మీదుగా గుణదల పుల్లేటికట్ట డ్రెయిన్ ద్వారా గుణదల సెంటర్ వద్ద రైవస్ కాల్వలో కలుస్తుంది. ఈ ప్రాంతంలో కాలనీలు పెరిగిపోయాయి నివాసాలు పెరిగిపోవడంతో మురుగునీటి ప్రవాహమూ పెరిగింది. గత ఏడాది ఆగస్టులో నగరంలో వచ్చిన వరదల్లో బెంజిసర్కిల్ వద్ద మొదలు పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, భారతీనగర్‌తో సహాపలు కాలనీలు జలమయయ్యాయి. దీనికి ప్రధాన కారణం పుల్లేటికట్ట డ్రెయిన్ పూడుకుపోయి, కుచించుకుపోయి మురుగునీరు సజావుగా పారుదల కాకపోవడమే. పురపాలకశాఖ మంత్రి దీనిపై దృష్టి పెట్టి తక్షణమే పుల్లేటికట్ట రోడ్డు విస్తరణ, డ్రెయిన్‌ను నూతనంగా నిర్మించాలని నిర్ణయించడంతో అధికార యంత్రాంగంలో ఒక్కసారిగా కదలిక వచ్చింది. స్థానికులతో సంప్రదింపులు చేయకుండానే అధికారులే ఏకపక్షంగా సర్వే మొదలు పెట్టారు. అధికారుల ఆలోచనలకు స్థానికుల ఆలోచనలకు పొసగడం లేదు.



పుల్లేటికట్ట రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేసిన నగరపాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు

స్థానికులకు, అధికారులకు మధ్య వాగ్వివాదం

పుల్లేటికట్ట రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేయడానికి తాజాగా గురువారం ఉదయం అధికారులు రావడంతో అధికారులు...స్థానికులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ పుల్లేటికట్ట రోడ్డు వద్దకు చేరుకుని స్థానికుల అంగీకారంతోనే విస్తరణ పనులు జరిగేలా చూడాలని తక్షణమే సర్వే పనులు నిలిపివేయాలని చెప్పడంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. స్థానికులతో ఇప్పటికే సమావేశం నిర్వహించామని అధికారులు అవినాశ్‌కు తెలియజేశారు.

సగంలోనే నిలిచిపోయిన పుల్లేటికట్ట డ్రెయిన్ పనులు

గతంలోనే పుల్లేటికట్ట డ్రెయిన్ నిర్మాణ పనులు 3వ డివిజన్ పరిధిలో ప్రారంభించారు. లయోలా కళాశాల వద్ద ప్రారంభమైన ఈ పనులు సగంలోనే నిలిపేశారు. మహానాడు రోడ్డు జంక్షన్ నుంచి గుణదల సెంటర్ చేరుకోవడానికి ఇది షార్ట్‌కట్ కావడంతో వాహనాల రాకపోకలు ఇటుగా బాగా పెరిగిపోయాయి. డ్రెయిన్ వెంబడి రక్షణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పుల్లేటికట్ట డ్రెయిన్ నిర్మాణం పూర్తి స్థాయిలో జరిగి రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరగాల్సిన అవసరం ఉంది.

వీధి నాటకం ద్వారా హెచ్ఐవీపై అవగాహన

బెంజిసర్కిల్, మే 15(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బెంజిసర్కిల్‌లో గురువారం సాయంత్రం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ఎం.గంగాధర్ కళాబృందం ప్రదర్శించిన వీధినాటకం అందరినీ ఆకట్టుకుంది. వీధినాటకం ద్వారా ప్రజలకు కళాకారులు అవగాహన కల్పించారు. వాసవ్య మహిళా మండలి సిబ్బందితోపాటు స్థానికులు పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

'తూర్పు'లో పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయాలి

పటమట, మే 15 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలోని ఆటోనగర్, ఏపీఐఐసీ కాలనీలో కార్పొరేషన్ ఎలిమెంటరీ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు మొగల్రాజపురంలో మూడేళ్ల క్రితం మూతపడిన సీఎస్ఐ పాఠశాలను పునఃప్రారంభించాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వినతి పత్రమిచ్చారు. ఇదే అంశాలపై మంత్రి నారా లోకేశ్‌కు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజుకు మంగళగిరిలోని కార్యాలయంలో వినతి పత్రం అందించామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా పాఠశాలల్లో పిల్లలు సంఖ్య బాగానే ఉందని పేర్కొన్నామన్నారు. మంత్రి సత్యకుమార్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రతి నెలా ఒక సంక్షేమ పథకం అమలుతో పాటు అర్హులైన వారికి పింఛన్లు అందిస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గురువారం 14వ డివిజన్‌లోని గురివిందరాజులు మున్సిపల్ స్కూల్ ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో ఇద్దరు నిరుపేద కార్యకర్తలకు రూ.45 వేల విలువైన ప్లాట్‌ఫాం రిక్షాలను ఆయన సొంత నిధులతో కొనుగోలు చేసి వారికి వితరణగా ఇచ్చారు. నర్రా కిషోర్, వీరంకి డాంగియా కుమారి, రాధారపు ఎల్లబాబు, గరికపాటి బద్రి, యార్లగడ్డ సందీప్, చెరుకూరి సాంబయ్య పాల్గొన్నారు.

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

- అధికారులకు కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

కార్పొరేషన్, మే 15(ఆంధ్రజ్యోతి): నగరాన్ని పరిశుభ్రంగా, అందంగా ఉంచాలని అధికారులను వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఫిలింకాలనీ, మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, ఎస్ఎల్వీ నగర్, ఎంజీ రోడ్డు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఫిలిం కాలనీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదును ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. క్రీస్తురాజపురంలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేదని రోజూ పనులు చేయాలని ఆదేశించారు. అమృత్ పథకంలో భాగంగా నిర్మించబోతున్న డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు. భవనాల వ్యర్థాలు నగరంలో ఎక్కడ కనబడినా వెంటనే తొలగించేలా ప్లానింగ్ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణనాయక్ పాల్గొన్నారు.



డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

వీధి వ్యాపారుల సర్వే రెండు రోజుల్లో పూర్తి చేయాలి

నగరంలో వీధి వ్యాపారుల సర్వేను రెండు రోజుల్లో పూర్తిచేసి, నివేదికను సమర్పించాలని అధికారులను కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరంలో నిర్వహిస్తున్న వీధి వ్యాపారుల సర్వేలో ఆయన పాల్గొన్నారు. వీధి వ్యాపారం చేస్తున్న ఓ మహిళను సర్వే చేసి ఆమెకు గుర్తింపు కార్డును అందజేశారు. ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) పి.వెంకటనారాయణ, పాల్గొన్నారు.

గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్‌పై శ్రద్ధ వహించండి

నగరంలోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలోని నూతన మీటింగ్ హాల్‌లో ప్రజారోగ్య విభాగం అధికారులు, శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ సెక్రటరీ తమ సచివాలయం పరిధిలోని ప్రతివీధిలో తిరిగి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేటట్లు చూసుకోవాలన్నారు. అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ బాబు శ్రీనివాస్, అన్నపూర్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి. సోమశేఖర్ రెడ్డి, బయాలజిస్ట్ సూర్యకుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

తాగునీరు వృథా

(ఆంధ్రజ్యోతి-ప్రభుత్వాసుపత్రి): గుణదల గంగిరెడ్డుల దిబ్బ సమీపంలోని కాపుల రామాలయం వీధిలో తాగునీటి పైపులైన్ ధ్వంసమై మంచినీరు వృథాగా పోతోంది. స్థానికులు కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదు. తాగునీరు వృథాగా పోతోందని, సవ్యంగా అందరికీ అందడం లేదని స్థానికులు చెబుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి లీకులను సరిచేసి తాగునీటి ఇబ్బందిని తొలగించాలని కోరుతున్నారు. గుణదల పాత పంచాయతీ కార్యాలయం ఎదుట తాగునీటి పైపులైన్‌కు లీకు ఏర్పడి నీరు రహదారిపైకి పొంగి పొర్లుతోంది. అధికారులు లీక్ సరి చేసి తాగునీటిని వృథా కాకుండా చూడాలని ఆప్రాంత వాసులు కోరుతున్నారు.



కాపుల రామాలయం వీధిలో వృథాగా పోతున్న తాగునీరు



గుణదల పాత పంచాయతీ కార్యాలయం ఎదుట..

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- బీసీ కార్పొరేషన్ ఈడీ శంకరరావు

రాణిగారితోట, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని బీసీ కార్పొరేషన్ ఈడీ శంకరరావు సూచించారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 18వ డివిజన్‌లోని సిమెంట్ గోడౌన్‌లో ప్రారంభించిన కుట్టు శిక్షణ కేంద్రంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. శిక్షణ కేంద్రంలో మౌలికవసతులను పరిశీలించారు. శిక్షణ తరగతులు 140 మందితో రెండు బ్యాచ్‌లుగా, బ్యాచ్‌కు 70మందితో నిర్వహిస్తామని, 90రోజుల పాటు నిర్వహించే ఈ తరగతుల్లో 75శాతం హాజరు ఉన్న వారికి శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామని తెలిపారు. బ్యాచ్‌కు సరిపడా మహిళలు ఉంటే ఈ తరగతులు పూర్తయ్యాక మళ్లీ తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. టీడీపీ తూర్పు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కెర తిరుపతయ్య శిక్షణకు హాజరైన మహిళలకు శీతలపానీయాలు పంపిణీ చేశారు. బీసీ కార్పొరేషన్ సూపరింటెండెంట్ రాజేంద్రబాబు పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ శంకరరావు

విపత్తుల నిర్వహణపై అవగాహన

భారతీనగర్, మే 15(ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో రెస్క్యూ ఆపరేషన్స్, భద్రతా చర్యలు తీసుకోవడం తదితర అంశాలపై ఆంధ్రా లయోలా కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 8వ ఆంధ్రా ఎన్‌సీసీ నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విపత్తుల నివారణ దళం ఇన్‌స్పెక్టర్ అరుణోదయ ద్వివేది ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్‌సీసీ సిబ్బంది ప్రజలకు మందులు, ఆహారం అందించడమే కాకుండా సీపీఆర్ కూడా చేయొచ్చని వివరించారు. గ్యాస్ లీకేజీ, విద్యుత్, కెమికల్ ప్రమాదాలు సంభవించినప్పుడు, వరదల వంటి ప్రకృతి విపత్తుల్లో ప్రజలను కాపాడడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కెప్టెన్ వైపీపీ ప్రదీప్, క్యాంపు కమాండెంట్, లెఫ్టినెంట్ వెంకటేశ్, సబ్ లెఫ్టినెంట్ స్వప్న, థర్డ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నావెల్ యూనిట్ సిబ్బంది

రోడ్డుపైకి మురుగు..

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్): ఎల్ఐసీ కాలనీ రెండో క్రాస్ రోడ్డులోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పూడుకుపోవడంతో మ్యాన్ హోల్ లీకవుతోందని, దీంతో మురుగునీరు రోడ్డుమీద ప్రవహిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఈ మ్యాన్‌హోల్ నుంచి మురుగు, ఇతర వ్యర్థాలు బయటకు రావడంతో దుర్వాసన వస్తోందని అంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే సమస్య పరిష్కరించాలని స్థానిక పెద్దలు కోరుతున్నారు.



ఎల్ఐసీ కాలనీ రెండో క్రాస్ రోడ్డులో మ్యాన్‌హోల్ నుంచి బయటకు వస్తున్న మురుగునీరు

మల్లవల్లి పారిశ్రామికవాడలో
మౌలిక సదుపాయాలకు కృషి

● ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ పాలకభవనం ఏర్పాటుతో పాటు విద్యుత్ అవాంతరాల్లాంటి సమస్యలను పరిష్కరిస్తూ మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌ను రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిపేలా కృషి చేస్తానని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం రాత్రి పారిశ్రామికవాడలోని హరిత ట్రాన్స్ఫార్మర్ల తయారీని ఆయన పరిశీలించారు. అలాగే ఎగుమతి తదితర విషయాలను కూడా ఆయన తెలుసుకున్నారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టిముక్కల రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ అవాంతరాలతో ఉత్పత్తి దెబ్బతినడంతో పాటు వివిధ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, విద్యుత్ ఆవాంతరాలను నివారించడానికి 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ అత్యవసరమన్నారు. ఏపీఐఐసీ భూమి కేటాయించకపోవడం వల్లే మంజూరైన సబ్‌స్టేషన్ నిర్మాణం ఆగిపోయిందన్నారు. పారిశ్రామికవాడలో ప్రస్తుతం 4వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని వారికి వైద్య సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని, పోలీస్ అవుట్ పోస్టు, ఫైర్ స్టేషన్ కూడా ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. ఏపీఐఐసీ పరిపాలనా భవనం, నీటి కొరత లేకుండా చేయాలని కోరారు. సమస్యలను సావధానంగా విన్న యార్లగడ్డ త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని, అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్దకు అసోసియేషన్ ప్రతినిధులను తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు యువతకు ఉపాధి ఉద్యోగావకాశాల కల్పించాల్సిన బాధ్యత మాత్రం పారిశ్రామికవేత్తలదే నన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మురళీధర్, కార్యదర్శి ఫణీంద్ర కుమార్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో అసోసియేషన్ ప్రతినిధులు

పర్యాటకులకు మధురానుభూతిని కల్పిద్దాం

● ఆకర్షణీయంగా కొండపల్లి ఖిల్లా, బొమ్మల తయారీ కేంద్రాలు ● ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు ● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులకు మధురానుభూతిని కల్పించేలా కొండపల్లి ఖిల్లా, కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయడంతో పాటు ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు తెలిపారు. పర్యాటక శాఖ అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్ఠాత్మక కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రం, కొండపల్లి ఖిల్లాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందేందుకు అపార అవకాశాలున్నాయన్నారు. కొండపల్లిలో సుమారు 400 ఏళ్లకు పైగా రాజస్థాన్‌కు చెందిన హస్త కళాకారులు అత్యంత కళానైపుణ్యంతో తయారుచేసిన బొమ్మలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. కొండపల్లి పరిసర ప్రాంతాల్లో లభ్యమయ్యే తెల్ల పొణికి చెక్కతో రూపొందించే ఈ బొమ్మలకు మరింత ప్రాచుర్యం కల్పించాలని, కళాకారులను ప్రోత్సహించాలని, జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శతాబ్దాల చారిత్రక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొండపల్లి బొమ్మల విశిష్టతను పర్యాటకులకు చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలన్నారు. కొండపల్లి బొమ్మల కాలనీ నుంచి ఖిల్లా వరకున్న మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేసి పర్యాటకులకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. కొండపల్లి వద్ద పర్యాటకులు ట్రెకింగ్ నిర్వహించుకొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర టూరిజం అథారిటీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఎస్.పద్మారాణి, టూరిజం కన్సల్‌టెంట్ సాహితి, జిల్లా పర్యాటక అధికారి ఏ శిల్ప, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

దోమల నియంత్రణతోనే డెంగ్యూ నివారణ

దోమల నియంత్రణతోనే డెంగ్యూ వ్యాధిని అరికట్టగలుగుతామని అధికారులు, ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రాణాంతక డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. 16న జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగ్యూ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా వైద్యారోగ్య శాఖ, వీఎంసీ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ అధికారులతో గురువారం లక్ష్మీశ, కలెక్టరేట్ నుంచి జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించి అనంతరం అవగాహన పోస్టరును విడుదల చేశారు. జిల్లా మలేరియా అధికారి వి.మోతిబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని, వైద్య ఆరోగ్యశాఖ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీలింగ్ ల్యాండ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

వన్‌టౌన్: సీలింగ్ ల్యాండ్‌కు సంబంధించిన కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సీలింగ్ ల్యాండ్ కేసులపై తీసుకోవాల్సిన తక్షణ చర్యలు గురించి విజయవాడ, నందిగామ, తిరువూరు, రెవెన్యూ డివిజనల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భూసంస్కరణ యాక్ట్ 1973 ప్రకారం ఆర్డీవోలు, వారి డివిజన్ పరిధిలో ట్రిబ్యునల్ అథారిటీ కావున సంబంధిత కేసులను తక్షణమే పరిష్కరించి సీలింగ్ ల్యాండ్స్ కింద ఆ భూములను స్వాధీనం చేసుకుని 22ఏ నిషేధిత జాబితాలో సంబంధిత వివరాలను పొందుపరచాలని ఆదేశించారు. సీలింగ్ ల్యాండ్స్ అంశంపై ప్రతి వారం సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: తిరంగా ర్యాలీ సందర్భంగా నగరంలో శుక్రవారం ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ఈ మళ్లింపులుంటాయని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు తెలిపారు. ఈ ఆంక్షలను గమనించి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

● 4 నుంచి 8 గంటల వరకు ఎంజీ రోడ్డులో ఎటువంటి వాహనాలను అనుమతించరు.

●రామవరప్పాడు-వారధి-రామవరప్పాడు వైపు వెళ్లే వాహనాల ను మహనాడు, ఆటోనగర్, పటమట, ఎన్టీఆర్ సర్కిల్, కృష్ణవేణి రోడ్డు మీదుగా మళ్లిస్తారు.

● పెనమలూరు-బెంజ్‌సర్కిల్ మార్గంలో వాహనాలను ఆటోనగర్ గేటు, మహనాడు జంక్షన్ వైపు మళ్లిస్తారు.

●పెనమలూరు-వారధి-పెనమలూరు వైపు ట్రాఫిక్‌ను పటమట, ఎన్టీఆర్ సర్కిల్, కృష్ణవేణి రోడ్డు, రామలింగేశ్వరనగర్, స్క్రూ బ్రిడ్జి మార్గంలో పంపుతారు.

●విశాఖపట్నం, ఏలూరు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు, గుణదల, చుట్టుగుంట, విజయ టాకీస్, స్వర్ణ ప్యాలస్ జంక్షన్, పీసీఆర్ మీదుగా పీఎన్‌బీఎస్‌కు చేరుకోవాలి.

● మచిలీపట్నం, గుడివాడ నుంచి వచ్చే బస్సులు తాడిగడప 100 అడుగులు రోడ్డు, ఎనికేపాడు, రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు, గుణదల, చుట్టుగుంట, విజయటాకీస్, స్వర్ణప్యాలస్, పీ సీఆర్ జంక్షన్, పీఎన్‌బీఎస్‌కు వెళ్లాలి.

● తిరంగా ర్యాలీకి వచ్చే ప్రముఖులు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉన్న హ్యాండ్‌బాల్ కోర్టులో వాహనాలను నిలుపుకోవాలి.

● ప్రభుత్వ అధికారులు, బందోబస్తు విధులకు వచ్చిన వారు సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో వాహనాలను నిలుపుకోవాలి.

● పశ్చిమ నియోజకవర్గం నుంచి కార్యక్రమంలో పాల్గొనడాని కొచ్చే సాధారణ ప్రజల కార్లు, బస్సులను బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలో పార్క్ చేసుకోవాలి.

● కారులను సీఎస్ఐ చర్చిలో పెట్టుకోవాలి.

● సెంట్రల్ నియోజకవర్గం నుంచి వచ్చే కార్లు, బస్సుల కోసం విశాలాంధ్ర రోడ్డులోని శాతవాహన కళాశాల గ్రౌండ్స్‌ను కేటాయించారు.

● తూర్పు నియోజకవర్గం నుంచి వచ్చే కార్లు, బస్సులను సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రాంగణం, పాత ప్రభుత్వాసుపత్రి రోడ్డులో నిలుపుకోవాలి.

బర్లీ పొగాకు రైతుల సమస్య
పరిష్కారానికి మంత్రుల చొరవ

అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి లోకేశ్‌ను ప్రకాశం జిల్లా రైతులు కోరారు. దీనిపై వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు లోకేశ్ ఫోన్ చేసి, పొగాకు ధర పెంపుదలపై అవసరమైతే కేంద్రంతో మాట్లాడాలని సూచించారు. రైతుకు గిట్టుబాటు ధర లభించేలా పొగాకు కంపెనీలు, అధికారులతో అచ్చెన్నాయుడు మాట్లాడారు. ఎఫ్‌సీవీ రకంగా పొగాకు కొనుగోలు కొంత బాగానే ఉన్నా, పూర్తిగా కొనుగోలు చేయడంపైనా పొగాకు బోర్డు అధికారులతో ఆయన చర్చించారు. ఇప్పటి వరకు ఎఫ్‌సీవీ రకం పొగాకును మాత్రమే పొగాకు బోర్డు కొనుగోలు చేస్తుండగా, ఇకపై బర్లీ పొగాకును కూడా బోర్డు ద్వారా కొనుగోలు చేసేలా సీఎం చంద్రబాబు ద్వారా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్టు అచ్చెన్నాయుడు మీడియాకు తెలిపారు.

ఓసీ వైశ్యను ఆర్యవైశ్యగా మార్చండి

వన్‌టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రాలలో గ్రామ సచివాలయ పోర్టల్లో నమోదు చేసేటప్పుడు ఓసీ వైశ్యను ఆర్యవైశ్యగా మార్చాలని సీఎం చంద్రబాబును ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం విధి విధానాల ప్రకారం రాష్ట్రంలో గతంలో జరిగిన సర్వేలు, కుల గణనలను బట్టి ఉన్న ఆర్య వైశ్యలను వైశ్య, శెట్టి, గుప్తా, కోమటి వివిధ వర్గాలుగా విభజించటం వల్ల ప్రభుత్వం నిర్వహించే ఆన్‌లైన్ వెబ్‌సైట్, యాప్‌ల్లో కూడా ఆర్య, వైశ్యులను వివిధ వర్గాలుగా చూపించటం జరుగుతుందన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు రాకేష్ తెలిపారు.



పోలీస్ జాగిలం మిక్కి మృతి

లబ్బీపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): స్నిఫర్ డాగ్‌గా 11 ఏళ్లపాటు సేవలందించి వయసురీత్యా తుదిశ్వాస విడిచిన పోలీసు జాగిలం మిక్కికి పోలీసులు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. విజయవాడ కమిషనరేట్‌లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ చేపట్టే ముందస్తు భద్రత తనిఖీల్లో తన వంతు కర్తవ్యాన్నీ నిర్వర్తించిన మిక్కి మృతికి పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ శ్రద్ధాంజలి ఘటించగా, అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత, సి.ఎస్.డబ్ల్యూ డీసీపీ ఎస్.వి.డి ప్రసాద్, ఏసీపీ కృష్ణం రాజు, ప్రేమ్‌కుమార్ ఇతర అధికారులు నివాళులర్పించారు. పోలీసు జాగిలం మిక్కి లాబ్రాడర్ రీట్రివర్ జాతికి చెందినది కాగా ఇది 2012 మే 6న జన్మించింది. హైదరాబాద్‌లోని ఐఐటీఏ, ఐఎస్‌డబ్ల్యూ శిక్షణా సెంటర్ నందు డాగ్ హ్యాండ్లర్ ఏఆర్‌హెచ్‌సీ-412, పీ నాగరాజు ఆధ్వర్యంలో పేలుడు పదార్థాలను గుర్తించడంలో శిక్షణ పొందింది. 11 ఏళ్లుగా పోలీస్‌శాఖకు సేవలందించిన మిక్కి 2024 మే 17న పదవీ విరమణ చేసి పూర్తిగా విశ్రాంతి తీసుకుంటూ వయస్సు రీత్యా బుధవారం తుదిశ్వాస వీడిచింది. సందర్భంగా మిక్కి కేర్ టేకర్ పి.నాగరాజు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 2 నెలల వయస్సులో తన వద్దకు వచ్చిన మిక్కిని కుటుంబ సభ్యుడిగా ఎంతో బాధ్యతగా పెంచడంతో పాటు నిత్యం తన బాధ్యతల్లో తోడుగా ఉంటూ వచ్చానని, మిక్కి మరణం ఎంతో వేదన కలిగిస్తోందన్నారు. 14ఏళ్ల అనుబంధం కావడంతో మర్చిపోవడానికి సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.



మిక్కికి నివాళులర్పిస్తున్న పోలీసులు

ఉద్యోగుల ఐక్యతే సమస్యల పరిష్కారానికి పునాది: బొప్పరాజు

విజయవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఐక్యతే సమస్యల పరిష్కారానికి పునాదులు వేస్తాయని ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు అన్నారు. గురువారం విజయవాడ రెవెన్యూ భవన్‌లో జరిగిన ఏపీ జేఏసీ క్యాపిటల్ యూనిట్ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్యాపిటల్ యూనిట్ అంటే ఏపీ జేఏసీ అమరావతికి గుండెకాయ లాంటిదన్నారు. జేఏసీ సిటీ నూతన చైర్మన్‌గా ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీకి చెందిన పి.రవి ప్రసాద్, అసోసియేట్ చైర్మన్‌గా బి.విజయరాఘవ, కోశాధికారిగా వి.రఘు కుమార్, మరో నలుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ జేఏసీ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టి.వి.ఫణిపేర్రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.కిశోర్ కుమార్, స్టేట్ ఉమెన్ కమిటీ చైర్‌పర్సన్ పారే లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయ లక్ష్మి, ఉమెన్‌వింగ్ క్యాపిటల్ సిటీ ప్రధాన కార్యదర్శి సి.హెచ్. హర్షిత హాజరయ్యారు.

దేవదాయ శాఖ మాజీ
అధికారిణి శాంతిపై విచారణ

వన్‌టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ మాజీ అధికారిణి కె.శాంతి అవినీతి అక్రమాలపై దేవదాయ శాఖ కమిషనర్ నియమించిన విచారణ అధికారిణి, విశాఖపట్నం కనకమహాలక్ష్మి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ శోభారాణి గురువారం విజయవాడ గవర్నర్‌పేటలోని జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో విచారించారు. ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ పూర్వ అధికారిణి, విశాఖపట్నం జిల్లా దేవదాయ శాఖ అధికారిణి అన్నపూర్ణ, ఎన్టీఆర్ జిల్లాలోని పలువురు ఈవోల సమక్షంలో విచారణ అధికారిణి శాంతిని విచారించారు. శాంతి పనిచేసిన సమయంలో పలు ఆలయాలు, సత్రాలలో జరిగిన అవినీతి అక్రమాలపై ఆయా సత్రాలు, ఆలయాల ఈవోలను వివరాలను అడిగి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. పలు ఆలయాలు, సత్రాల్లో జరిగిన అవినీతి, అక్రమాల నకళ్లను విచారణ అధికారిణి శోభారాణి సేకరించారు. విచారణకు సంబంధించిన నివేదికను ఆమె ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు సమాచారం. కాగా, అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న కె.శాంతి విచారణకు గురువారం ఉదయం 11 గంటలకు ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ కార్యాలయానికి వచ్చారు. విచారణ అధికారి పైస్థాయి అధికారుల సమావేశంలో పాల్గొనటం వలన మధ్యాహ్నం నుంచి విచారణ చేపట్టారు. ఈ విచారణ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ ఇన్‌చార్జి అధికారి నటరాజన్ షణ్ముగం, సూపరిటెండెంట్ శెట్టి, ఇనెస్పెక్టర్‌లు, పలువురు ఈవోలు పాల్గొన్నారు. కాగా, పలు ఆలయాలు, సత్రాలలో కె.శాంతి అవినీతి అక్రమాలకు పాల్పడినట్టు ఆంధ్రజ్యోతి దినపత్రికలో పలు ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. వీటి పై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించింది. దీంతో ఆనాటి రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ విశాఖపట్నం కనకమహాలక్ష్మి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ శోభారాణిని విచారణ అధికారిణిగా నియమించారు.

బస్టాండ్ ప్రాంగణంలో బ్లేడ్‌బ్యాచ్ ఆగడాలు

● కొరవడిన పోలీసు నిఘా

బస్టేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్ ప్రాంగణంలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు రోజురోజుకీ మితిమీరుతున్నాయి. కృష్ణలంక పోలీసులు, బస్టేషన్ భద్రతా సిబ్బంది భద్రత కొరవడటంతో అర్ధరాత్రి సమయంలో బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు మద్యం మత్తులో ఒకరిద్దరు ప్రయాణికులను అడ్డగించి డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. లేదంటే పదునైన ఆయుధాలతో దాడికి పాల్పడుతున్నారు. ఎరైవల్ బ్లాక్‌ను కేంద్రంగా చేసుకుని వీరు రాత్రివేళలో అక్కడే పడుకుంటున్నారు. రాత్రివేళలో డ్యూటీలో ఉన్న పోలీసులు పట్టించుకోకపోవటంతో ఎరైవల్ బ్లాక్‌ను తమ అడ్డాగా మార్చుకున్నారు. ఇటీవల అక్కడ నిద్రపోతున్న బ్లేడ్ బ్యాచ్ సభ్యులను డ్యూటీలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగి లేపి వెళ్లిపొమ్మన్నందుకు ఆ ఉద్యోగితో గొడవపడి దాడికి ప్రయత్నించారు. ఎరైవల్ బ్లాక్, డిపార్చర్ బ్లాక్, సిటీ బస్ టెర్మినల్, వంతెన ఏరియా, కాల్వగట్టు ప్రాంతాలతో పాటు బస్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ ప్రాంతాల్లో వీరు ఎక్కువగా తిరుగుతూ ప్రయాణికులను నగదు, విలువైన వస్తువులను లాక్కొంటున్నారు. ప్రశ్నించిన వారిపై ఆయుధాలతో దాడికి పాల్పడుతున్నారు. గురువారం తెల్లవారుజామున 2.45 గంటలకు శ్రీశైలం నుంచి సిటీ బస్ టెర్మినల్ వద్ద ఎం.కృష్ణారావు, సనావుల్లాలు బస్ దిగారు. సనావుల్లా వాష్ రూమ్‌కు వెళ్లగా, కృష్ణారావు ఆటోకోసం నిలబడి ఉండగా, గంజాయి మత్తులో ఓ యువకుడు కృష్ణారావు వద్దకు వచ్చి డబ్బులు డిమాండ్ చేశాడు. నిరాకరించటంతో దాడికి పాల్పడ్డాడు. భయంతో అక్కడి నుంచి పరిగెత్తుతుండగా వాష్‌రూమ్ నుంచి వచ్చిన సనావుల్లా ఆపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో కృష్ణారావుకు గాయాలవగా సనావుల్లా అతడిని హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు.



రాత్రివేళలో ఆయా ప్రాంతాల్లో కృష్ణలంక పోలీసులుగానీ, బస్టేషన్ భద్రతా సిబ్బంది పర్యవేక్షణ లేకపోవటంతో వీరి ఆగడాలు మితిమీరుతున్నాయని బాధితులతో పాటు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఈ వివరాలు పోలీసులకు తెలిసినా చర్యలు తీసుకోవటంలో వెనకడుగు వేస్తున్నారని వ్యాపారులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. గురువారం ప్రయాణికుడిపై దాడి గురించి కృష్ణలంక సీఐ నాగరాజును వివరణ కోరగా తమకెవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన అభయాంజనేయ స్వామి ఆలయం

హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి

● రేపటి నుంచి అభయాంజనేయ స్వామి ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో వేంచేసి ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో 24వ హనుమజ్జయంత్యుత్సవాలు నిర్వహించడానికి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. శనివారం నుంచి ఈ నెల 22 వరకు ఉత్సవాలు నిర్వహనకు సన్నాహాలు పూర్తి చేశారు. కొద్ది రోజుల కిందట ఆలయంతో పాటు ఎదురుగా ఉన్న రామాలయానికి ఏలూరుకు చెందిన వంకినేని పూర్ణచంద్రరావు కుటుంబ సభ్యులు రంగులు వేయించి అందంగా తీర్చిదిద్దారు. 5 రోజులు పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో స్వామికి ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు, పౌరాణిక నాటకాలు ఏర్పాటు చేశారు. భక్తులు తవ్వా పూర్ణచంద్రరావు 18 కేజీలు, బోడిచర్ల రాంబాబు 25 కేజీల లడ్డూ ప్రసాదాలను ఉత్సవం ప్రారంభం రోజున సమర్పించనున్నారు. ఈవో తారకేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గత ఉత్సవాలను రూ.18లక్షలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఖర్చులకు అధికారులు నుంచి అనుమతి రాకపోవడం గమనార్హం.

క్లస్టర్ విధానంలో లోపాలను సరిచేయాలి

● వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు

గాంధీనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): రేషనలైజేషన్ పేరుతో జరుగుతున్న క్లస్టర్ విధానంలో లోపాలను ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్ రవీంద్రరాజు సీఎస్ కే విజయానంద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ సీఎస్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఒక సచివాలయానికి ఒక వీఆర్వో విధులు నిర్వహిస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని క్లస్టర్ విధానంతో పని ఒత్తిడి మరింత పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వీఆర్వోఏలు భవిష్యత్తులో వీఆర్వోలుగా ప్రమోషన్లు పొందలేరన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి మండలాల్లో తహసల్దార్‌లను సంప్రదించకుండా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చేస్తున్న అసంబద్ధ క్లస్టర్ విధానంతో అనేక భూసమస్యలు పరిష్కారం కాక రైతులు ఇబ్బందులకు గురవుతారన్నారు. దీంతో ప్రభుత్వానికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఆయా సమస్యలపై సీఎస్ సానుకూలంగా స్పందించినట్టు రవీంద్రరాజు తెలిపారు.



శిక్షణకు హాజరైన మహిళలతో మాట్లాడుతున్న శంకరరావు


ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి

● బీసీ కార్పొరేషన్ ఈడీ

రాణిగారితోట, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా ఆర్థికంగా స్థిరపడి కుటుంబానికి అండగా ఉండాలనే ప్రధాన ఉద్దేశంతో ప్రభుత్వం కుట్టుమిషన్ శిక్షణ వంటి వాటిని ప్రోత్సహిస్తోందని బీసీ కార్పొరేషన్ ఈడీ శంకరరావు అన్నారు. రాణిగారితోట 18వ డివిజన్‌లోని సిమెంట్ గోడౌన్‌లో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన కుట్టు శిక్షణా కేంద్రంలో శిక్షణా తరగతులు ఇటీవల ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గురువారం శంకరరావు ఈ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలోని మౌలికవసతులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు మొత్తం 140 మందితో రెండు బ్యాచ్‌లుగా, బ్యాచ్‌కి 70 మందితో నిర్వహించడం జరుగుతుందని, 90 రోజుల పాటు జరిగే ఈ తరగతుల్లో 75శాతం హాజరున్నవారికి శిక్షణానంతరం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామన్నారు. టీడీపీ తూర్పు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కెర తిరుపతయ్య శిక్షణకు హజరైన మహళలకు శీతలపానియాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఎంతో శ్రద్ధతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, స్థానిక బీసీ, ఓసీ మహిళలు సద్వినియోగంచేసుకోవాలని కోరారు. బీసీ కార్పొరేషన్ సూపరింటెండ్ రాజేంద్రబాబు పాల్గొన్నారు.

అపర భగీరథుడు
సర్ ఆర్థర్ కాటన్: ఆళ్ల

విజయవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం దగ్గర గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి ఆ ప్రాంత ప్రజల హృదయాల్లో అపర భగీరథుడిగా సర్ ఆర్థర్ కాటన్ పేరు సంపాదించుకున్నారని సాగు నీటి వినియోగదారుల సంఘాలసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు అన్నారు. ఆర్థర్ కాటన్ 222వ జయంతి సందర్భంగా విజయవాడలోని జలవనరుల శాఖ ఆవరణలోని కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో తొలిసారిగా కృష్ణ, గోదావరి డెల్టాలకు కాల్వల ద్వారా ఆయకట్టు, డ్రైనేజీ నిర్మించి మార్గదర్శకులయ్యారన్నారు. ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో గోదావరి నీటి వృథాను అరికట్టడానికి పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.15వేల కోట్లు నిధులు సమీకరించారన్నారు. పోలవరం నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం అభినందనీయమని గోపాలకృష్ణ అన్నారు.



కాటన్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆళ్ల వెంకటగోపాలకృష్ణ, రాష్ట్ర తెలుగురైతు ప్రధానకార్యదర్శి కుర్రా నరేంద్ర



అధికారులతో మాట్లాడుతున్న లక్ష్మీపార్థసారథి

కార్మికులకు మెరుగైన వసతులు

● ఏడీసీ చైర్‌పర్సన్, ఎండీ లక్ష్మీపార్థసారథి

పాయకాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ లక్ష్మీపార్థసారథి గుత్తేదారు సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. రాజధాని అమరావతి నిర్మాణపనులను గురువారం ఆమె పరిశీలించారు. ముందుగా తుళ్లూరు ఆర్‌వీఆర్ సంస్థ క్యాంపును తనిఖీ చేసి అక్కడ కార్మికులు నివేశించేందుకు ఏర్పాటు చేసిన నివాస గృహాలు, తాగునీరు సరఫరా, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల కల్పన, కనీస వసతులను పరిశీలించారు. పనిచేస్తున్న కార్మికులు ఏ ఏ రాష్ట్రాల నుంచి వచ్చారనే విషయమై ఆరా తీశారు. అలాగే గుత్తేదారు సంస్థలు కార్మికులకు కల్పిస్తున్న భోజన వసతిని కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. అధికారులు టి. మోజెస్‌కుమార్, డాక్టర్ కేవీ గణేష్‌బాబు, ఎస్ఈలు శ్రీనివాసరావు, నరసింహారావు, బి శ్రీధర్, టి పద్మాకర్ పాల్గొన్నారు.

దాదాసాహెబ్ బయోపిక్‌లో ఆమీర్‌ఖాన్



భారతీయ సినిమా పితామహుడు దాదా సాహెబ్ ఫాల్కే. ఆయన నిర్మించిన తొలి భారతీయ చిత్రం 'రాజా హరిశ్చంద్ర' 1913లో విడుదలైంది. ఆ తర్వాత 'లంకా దహన్', 'శ్రీ కృష్ణ జన్మ', 'కాళీయ మర్దన్' వంటి విజయవంతమైన చిత్రాలను ఆయన తెరకెక్కించారు. కళామతల్లికి దాదాసాహెబ్ చేసిన సేవలకు గాను ఆయన పేరుతో కేంద్ర ప్రభుత్వం జాతీయ అవార్డును నెలకొల్పి ఏటా అందజేస్తోంది. ఇప్పుడు ఆయన జీవిత విశేషాలతో ఓ చిత్రం రూపుదిద్దుకోనున్నది. ఇందులో బాలీవుడ్ నటుడు ఆమీర్‌ఖాన్ లీడ్ రోల్‌లో నటించనున్నారు. రాజ్‌కుమార్ హిరానీ తెరకెక్కించనున్నట్లు మేకర్స్ గురువారం అధికారికంగా ప్రకటించారు. 'త్రీ ఇడియట్స్', 'పీకే' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల తర్వాత ఆమీర్‌ఖాన్-రాజ్‌కుమార్ హిరానీ కాంబినేషన్‌లో వస్తున్న మూడో చిత్రమిది. కాగా, తెలుగు దర్శకుడు రాజమౌళి సమర్పణలో కూడా 'సాదాసాహెబ్ ఫాల్కే' బయోపిక్ తెరకెక్కనున్నదని, ఇందులో జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటించనున్నారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. అయితే ఈ ప్రాజెక్టు గురించి ఎలాంటి అధికారిక సమాచారం రాలేదు. అయితే ఈ రెండు వార్తలు ఒకే రోజున రావడం ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఊహించని కథతో మెప్పిస్తాం

- అశ్విన్‌బాబు



హీరో అశ్విన్‌బాబు నటించిన తాజా చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. ఈ థ్రిల్లర్‌కు మామిడాల ఎం.ఆర్ కృష్ణ దర్శకుడు. టి. గణపతిరెడ్డి నిర్మిస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు శైలేశ్ కొలను, సంగీత దర్శకుడు తమన్ సినిమా టీజర్‌ను ఆవిష్కరించారు. మంచు మనోజ్ గంభీరమైన గొంతుతో మొదలైన టీజర్ యాక్షన్ మూడ్‌ను సెట్ చేసింది. అశ్విన్‌బాబు మాట్లాడుతూ 'ఎవరూ ఊహించని ఒక కొత్త పాయింట్‌తో ఈ చిత్రం తెరకెక్కింది. గణపతిరెడ్డి గారి వల్లే సినిమా గ్రాండియర్‌గా వచ్చింది. ఈ సినిమా ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది' అన్నారు. చిత్రబృందం కృషివల్లే ఒక మంచి సినిమాను తెరకెక్కించగలిగాం అని కృష్ణ చెప్పారు. 'అశ్విన్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు, ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని గణపతిరెడ్డి చెప్పారు.

రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్



హాస్యం, రొమాన్స్, ఎమోషన్స్ అంశాలతో రూపుదిద్దుకున్న చిత్రం 'వర్జిన్ బాయ్స్'. యువతీయువకుల మధ్య ప్రస్తుతం ఉన్న రిలేషన్‌షిప్స్ గురించి వివరిస్తూ దయానంద్ దర్శకత్వంలో రాజా దరపునేని నిర్మించారు. గీతానంద్, మిత్రా శర్మ హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం టీజర్ విడుదలైంది. యూత్‌ఫుల్ వైబ్స్ కలర్‌ఫుల్ విజువల్స్‌తో టీజర్ ఆకట్టుకుంటోంది. చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ 'యూత్‌కి కనెక్ట్ అయ్యేలా చిత్రాన్ని తీశాం. ఇంతకుముందు ఎన్నో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్స్ వచ్చినా వాటిని మైమరిపించేలా సినిమా ఉంటుంది. ఈ సమ్మర్‌కు కచ్చితమైన సినిమా' అన్నారు. శ్రీహాన్, రోనిత్, జెన్నిఫర్, అన్షుల, సుజిత్‌కుమార్, అభిలాష్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ఈశ్వర్ ఇక లేరు



ఐదు దశాబ్దాలుగా ఫిల్మ్ జర్నలిస్ట్‌గా తెలుగు చిత్రపరిశ్రమలో ఉంటూ వివాదరహితుడైన బి.కె. ఈశ్వర్ (76) బుధవారం రాత్రి అనారోగ్యంతో కన్ను మూశారు. ఆయన పూర్తి పేరు భైరపి కోటేశ్వరరావు. 'విజయచిత్ర' మాస పత్రికలో చాలా కాలం పని చేశారు. జర్నలిస్టుగా తన అనుభవాలను బి.కె.ఈశ్వర్ 'ఆంధ్రజ్యోతి' సంస్థకు చెందిన 'నవ్య' వారపత్రికలో 62 వారాల పాటు 'అనగా అనగా ఒకసారి' పేరుతో వ్యాసాలు రాశారు. జర్నలిజానికి మాత్రమే పరిమితం కాకుండా ఈశ్వర్ పలు సినిమాలకు మాటలు, పాటలు కూడా రాశారు. గురువారం ఆయన అంత్యక్రియలు జూబ్లీ హిల్స్ శ్మశాన వాటికలో జరిగాయి.

జూనియర్ వస్తున్నాడు



గాలి జనార్థన్ రెడ్డి తనయుడు కిరీటిరెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'జూనియర్'. శ్రీలీల కథానాయిక. రాధాకృష్ణ దర్శకత్వంలో రజని కొర్రపాటి నిర్మించారు. జెనీలియా కీలకపాత్ర పోషించారు. చిత్రబృందం గురువారం విడుదల తేదీని ప్రకటించింది. జూలై 18న 'జూనియర్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపింది. 'కుటుంబంతో కలసి సరదాగా చూసేలా ఈ చిత్రం ఉంటుంది, వినోదం, భావోద్వేగం కలబోతగా రూపొందించాం' అని యూనిట్ పేర్కొంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

ప్రచార పర్వం జోరుగా...



కమల్‌హాసన్ కథానాయకుడిగా మణిరత్నం తెరకెక్కించిన చిత్రం 'థగ్‌లైఫ్'. జూన్ 5న ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రమోషన్లను వేగవంతం చేస్తోంది టీమ్. ఈ నెల 17న ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. అలాగే, ఈనెల 24న హైదరాబాద్‌లో ఆడియో వేడుకను, 29న విశాఖపట్నంలో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా ఎన్.సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. శింబు, జయం రవి, త్రిష కీలక పాత్రలు పోషించారు. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు.

ఆంధ్రా కింగ్ తాలూకా



రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు పి. దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఉపేంద్ర కీలకపాత్ర పోషిస్తున్నారు. గురువారం చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించింది. 'ఆంధ్రా కింగ్ తాలూకా' అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్‌లో రామ్ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. రావు రమేశ్, మురళీ శర్మ, రాహుల్ రామకృష్ణ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ - మెర్విన్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని.

జంటగా మరోసారి



'బేబీ' సినిమాతో సూపర్ హిట్ కొట్టిన ఆనంద్ దేవరకొండ - వైష్ణవి చైతన్య కలసి మరోసారి ప్రేక్షకులను అలరించబోతున్నారు. వీరిద్దరు జంటగా ఆదిత్య హాసన్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతోంది. ఈ సినిమా పూజా కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమైంది. హీరోయిన్ రష్మిక మందన్న క్లాప్ కొట్టగా, నటుడు శివాజీ కెమెరా స్విచ్చాన్ చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. జూన్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుందని మేకర్స్ తెలిపారు.

భర్తగా కాదు..

బంగారుగుడ్డు పెట్టే బాతులా చూశారు

-హీరో రవి మోహన్



తన భార్య ఆర్తిపై తమిళ హీరో రవి మోహన్ సంచలన ఆరోపణలు చేశారు. తనను ఓ భర్తగా కాకుండా బంగారుగుడ్డు పెట్టే బాతుగా చూశారని ఆరోపించారు. ప్రేమ పేరుతో తన డబ్బు, ఆస్తి అన్నింటిని ఉపయోగించుకున్నారని రవి గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో తన భార్య ఆర్తికి విడాకులు ఇవ్వడానికి గల కారణాలు, తమ మధ్య చోటుచేసుకున్న వివిధ అంశాలను ఆయన ప్రస్తావించారు. "కొన్నేళ్ళుగా వెన్నుపోటుకు గురవుతూ వచ్చాను. వారు ఇప్పుడు గునపంతో గుండెల్లో గుచ్చడం కూడా సంతోషంగా ఉంది. నా విడాకులకు గల కారణాలను నా బంధువులు, కుటుంబ సభ్యులు, నన్ను ప్రేమించే అభిమానులకు ఇప్పటికే వివరించాను' అని ప్రకటనలో పేర్కొన్నారు.

-చెన్నై (ఆంధ్రజ్యోతి)

వివాదాస్పద పాటలో మార్పు



తమిళ నటుడు సంతానం హీరోగా నటించిన 'డెవిల్స్ డబుల్ నెక్స్ట్ లెవల్' చిత్రంలోని 'శ్రీనివాసా గోవిందా' పాటలో మార్పులు చేసి, మళ్లీ సెన్సార్ బోర్డు నుంచి సర్టిఫికేట్ తీసుకుంటామని చిత్ర నిర్మాత హైకోర్టుకు తెలిపారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. అయితే, ఈ చిత్రంలో 'శ్రీనివాసా గోవిందా' అనే పాట చరణాలు శ్రీవేంకటేశ్వర స్వామిని కించపరిచేలా ఉన్నాయంటూ విమర్శలు వచ్చాయి. ఈ పాటను తక్షణం తొలగించాలని, లేనిపక్షంలో రూ.100 కోట్ల పరువునష్టం చెల్లించాలంటూ హీరో సంతానంకు టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాశ్ లీగల్ నోటీసులు పంపించారు. అదేవిధంగా చెన్నైకి చెందిన బాలాజీ అనే వ్యక్తి ఈ చిత్ర సెన్సార్ సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని, విడుదలను అడ్డుకోవాలని కోరుతూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. గురువారం ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

స్పోర్ట్స్

గాయత్రి జోడీ పరాజయం

థాయ్ ఓపెన్‌లో ముగిసిన భారత పోరు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. గురువారం జరిగిన రెండో రౌండ్ పోటీల్లో గాయత్రి గోపీచంద్ జోడీ సహా ఉన్నతి హుడా, మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్ నిష్క్రమించారు. డబుల్స్ రెండో రౌండ్‌లో గాయత్రి-ట్రీసా జాలీ జోడీ 20-22, 14-21తో రుయి-సయాక (జపాన్) జంట చేతిలో ఓడింది. తరుణ్ మన్నేపల్లి 14-21, 16-21తో ఆంటోన్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడాడు. ఉన్నతి 14-21, 11-21తో చోచువాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలైంది. మాళవిక 12-21, 16-21తో ఇంటనాన్ (థాయ్‌లాండ్) చేతిలో, ఆకర్షి 9-21, 14-21తో థాయ్ సొత్‌పా కటేథాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యారు.

రన్నరప్ నిహాల్



అల్ ఐన్ (యూఏఈ): టాప్ సీడ్ గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరీన్ ఆసియా వ్యక్తిగత ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానంలో నిలిచాడు. గురువారం జరిగిన చివరి రౌండ్‌లో భారత జీఎం నిహాల్ ఇరాన్‌కు చెందిన బర్దియాను చిత్తు చేశాడు. తద్వారా సరీన్ వరుసగా నాలుగో విజయం నమోదు చేశాడు. బర్దియా, నిహాల్ చెరో ఏడు పాయింట్లతో సమంగా నిలిచినా..మెరుగైన టై బ్రేకర్ స్కోరుతో బర్దియా విజేతగా నిలిచాడు. ఈ టోర్నీలో ప్రదర్శనతో.. న్యూఢిల్లీలో జరిగే వరల్డ్ చెస్ కప్ బెర్త్‌ను నిహాల్ ఖరారు చేసుకున్నాడు.

తెలంగాణ 12, ఆంధ్రకు 18వ స్థానం

పట్నా: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. పన్నెండు రోజులుగా బిహార్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో మహారాష్ట్ర 58 స్వర్ణాలు సహా మొత్తం 158 పతకాలతో వరుసగా మూడోసారి ఓవరాల్ చాంపియన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. తెలంగాణ 9 స్వర్ణాలు సహా 23 పతకాలతో 12వ స్థానం, ఆంధ్ర 3 స్వర్ణాలు సహా 24 పతకాలతో 18వ స్థానంతో సరిపెట్టుకున్నాయి. హరియాణా 117 పతకాలతో ద్వితీయ స్థానం, రాజస్థాన్ 60 పతకాలతో తృతీయ స్థానాన్ని సాధించాయి.

ఇంగ్లండ్ క్రికెట్ సలహాదారు సౌథీ



లండన్: భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను పురస్కరించుకుని న్యూజిలాండ్ మాజీ పేసర్ టిమ్ సౌథీని ఇంగ్లండ్ జట్టు ప్రత్యేక నైపుణ్యాల సలహాదారుగా నియమించుకుంది. ఈమేరకు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు గురువారం ప్రకటించింది. లీడ్స్‌లో జూన్ 20నుంచి జరిగే తొలి టెస్ట్‌తో ఇంగ్లండ్ పర్యటనను భారత్ ప్రారంభించనుంది.



ప్లేఆఫ్స్‌కు సఫారీలు దూరం

బీసీసీఐ-సీఎస్ఏ మధ్య చర్చలు విఫలం

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు పెద్దపీట

న్యూఢిల్లీ: రేపటి నుంచి ఐపీఎల్ పునఃప్రారంభం కానుంది. అయితే మారిన షెడ్యూల్‌తో ప్లేఆఫ్స్ రేసులో ఉన్న ముంబై, గుజరాత్, పంజాబ్, ఢిల్లీ, బెంగళూరు జట్లపై గట్టి దెబ్బే పడనుంది. ఎందుకంటే ఈ టీమ్స్‌లో ఉన్న దక్షిణాఫ్రికా ఆటగాళ్లు లీగ్ దశకే పరిమితమై ప్లేఆఫ్స్‌కు దూరం కాబోతున్నారు. భారత్-పాకిస్థాన్ యుద్ధం కారణంగా లీగ్‌ను ఈనెల 9న వాయిదా వేయగా తిరిగి 17 నుంచి ఆరంభించనున్న విషయం తెలిసిందే. అయితే జూన్ 11 నుంచి ఆసీస్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ జరుగుతుంది. ప్రస్తుతం లీగ్‌లో ఆడుతున్న సఫారీ ప్లేయర్లలో ఎనిమిది మందికి ఈ ఫైనల్ జట్టులోనూ చోటు లభించింది. అంతేకాకుండా వీరిలో ఏడుగురు ప్లేఆఫ్స్ రేసులో ఉన్న జట్లతోనే ఉండడం గమనార్హం. గతంలో అనుకున్న షెడ్యూల్ ప్రకారం మే 25 వరకు మాత్రమే క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్ఏ) తమ ఆటగాళ్లకు ఎన్‌ఓసీ ఇచ్చింది. కానీ ఐపీఎల్ ఫైనల్ జూన్ 3కి మారడంతో ఇబ్బంది ఏర్పడింది. దీంతో వారి ఎన్‌ఓసీ పొడిగింపు కోసం బీసీసీఐ ప్రయత్నాలు చేసినా సీఎస్ఏ తోసిపుచ్చింది. ఈ నెల 26 వరకల్లా డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం ఆటగాళ్లు తిరిగి రావాలని సఫారీ జట్టు కోచ్ షుక్రి కాన్‌రాడ్ ఇదివరకే స్పష్టం చేశాడు. అయితే మిగతా సౌతాఫ్రికా ఆటగాళ్లకు ఎలాంటి ఇబ్బంది లేదు. మరోవైపు ఈ పరిణామాలు ముంబై ఇండియన్స్‌పై గట్టి ప్రభావం చూపనుంది. ఈ టీమ్‌లో కీలకంగా ఉన్న రికెల్టన్, బోష్ (దక్షిణాఫ్రికా)లతో పాటు ఇంగ్లండ్ ప్లేయర్ విల్ జాక్స్ కూడా విండీస్‌తో సిరీస్ కోసం వెళ్లనున్నాడు. అలాగే హాజెల్‌వుడ్ గాయంతో దూరం కానున్నాడని వార్తలు వెలువడినా త్వరలోనే తను ఆర్‌సీబీతో కలువనున్నట్టు సమాచారం. కాగా, ఎన్‌గిడి, రూథర్‌ఫోర్డ్ (విండీస్) కూడా లీగ్ దశ అయ్యాక వెనుదిరగనున్నారు. ఇదిలావుండగా ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఉన్నప్పటికీ ఐపీఎల్‌లో ఆడే వెస్టిండీస్ ఆటగాళ్లు మాత్రం పూర్తిగా అందుబాటులో ఉంటారని బీసీసీఐ తెలిపింది.

రేసులో ఎవరెవరు?

సీఎస్‌కే, రాజస్థాన్, సన్‌రైజర్స్ మినహా మిగిలిన ఏడు జట్లు కూడా సాంకేతికంగా ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసులో ఉన్నాయి. కానీ టాప్-4కు మెరుగైన అవకాశాలున్నాయి. ప్రస్తుతం పట్టికలో గుజరాత్, బెంగళూరు టాప్-2లో ఉండగా.. వీరికి మరో విజయం చాలు. ఒకవేళ మిగిలిన మూడు మ్యాచ్‌లను గెలిస్తే కచ్చితంగా టాప్-2లో ముగిస్తారు. అలాగే మూడో స్థానంలో ఉన్న పంజాబ్ కూడా ఓ విజయం దూరంలోనే ఉంది. 14 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్న ముంబై జట్టు డీసీ, పంజాబ్‌లపై కచ్చితంగా నెగ్గాల్సి ఉంటుంది. ఢిల్లీ క్యాపిటల్స్ మిగిలిన మూడింటిని గెలిచాక కూడా ఇతర ఫలితాల కోసం చూడాల్సిందే. ఇక ఎల్ఎస్‌జీ, కేకేఆర్ అన్ని మ్యాచ్‌లను గెలిచినా వారి ఖాతాలో 16, 15 పాయింట్లు మాత్రమే ఉంటాయి కాబట్టి ఆశలు వదులుకోవాల్సిందే.

ప్లేఆఫ్స్‌కు దూరమయ్యే సఫారీలు వీరే..

రబాడ (గుజరాత్), మార్‌క్రమ్ (లఖ్‌నవూ), జాన్సెన్ (పంజాబ్), స్టబ్స్ (ఢిల్లీ), ఎన్‌గిడి (బెంగళూరు), ముల్డర్ (సన్‌రైజర్స్), రికెల్టన్, బోష్ (ముంబై).



షఫాలీకి చోటు

అరుంధతి, శ్రీచరణి ఎంపిక

ఇంగ్లండ్‌లో భారత మహిళల టూర్





న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌లో ఆ జట్టుతో పరిమిత ఓవర్ల సిరీస్‌లో తలపడే భారత మహిళా జట్లను గురువారం ప్రకటించారు. ఈ పర్యటనలో భాగంగా భారత్-ఇంగ్లండ్ జట్లు ఐదు టీ20లు, మూడు వన్డేలలో తలపడనున్నాయి. వచ్చే నెల 28న ట్రెంట్‌బ్రిడ్జ్‌లో జరిగే మొదటి టీ20తో భారత్ పర్యటన ప్రారంభమవుతుంది. ఇక రెండు జట్లకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతీ మంధాన వైస్-కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఇక ఏడు మాసాల విరామం తర్వాత ఓపెనర్ షఫాలీ వర్మకు జాతీయ జట్టులో చోటు దక్కింది. ఫామ్ కోల్పోయిన షఫాలీ గతేడాది అక్టోబరు తర్వాత బెర్త్ టీమిండియాలో దక్కించుకోలేకపోయింది. కాగా రెండు జట్లలో తెలుగు క్రికెటర్లు అరుంధతి రెడ్డి, శ్రీచరణి ఎంపికయ్యారు. ఇటీవల శ్రీలంకలో జరిగిన ముక్కోణపు వన్డే టోర్నీ గెలిచిన భారత జట్టుకు అరుంధతి, శ్రీచరణి ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే.

ఇంగ్లండ్‌తో సిరీస్ షెడ్యూల్

- జూన్ 28 : తొలి టీ20, ట్రెంట్‌బ్రిడ్జ్
- జూలై 1 : రెండో టీ20, బ్రిస్టల్
- జూలై 4 : మూడో టీ20, కెన్నింగ్టన్ ఓవల్
- జూలై 9 : నాలుగో టీ20, ఓల్డ్‌ట్రాఫర్డ్
- జూలై 12 : ఐదో టీ20, ఎడ్జ్‌బాస్టన్
- జూలై 16 : మొదటి వన్డే, సౌతాంప్టన్
- జూలై 19 : రెండో వన్డే, లార్డ్స్
- జూలై 22 : మూడో వన్డే, చెస్టర్ లీ స్ట్రీట్.




మేం క్లోజ్‌ఫ్రెండ్స్ కాదు..

అర్షద్‌తో స్నేహంపై నీరజ్ చోప్రా

దోహా: పాకిస్థాన్‌కు చెందిన జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్‌తో తన స్నేహంపై భారత స్టార్ నీరజ్ చోప్రా వివరణ ఇచ్చాడు. అతడు తనకు ఎప్పుడూ సన్నిహిత మిత్రుడు కాదన్నాడు. బెంగళూరులో ఈనెల 24న తన పేరిట నిర్వహించాల్సిన జావెలిన్ త్రో పోటీకి అర్షద్ నదీమ్‌ను చోప్రా ఆహ్వానించాడు. అయితే పహల్గామ్ దాడి నేపథ్యంలో ఈ పోటీ రద్దయింది. అర్షద్‌ను భారత్‌కు ఆహ్వానించిన నీరజ్‌పై నెటిజన్లు విమర్శల దాడి చేశారు. 'నదీమ్‌తో నాకేమీ బలమైన బంధం లేదు. సన్నిహిత మిత్రత్వం అసలే లేదు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్త వాతావరణం దరిమిలా మా ఇద్దరి మధ్య బంధం గతంలో మాదిరిగా అసలే ఉండబోదు' అన్నాడు.

భారీగా పెరిగిన డబ్ల్యూటీసీ ప్రైజ్‌మనీ



విజేతకు రూ.30.78 కోట్లు

భారత్ ఖాతాలో రూ.12.31 కోట్లు

దుబాయ్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ప్రైజ్‌మనీని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) భారీగా పెంచింది. గత రెండు సీజన్ల వరకు ఇది కేవలం రూ.32.48 కోట్లు మాత్రమే ఉండగా.. తాజా 2023-25 డబ్ల్యూటీసీ సైకిల్‌లో ఈ మొత్తం రూ.49.27 కోట్లకు పెరగడం విశేషం. జూన్ 11 నుంచి లార్డ్స్‌లో దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ జరగనుంది. ఇందులో గెలిచిన జట్టుకు రూ.30.78 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. అదే గత రెండు పర్యాయాలు విజేతలకు రూ.13.67 కోట్ల చొప్పున మాత్రమే అందాయి. అలాగే ఈసారి రన్నరప్‌గా నిలిచిన జట్టుకే రూ.18.46 కోట్లు ఇవ్వనున్నారు. మూడో స్థానంలో నిలిచిన టీమిండియాకు రూ.12.31 కోట్లు దక్కుతాయి. అలాగే వరుసగా న్యూజిలాండ్‌కు రూ.10.26 కోట్లు, ఇంగ్లండ్‌కు రూ.8.2 కోట్లు, శ్రీలంకకు రూ.7.18 కోట్లు, బంగ్లాదేశ్‌కు రూ.6.15 కోట్లు, వెస్టిండీస్‌కు రూ.5.13 కోట్లు, పాకిస్థాన్‌కు రూ.4.10 కోట్లు అందనున్నాయి.

బట్లర్ స్థానంలో కుశాల్



ప్లేఆఫ్స్ రేసులో అందరికంటే ముందున్న గుజరాత్ టైటాన్స్‌కు స్టార్ ప్లేయర్ బట్లర్ దూరం కానున్నాడు. విండీస్‌తో సిరీస్ ఉండడంతో తను ఇంగ్లండ్ జట్టులో చేరనున్నాడు. దీంతో ఆ జట్టు చివరి లీగ్ మ్యాచ్ నుంచే దూరం కానుండగా.. అతడి స్థానంలో కుశాల్ మెండిస్‌ను తీసుకున్నారు. అలాగే పంజాబ్ పేసర్ ఫెర్గూసన్ స్థానంలో కైలీ జేమిసన్ ఆడనున్నాడు. ఇక లఖ్‌నవూ పేసర్ మయాంక్ గాయంతో సీజన్‌కు దూరమవడంతో విలియమ్ ఓరూర్కీని తీసుకున్నారు. కేకేఆర్ నుంచి ఆల్‌రౌండర్ మొయిన్ అలీతో పాటు పావెల్ (విండీస్), సీఎస్‌కే నుంచి సామ్ కర్రాన్, ఓవర్టన్ కూడా భారత్‌కు రావడం లేదు.

శ్రీహరి 86వ గ్రాండ్‌మాస్టర్



చెన్నై: తమిళనాడుకు చెందిన ఎల్. ఆర్.శ్రీహరి గ్రాండ్‌మాస్టర్ హోదా పొందిన 86వ భారత్ ఆటగాడిగా నిలిచాడు. గత ఏడాది మేలో జరిగిన దుబాయ్ ఓపెన్‌లో 2500 ఎలో రేటింగ్ సాధించిన 19 ఏళ్ల శ్రీహరి..అంతకుముందు బుడాపెస్ట్ టోర్నీలో తొలి జీఎం నార్మ్, తర్వాత ఖతార్ మాస్టర్స్ చాంపియన్‌షిప్‌లో రెండో జీఎం నార్మ్ సొంతం చేసుకున్నాడు. ఇక ప్రస్తుతం అబుధాబిలో జరుగుతున్న ఆసియా వ్యక్తిగత చెస్ టోర్నమెంట్‌లో అతడు తుది జీఎం నార్మ్ సాధించాడు. దాంతో శ్రీహరికి ప్రతిష్ఠాత్మక గ్రాండ్‌మాస్టర్ టైటిల్ లభించింది.



ప్రపంచ టాప్-50 బ్రాండ్లలో టీసీఎస్

రూ. 4.90 లక్షల కోట్లకు కంపెనీ బ్రాండ్ విలువ

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎయిర్‌టెల్, ఇన్ఫీకీ చోటు

న్యూఢిల్లీ: దేశీయ ఐటీ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్).. ప్రపంచంలోని అత్యంత విలువైన 50 కంపెనీల్లో ఒకటిగా నిలిచింది. 5,730 కోట్ల డాలర్ల (దాదాపు రూ.4.90 లక్షల కోట్లు) బ్రాండ్ విలువతో 45వ స్థానాన్ని దక్కించుకుంది. బ్రాండ్ల విలువను మదించే లండన్ కంపెనీ కాంటార్.. ఈ ఏడాదికి గాను ప్రపంచంలోని టాప్-100 బ్రాండ్ల జాబితాను గురువారం విడుదల చేసింది. గత ఏడాదితో పోలిస్తే టీసీఎస్ బ్రాండ్ విలువ 28 శాతం పెరిగిందని కాంటార్ తెలిపింది.

ఈ జాబితాలో భారత్‌కు చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ సైతం చోటు సాధించాయి. 4,495 కోట్ల డాలర్ల (రూ.3.84 లక్షల కోట్లు) బ్రాండ్ వాల్యూతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 56వ స్థానంలో నిలిచింది. ఎయిర్‌టెల్ 3,709 కోట్ల డాలర్ల (రూ.3.17 లక్షల కోట్లు) విలువతో 66వ స్థానంలో ఉంది. 3,309 కోట్ల డాలర్ల (రూ.2.83 లక్షల కోట్లు) బ్రాండ్ విలువతో ఇన్ఫోసిస్ 73వ స్థానంలో నిలిచింది.

వరల్డ్ నం.1 బ్రాండ్ యాపిల్

ఐఫోన్ల తయారీ దిగ్గజం యాపిల్ ప్రపంచంలోనే అత్యంత విలువైన బ్రాండ్‌గా తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. కాంటార్ నివేదిక ప్రకారం.. యాపిల్ బ్రాండ్ విలువ 1.3 లక్షల కోట్ల డాలర్లు. అంటే, మన కరెన్సీలో రూ.1.11 కోట్ల కోట్లు. గుగూల్ (94,413.7 కోట్ల డాలర్లు), మైక్రోసాఫ్ట్ (94,413 కోట్ల డాలర్లు) వరుసగా 2, 3వ అత్యంత విలువైన బ్రాండ్లుగా నిలిచాయి. అమెజాన్, ఎన్‌విడియా 4, 5వ స్థానాల్లో ఉన్నాయి.

ఎన్‌సీసీ లాభం రూ. 254 కోట్లు

ఒక్కో షేరుకు 110% డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌సీసీ లిమిటెడ్ 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.6.189.36 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.253.82 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మొత్తం ఆర్థిక సంవత్సరానికి కంపెనీ రూ.22,354.91 కోట్ల ఆదాయంపై రూ.819.88 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.2.20 (110 శాతం) డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. గడచిన ఆర్థిక సంవత్సరంలో కొత్తగా రూ.32,888 కోట్ల విలువైన ఆర్డర్లను చేజిక్కించుకోవటంతో ఆర్డర్ బుక్ రూ.71.568 కోట్లకు చేరుకుందని ఎన్‌సీసీ వెల్లడించింది.

- స్టింగ్ మెటావర్స్ లిమిటెడ్.. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.407.36 కోట్ల ఆదాయంపై రూ.35.25 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24తో పోల్చితే ఆదాయం (రూ.151.21 కోట్లు) 169.40 శాతం వృద్ధి చెందగా లాభం (రూ.10.82 కోట్లు) ఏకంగా 225.79 శాతం పెరిగింది. కాగా బ్లాక్‌చెయిన్ వాలిడేషన్ నోడ్స్ కోసం క్లౌడ్ డేటా సెంటర్లలో 5 కోట్ల డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ తెలిపింది.
- ఫిన్‌టెక్ సంస్థ జాగిల్.. మెష్ పేమెంట్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా మెష్ పేమెంట్స్ తన అంతర్జాతీయ కస్టమర్లకు జాగిల్‌కు చెందిన ప్రీపెయిడ్ కార్డులు, ఫారెక్స్ కార్డులు, క్రెడిట్ కార్డుల వంటి స్పెండ్ మేనేజ్‌మెంట్ సేవలను అందించనుంది. మెష్ పేమెంట్స్‌కు అంతర్జాతీయ ట్రావెల్, స్పెండ్ సొల్యూషన్స్ సేవల్లో మంచి పేరుంది. ఇప్పటికే ఈ కంపెనీ అమెరికా, యూరప్, లాటిన్ అమెరికాల్లోని భారత ఎంఎన్‌సీలకు సేవలందిస్తోంది.

మళ్లీ 25,000 పైకి నిఫ్టీ

సెన్సెక్స్ 1,200 పాయింట్లు అప్.. 82,500 ఎగువన ముగిసిన సూచీ



7 నెలల గరిష్ఠ స్థాయికి మార్కెట్

2 రోజుల్లో రూ.9 లక్షల కోట్ల వృద్ధి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, మదుపరులు ఒక్కసారిగా కొనుగోళ్లు పెంచడంతో భారీగా లాభపడ్డాయి. సెన్సెక్స్ 1,200.18 పాయింట్ల (1.48 శాతం) వృద్ధితో ఏడు నెలల గరిష్ఠ స్థాయి 82,530.74 వద్దకు చేరింది. నిఫ్టీ సైతం 395.20 పాయింట్లు (1.60 శాతం) పెరిగి 25,062.10 వద్దకు ఎగబాకింది. సూచీ మళ్లీ 25,000 పైకి చేరడం 7 నెలల (2024 అక్టోబరు 15) తర్వాత మళ్లీ ఇదే మొదటిసారి. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే దాదాపు అన్ని వస్తువులపై భారత్ సుంకాలను సున్నాకు తగ్గించనుందంటూ డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. దాంతో భారత్-అమెరికా మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరవచ్చన్న అంచనాలతో మార్కెట్లో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. సూచీలు లాభపడటం వరుసగా ఇది రెండో రోజు. ఈ రెండ్రోజుల్లో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9.08 లక్షల కోట్లు పెరుగుదలతో రూ.440.19 లక్షల కోట్లకు (5.14 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

- బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.94 శాతం వరకు వృద్ధి చెందగా.. రంగాల వారీ సూచీలన్నీ పాజిటివ్‌గా ముగిశాయి. రియల్టీ, ఆటో, సర్వీసెస్, ఇండస్ట్రియల్స్, మెటల్, కన్స్యూమర్ డిస్క్రెషనరీ, కమోడిటీస్ సూచీలు 1.87 శాతం వరకు పెరిగాయి.
- విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.5,393 కోట్ల నికర కొనుగోళ్లు జరపగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) నికరంగా రూ.1,668 కోట్ల షేర్లను విక్రయించారు.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 22 పైసలు క్షీణించి రూ.85.54 వద్ద ముగిసింది. దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం రూపీపై ఒత్తిడి పెంచింది.
- అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 3.65 శాతం తగ్గి 63.68 డాలర్లకు దిగివచ్చింది.
- ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,800 తగ్గి రూ.95,050కి దిగిరాగా.. వెండి సైతం వరుసగా నాలుగో రోజూ తగ్గుముఖం పట్టింది. కిలో వెండి రూ.1,000 తగ్గి రూ.97,000కు జారుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 0.53 శాతం తగ్గి 3,160 డాలర్లకు జారుకోగా.. సిల్వర్ 32.29 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

5 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు

ఏప్రిల్‌లో రూ.2.26 లక్షల కోట్లు

ఎగుమతుల్లో 9 శాతం వృద్ధి

19 శాతం ఎగబాకిన దిగుమతులు

న్యూఢిల్లీ: భారత విదేశీ వాణిజ్య లోటు 5 నెలల గరిష్ఠ స్థాయికి పెరిగింది. గత నెలలో 2,642 కోట్ల డాలర్లకు (రూ.2.26 లక్షల కోట్లు) చేరింది. ట్రంప్ సుంకాల పెంపు నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్యం, వస్తు సరఫరాను తలకిందులు చేయడం ఇందుకు ప్రధాన కారణం. ఈ ఫిబ్రవరిలో వాణిజ్య లోటు మూడేళ్ల కనిష్ఠ స్థాయి 1,405 కోట్ల డాలర్లకు తగ్గగా.. మార్చిలో 2,154 కోట్ల డాలర్లకు పెరిగింది. ఏప్రిల్‌లో మరింత ఎగబాకింది. గత నెలలో భారత వస్తు ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 9.03 శాతం వృద్ధితో ఆరు నెలల గరిష్ఠ స్థాయి 3,849 కోట్ల డాలర్లకు (రూ.3.29 లక్షల కోట్లు) పెరిగాయి. కానీ, అదే సమయంలో దిగుమతులు కూడా 19.12% పెరిగి 6,491 కోట్ల డాలర్లకు (రూ.5.55 లక్షల కోట్లు) ఎగబాకాయి. దాంతో వాణిజ్య లోటు (ఎగుమతుల ఆదాయం, దిగుమతుల వ్యయం మధ్య అంతరం) 2,642 కోట్ల డాలర్లుగా నమోదైంది. ముడిచమురు, ఎరువుల డిమాండ్ ఎగబాకడం దిగుమతుల పెరుగుదలకు కారణమయ్యాయి.

సేవల్లో రూ.1.52 లక్షల కోట్ల మిగులు వాణిజ్యం: గత నెలలో సేవల ఎగుమతులు 3,531 కోట్ల డాలర్లు (రూ.3.02 లక్షల కోట్లు)గా, దిగుమతులు 1,754 కోట్ల డాలర్లు (రూ.1.50 లక్షల కోట్లు)గా నమోదయ్యాయి. దాంతో వాణిజ్య మిగులు 1,777 కోట్ల డాలర్లకు (రూ.1.52 లక్షల కోట్లు) పెరిగింది.

కాలుష్యరహితంగా సిమెంట్ ఉత్పత్తి

2060 నాటికే 'నెట్ జీరో' స్థాయికి.. అంబుజా సిమెంట్స్ ఎండీ అజయ్ కపూర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పర్యావరణానికి హాని కలగని రీతిలో సిమెంట్ ఉత్పత్తి చేయడంలో భారత సిమెంట్ పరిశ్రమ ప్రపంచంలో అగ్రస్థానంలో ఉందని అదానీ గ్రూప్ కంపెనీ అంబుజా సిమెంట్ ఎండీ, గ్రీన్ సిమెంటెక్, 2025 సదస్సు చైర్మన్ అజయ్ కపూర్ చెప్పారు. ఈ విషయంలో అమెరికా, యూరప్ దేశాలు కూడా మనకు సాటి రావన్నారు. గ్రీన్ సిమెంటెక్-2025 సదస్సు సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం 2070 కంటే పదేళ్ల ముందే భారత సిమెంట్ పరిశ్రమ జీరో కాలుష్య (నెట్ జీరో) స్థాయికి చేరుకుంటుందన్నారు. ఉత్పత్తిలో వెలువడే వేడిని సైతం ఇంధనంగా మార్చుకోవడం ద్వారా సిమెంట్ కంపెనీలు తమ ఇంధన అవసరాల్లో 40% తీర్చుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. పరిశ్రమ తీసుకున్న చర్యలతో ప్రస్తుతం ఒక టన్ను సిమెంట్ ఉత్పత్తితో వెలువడే కార్బన్ డయాక్సైడ్‌ను 800 కిలోలకు పరిమితం చేసినట్టు సాగర్ సిమెంట్స్ జేఎండీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

ఎస్‌బీఐ కార్డ్, అపోలో ఫార్మసీ నుంచి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో ఫార్మసీని నిర్వహిస్తున్న అపోలో హెల్త్ కంపెనీతో కలిసి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డును తీసుకువచ్చినట్లు ఎస్‌బీఐ కార్డ్ ప్రకటించింది ఆరోగ్యం, వెల్‌నెస్‌పై దృష్టి పెట్టే విధంగా అపోలో ఎస్‌బీఐ కార్డ్ సెలెక్ట్ పేరుతో దీన్ని తీసుకువచ్చినట్లు ఎస్‌బీఐ కార్డ్ తెలిపింది అపోలో ఎస్‌బీఐ కార్డ్ సెలెక్ట్ వినియోగదారులు.. అపోలో 24/7 యాప్, అపోలో ఫార్మసీ స్టోర్ల ద్వారా ఔషధాల కొనుగోలు, హెల్త్ చెకప్ ప్యాకేజీలు, రక్త పరీక్షలు సహా ఇతరత్రా కొనుగోళ్లపై రివార్డు పాయింట్లు అందుకుంటారని పేర్కొంది. అంతేకాకుండా యాప్‌తో పాటు ఎంపిక చేసిన ఫార్మసీ స్టోర్లలో కొనుగోళ్లపై 25 శాతం వరకు క్యాష్‌బ్యాక్‌ను ఆఫర్ చేస్తున్నట్లు ఎస్‌బీఐ కార్డ్ తెలిపింది.

బిజినెస్

విశాఖలో ఐటీసీ కొత్త స్టార్ హోటల్

రూ.328 కోట్ల పెట్టుబడి. 2029 నాటికి పూర్తి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో సొంత స్టార్ హోటల్ నిర్మాణానికి ఐటీసీ హోటల్స్ సిద్ధమైంది. రూ.328 కోట్ల పెట్టుబడితో 200 రూమ్స్‌తో నిర్మించే ఈ హోటల్‌ను 2029 నాటికి పూర్తి చేయనుంది. ఐటీసీ హోటల్స్ ఇప్పటికే వైజాగ్‌లో 'వెల్‌కం దేవీ గ్రాండ్ బే, ఫార్చ్యూన్ ఇన్ శ్రీకన్య' పేరుతో రెండు స్టార్ హోటల్స్‌ను తన అనుబంధ సంస్థల ద్వారా లీజు పద్ధతిలో నిర్వహిస్తోంది. ఇందులో 'వెల్‌కం దేవీ గ్రాండ్ బే' హోటల్‌లో 104 రూమ్స్, 'ఫార్చ్యూన్ ఇన్ శ్రీకన్య' హోటల్‌లో 68 రూమ్స్ ఉన్నాయి. కాగా మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో కంపెనీ రూ.1,060.62 కోట్ల ఆదాయంపై రూ.257.85 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.

ఐకేఎఫ్ ఫైనాన్స్ రూ.1,465 కోట్ల సమీకరణ


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఐకేఎఫ్ ఫైనాన్స్ ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.1,465 కోట్లు సమీకరించింది. నార్వెస్ట్ వెంచర్ పార్ట్‌నర్స్‌తో పాటు మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్ నుంచి ఈ పెట్టుబడులు సమీకరించినట్టు కంపెనీ తెలిపింది. ఇందులో 10 కోట్ల డాలర్లకుపైగా (సుమారు రూ.855 కోట్లు) పెట్టుబడులు నార్వెస్ట్ నుంచి సమకూరాయి. మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్ ఇప్పటికే ఉన్న వాటాలకు తోడు అదనంగా మరిన్ని వాటాలు కొనుగోలు చేసింది. ఐకేఎఫ్ ఫైనాన్స్. వాహన, ఎంఎస్ఎంఈ, గృహ రుణాలు అందిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	515
చిత్తూరు	603	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	124
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	110
కర్నూలు	120	నెల్లూరు	115
విశాఖపట్నం	121	అనంతపురం	115
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	93,930 ▼	86,100 ▼	1.08,000 ▼
విజయవాడ	95,500 ▼	90,000 ▼	96,200 ▼
విశాఖపట్నం	95,940 ▼	86,100 ▼	1.08,000 ▼
రాజమండ్రి	93,930 ▼	86,100 ▼	98,400 ▼
ప్రొద్దుటూరు	94,100 ▼	86,570 ▼	97,100 ▼
ముంబై	92,365 ▼	84,606 ▼	94,572 ▼



గోసంరక్షణకు 'ఆర్‌సీ ప్లాస్టో' సాయం

- గో విజ్ఞాన్ అనుసంధాన కేంద్రానికి అత్యాధునిక వెటర్నరీ అంబులెన్స్ విరాళం

నాగ్‌పూర్, మే 15 : నీటి నిర్వహణ, నిల్వకు సంబంధించిన పరికరాల తయారీలో పేరొందిన సంస్థ ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్.. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద గోవుల సంరక్షణ కోసం నిధులు కేటాయించింది. నాగ్‌పూర్ జిల్లా దేవలాపర్‌లో ఉన్న గో విజ్ఞాన్ అనుసంధాన కేంద్రానికి అత్యాధునిక వెటర్నరీ అంబులెన్స్‌ను విరాళంగా ఇచ్చింది. అంబులెన్స్ సమకూర్చుకునేందుకుగాను రూ.17 లక్షల చెక్కును గో విజ్ఞాన్ అనుసంధాన కేంద్రం అధ్యక్షుడు పద్మేశ్ గుప్తాకు ఆర్‌సీ ప్లాస్టో డైరెక్టర్ నీలేశ్ అగర్వాల్ అందజేశారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన, ఇతర కారణాల వల్ల జబ్బుపడిన ఆవులకు అవసరమైన వైద్య సాయం సకాలంలో అందించేందుకు ఈ అత్యాధునిక అంబులెన్స్ ఎంతో ఉపయోగపడనుంది. వైద్య పరికరాలు, మందులు, ఆక్సిజన్ సిలిండర్‌తోపాటు గాయపడిన ఆవులను సులువుగా తరలించేందుకు అవసరమైన సదుపాయాలు ఈ అంబులెన్స్‌లో ఉంటాయి.

టీటీడీ ట్రస్టులకు రూ.1.40 కోట్ల వితరణ



టీటీడీ ఛైర్మన్‌కు డీడీలను అందజేస్తున్న ఆనంద్‌మోహన్

తిరుమల, మే 15(ఆంధ్రజ్యోతి): టీటీడీలోని వివిధ ట్రస్టులకు గురువారం రూ.1.40 కోట్లు విరాళంగా అందాయి. అమెరికాలోని బోస్టన్‌లో నివాసముంటున్న భాగవతుల ఆనంద్ మోహన్ ఈ విరాళాన్ని అందజేశారు. విరాళం డీడీలను తిరుమలలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు అందజేశారు. రూ.కోటి ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు, గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు, విద్యాదాన ట్రస్టుకు రూ.10 లక్షలు, వేదపరిరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు, సర్వశ్రేయాస్ ట్రస్టుకు రూ.10 లక్షల చొప్పున వినియోగించాలని దాత కోరారు. ఈ సందర్భంగా దాతను ఛైర్మన్ అభినందించారు.

తెలుగు మీడియంను పునరుద్ధరించాలి

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రద్దు చేసిన తెలుగు మీడియంను ప్రాథమిక స్థాయిలో పునరుద్ధరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ వేర్వేరు ప్రకటనల్లో కోరారు. తెలుగు మీడియం లేకపోతే డ్రాపౌట్లు పెరిగే పరిస్థితి వస్తుందన్నారు.

రాష్ట్రంలో పరిశ్రమల జోరు

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదించారు. ఈ పెట్టుబడులు వాస్తవ రూపం దాలిస్తే 35,371 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. తయారీ, పర్యాటకం, ఇంధనం రంగాల్లో 19 పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. గడచిన ఐదేళ్లా జగన్ ప్రభుత్వంలో పరిశ్రమల స్థాపనకు వెనకడుగు వేసిన పారిశ్రామికవేత్తలు.. కూటమి అధికారంలోకి వచ్చాక పెట్టుబడులు పెడతామంటూ ప్రతిపాదనలు చేస్తున్నారు. తాజా ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదించిన పెట్టుబడుల ప్రతిపాదనల వివరాలు...

భారీ పరిశ్రమలు

అగ్రి కెమికల్స్, ఫైన్ అండ్ స్పెషాలిటీ కెమికల్స్ తయారీ పరిశ్రమకు గ్రీన్‌ఫీల్డ్ సదుపాయం కల్పించడం కోసం డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు 7,608 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కోసం డెక్కన్ ఫైన్ కెమికల్స్ రూ.2,560 కోట్లు పెట్టుబడి పెడుతుంది. 1800 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.

- భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్‌ను స్థాపించేందుకు ఆమోదం తెలిపారు. బీఈఎల్ రూ.1400 కోట్ల పెట్టుబడి పెడుతుంది. 800 మందికి ఉద్యోగాలు దక్కుతాయి.
- ఓర్వకల్లులో పీయూఆర్ ఎనర్జీ రూ.1200 కోట్ల పెట్టుబడితో 1200 మందికి ఉపాధి కల్పించేలా ఎలక్ట్రిక్ వెహికల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు. ఈ ప్లాంటు కోసం ఓర్వకల్లులో టైలర్‌మేడ్ ఇన్సెంటివ్ విధానం అమలుచేస్తూ 115 ఎకరాలుకేటాయించారు.
- బ్లూజెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ ఇంటర్మీడియట్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ సెంటర్‌ను స్థాపించేందుకు ప్రతిపాదించింది. ఇందుకోసం రాయితీతో 125.12 ఎకరాల భూమిని కేటాయించాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టులో రూ.1,750 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు, 1750 మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు సంస్థ ముందుకొచ్చింది.
- జూపిటర్ రెన్యువబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.2,700 కోట్ల పెట్టుబడితో 2,216 మందికి ఉపాధిని కల్పించేలా 4.8 మెగావాట్ల సోలార్ సెల్, 1.5 మెగావాట్ల మాడ్యూల్స్ తయారీ చేస్తామని ప్రతిపాదించింది. ఏపీఐడీపీ విధానం మేరకు ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూమిని కేటాయించేందుకు ఆమోదించారు.
- వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,061 కోట్లతో 10,098 మందికి ఉద్యోగాల కల్పనకు ప్రతిపాదనలు పంపింది. ఈ సంస్థకు తిరుపతిలోని ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్-2లో కేటాయించిన 75 ఎకరాలకు సేల్ డీడ్‌కు అవకాశం కల్పిస్తూ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది.
- మెస్సర్స్ బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో రూ.9,000 కోట్ల పెట్టుబడితో 3,900 మందికి ఉద్యోగాలు కల్పించే 2000 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు.
- డైకిన్ ఎయిర్ కండీషనింగ్ ఇండియా లిమిటెడ్ తిరుపతి శ్రీసిటీలో రూ.2,475 కోట్ల పెట్టుబడితో 5,150 మందికి ఉద్యోగాలు కల్పించేలా ఎయిర్ కండీషనర్స్, కాంపొనెంట్‌లు తయారీ పరిశ్రమను స్థాపించేందుకు ఆమోదం తెలిపారు.

ఇతర పరిశ్రమలు

- నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏలూరు) రూ.150 కోట్లతో 500 మందికి ఉపాధి కల్పిస్తూ రోజుకు ఇరవై టన్నుల ఉత్పత్తితో కంప్రెష్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు.
- తిరుపతిలో బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్‌పీ రూ.150 కోట్ల పెట్టుబడితో 350 మందికి ఉపాధి కల్పించేందుకు ప్రతిపాదనలు పంపింది. ఈ సంస్థకు తిరుపతి ఎస్వీపురంలో 5-స్టార్ రిసార్ట్స్ నిర్మించేందుకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది.
- తిరుపతిలోని సరస్వతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.327 కోట్ల పెట్టుబడితో 570 మందికి ఉద్యోగాలు కల్పించేలా 3 స్టార్, 5 స్టార్ హోటల్ క్లస్టర్‌కు అంగీకారం తెలిపారు.

కీలక ప్రతిపాదనలకు ఆమోదం

- సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో రూ.2,920 కోట్లతో 230 మందికి ఉపాధి కల్పించేలా 300 మెగావాట్ల విండ్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఈ ప్లాంట్‌ను ఎకోరన్‌కు బదలాయించేందుకు ఆమోదం తెలిపారు.
- కడపలో అంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.3,941 కోట్ల పెట్టుబడితో 260 మందికి ఉద్యోగాలు కల్పించేలా స్థాపించిన 260 మెగావాట్ల విండ్ సోలార్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టు బదలాయింపునకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది.
- మెస్సర్స్ సెన్సోరెమ్ ఫొటోనిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (క్రియేటివ్ సెన్సార్స్) రూ.1,057 కోట్లతో 622 మందికి ఉద్యోగాలు కల్పించేలా ప్రతిపాదించిన ప్రాజెక్టుకు 2024-29 పాలసీ ప్రకారం టైలర్‌మేడ్ ఇన్సెంటివ్‌లను ఇస్తామంటూ ప్రభుత్వం మంజూరు లేఖ ఇచ్చేందుకు ఎస్ఐపీబీ అంగీకరించింది.

ప్రోత్సాహకాల పొడిగింపు

- మోహన్ స్పిన్‌టెక్స్ ఇండియా లిమిటెడ్ రూ.482 కోట్ల పెట్టుబడితో 3,575 మందికి ఉద్యోగాలను కల్పించింది. ఈ సంస్థకు ప్రోత్సాహకాలను మరో మూడేళ్లు పొడిగిస్తూ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది.
- ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,779 కోట్ల పెట్టుబడితో 600 మందికి ఉద్యోగాలను కల్పించింది. ఈ సంస్థకు ప్రోత్సాహకాల గడువును పెంచేందుకు ఎస్ఐపీబీ ఆమోదించింది.

పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ

- 2014-19 తరహాలో నోడల్ అధికారులు
- ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్న పారిశ్రామికవేత్తలకు పెద్దపీట వేసేలా, ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా డ్యాష్‌బోర్డు ద్వారా నిరంతర పర్యవేక్షణ అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఎస్ఐపీబీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒప్పందాలు చేసుకున్న సంస్థల పనుల పురోగతిపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకూ జరిగిన ఆరు ఎస్ఐపీబీ సమావేశాల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులు, 4,50,934 మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేయడంపై సంతృప్తి వ్యక్తంచేశారు. పారిశ్రామిక సంస్థల శంకుస్థాపన నుంచి ఉత్పత్తి చేపట్టే దాకా నిరంతరం పరిశీలన చేసే బాధ్యత అధికారులు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం 2014-19 తరహాలో నోడల్ అధికారులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి సంస్థ ఎంత పెట్టుబడులు పెడుతుంది.. ఎంత మందికి ఉద్యోగాలు ఇస్తుంది.. వంటి విషయాలను ఒక పోర్టల్ ద్వారా రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రపంచ శ్రేణి దిగ్గజ సంస్థలకు ప్రోత్సాహకాలు ఇవ్వడంపై రాజకీయంగా చేస్తున్న విమర్శలను సమర్థంగా తిప్పికొట్టాలని అన్నారు. ఇలాంటి వాటిని మొగ్గలోనే తుంచివేయకపోతే పారిశ్రామికవేత్తలు మనోనిబ్బరం కోల్పోయే ప్రమాదం ఉందని సీఎం హెచ్చరించారు. కొత్త పరిశ్రమలను ప్రోత్సహించడంతో పాటు ఉన్న పరిశ్రమలు ఖాయిలా పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. గుంటూరు జిల్లాలో టెక్స్‌టైల్ పరిశ్రమను ఆదుకోవాలని చంద్రబాబు సూచించారు. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కింజరాపు అచ్చెన్నాయుడు, కందుల దుర్గేశ్, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ హాజరయ్యారు.

టూరిజం ప్రాజెక్టులపై సమీక్ష

టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుపైనా సీఎం సమీక్షించారు. టూరిజం సెక్టారులో హోటళ్లు, గదుల కొరత చాలా ఉందని అన్నారు. 50,000 హోటల్ రూమ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకోవాలని పర్యాటక శాఖను సీఎం ఆదేశించారు. హోటళ్లు అందుబాటులోకి వస్తే ఆయా ప్రాంతాల్లో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. కారవాన్స్‌కు సంబంధించిన పాలసీని కూడా ప్రత్యేకంగా తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో రద్దీగా ఉండే 21 దేవాలయాల్లో వసతి సౌకర్యం పెంచే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి నదుల వద్ద నిర్వహిస్తున్న హారతుల కార్యక్రమం ద్వారా ఆధ్యాత్మిక శోభ పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు.



వీరయ్యచౌదరి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రులు లోకేశ్, స్వామి, ఎమ్మెల్యే విజయకుమార్

పార్టీ అండగా ఉంటుంది

- వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించిన లోకేశ్

ఒంగోలు, మే 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల దారుణ హత్యకు గురైన టీడీపీ నేత ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబాన్ని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ గురువారం పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉదయం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం చదలవాడ చేరుకున్న లోకేశ్.. అక్కడి నుంచి రోడ్డు మార్గాన వీరయ్య స్వగ్రామం అమ్మనబ్రోలు వెళ్లారు. వీరయ్యకు నివాళులర్పించి, ఆయన భార్య, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. 'వీరయ్య దారుణ హత్య తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. హత్యకు పాల్పడిన వారిని పోలీసులు అరెస్టు చేసి, లోతుగా దర్యాప్తు చేస్తున్నారు' అని చెప్పిన లోకేశ్.. యువగళంలో తనతోపాటు కలిసి వీరయ్య నడిచారని గుర్తుచేసుకున్నారు. కాగా లోకేశ్ రాక నేపథ్యంలో టీడీపీ శ్రేణులు, వీరయ్య అభిమానులు భారీగా తరలివచ్చారు. వీరయ్య హత్యలో అసలు దోషులు తప్పించుకున్నారని, వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

ఈసెట్‌లో 93.26 శాతం అర్హత

- కృష్ణాలో అత్యధికం.. విజయనగరం అత్యల్పం

అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా, బీఎస్సీ(గణితం) విద్యార్థులు ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లు పొందేందుకు నిర్వహించిన ఏపీఈసెట్ ఫలితాలను జేఎన్‌టీయూ-అనంతపురం గురువారం విడుదల చేసింది. ఈసెట్‌కు 35,187 మంది దరఖాస్తు చేసుకోగా 34,228 మంది పరీక్ష రాశారు. వారిలో 31,922 (93.26శాతం) మంది అర్హత సాధించారు. ఫలితాలను ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్, మనమిత్ర వాట్సాప్ నంబరు 9552300009 ద్వారా విద్యార్థులు పొందే అవకాశం కల్పించారు. కృష్ణా జిల్లాలో అత్యధికంగా 95.8శాతం మంది అర్హత సాధించగా, విజయనగరం జిల్లాలో అత్యల్పంగా 89.34శాతం అర్హత సాధించారు.

డీఎస్సీకి 5.67 లక్షల దరఖాస్తులు.. ముగిసిన గడువు

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ దరఖాస్తు గడువు ముగిసింది. గురువారం రాత్రి 8 గంటల వరకు 5,67,067 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 3,53,598 మంది అభ్యర్థులు డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్నారు. ఒక అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడం వల్ల సంఖ్య పెరిగింది. చివరి రోజైన గురువారం రాత్రి 8 గంటల వరకు 12,173 దరఖాస్తులు రాగా, అర్ధరాత్రి 12గంటల వరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగింది.

జీవో 21లోనూ అసంబద్ధ నిర్ణయాలు

- ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం

జీవో 117కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన జీవో 21లోనూ అనేక అసంబద్ధ నిర్ణయాలున్నాయని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫౌండేషనల్ పాఠశాలలో 1:20 నిష్పత్తి పాటించాలని, లేనిపక్షంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఇంకా పెరుగుతాయని అభిప్రాయపడ్డారు.



నెల్లూరు రూరల్‌లో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ, పక్కన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ స్రవంతి తదితరులు

రూ.8,500 కోట్లతో ఇంటింటికీ కుళాయి

- నెల్లూరులో అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి నారాయణ

నెల్లూరురూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): అమృత్ పథకం ద్వారా రూ.8,500 కోట్ల ఖర్చు చేసి రాష్ట్రంలో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి అందించనున్నట్లు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. గురువారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ. 41 కోట్లతో 60 రోజుల్లో నిర్మించిన 339 అభివృద్ధి పనులను ఏకకాలంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం, మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధితో రాష్ట్రానికి పరిశ్రమలు విరివిగా వస్తున్నాయని, ఫలితంగా యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. త్వరలో సీఎఫ్ఎంఎస్‌లో గ్రీన్ చానల్ ద్వారా మున్సిపాలిటీల్లోని నిధులు ఎక్కడికక్కడే ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ స్రవంతి, నాయకులు గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ పాల్గొన్నారు.

సీసీటీఎన్ఎస్ నిర్వహణకు రూ.12 కోట్లు

- గత ప్రభుత్వంలో ఆగిపోయిన విధానానికి ఊపిరి

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో తిరోగమనంలో పయనించిన క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్(సీసీటీఎన్ఎస్)కు కూటమి ప్రభుత్వం ఊపిరిలూదింది. ఆన్‌లైన్ బిల్లులు చెల్లించలేక మాన్యువల్ ఎఫ్ఐఆర్ దిశగా వెళ్లిన సీసీటీఎన్ఎస్‌కు రూ.12 కోట్లు విడుదల చేసి పూర్వ వైభవం తీసుకొచ్చింది. దేశంలో ఎక్కడైనా బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆన్‌లైన్‌లో పొందు పరిచే విధానం ఉమ్మడి రాష్ట్రంలోనే అమల్లోకి వచ్చింది. ఫలితంగా బాధితులు తమ కేసు స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు నిందితుల వివరాలు ప్రతి పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు తెలిసే విధంగా ఉండేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వహణ భారమంటూ బిల్లులు చెల్లించక పోవడంతో సీసీటీఎన్ఎస్ అటకెక్కింది. దీంతో చేతి రాతతో మాన్యువల్‌గా నమోదు చేసే ఎఫ్ఐఆర్ వల్ల పొరుగు జిల్లాలో నేరం చేసిన వ్యక్తి గురించి ఆ పక్క జిల్లా పోలీసులకు తెలిసేది కాదు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు సీసీటీఎన్ఎస్ పునరుద్ధరించేందుకు నిధులు విడుదల చేస్తూ గురువారం జీవో జారీ చేసింది.

భూ వివాద్ నుంచి భూ విశ్వాస్ వైపు సాగాలి

- భూమికి స్పష్టమైన టైటిల్ తప్పనిసరి కావాలి
- రాజకీయ సంకల్ప లోపంతో డిజిటలైజేషన్‌కు గ్రహణం
- జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి పెమ్మసాని



గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): భారత్‌లో భూమి రికార్డుల డిజిటలైజేషన్ జరగకపోవడానికి రాజకీయ సంకల్ప శక్తి లోపమే ప్రధాన కారణమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మన వద్ద మేధావులకు, టెక్నాలజీకి కొదవ లేనప్పటికీ.. భూ రికార్డుల డిజిటలైజేషన్‌లో వెనకబడి ఉన్నామని వ్యాఖ్యానించారు. మన ప్రయాణం భూ వివాద్ నుంచి భూ విశ్వాస్ వైపు సాగాలని, భూమికి స్పష్టమైన టైటిల్ తప్పనిసరి కావాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గుంటూరులో డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడర్నైజేషన్ ప్రోగ్రామ్ (డీఐఎల్ఆర్ఎంపీ) కింద సర్వే/రీసర్వేపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. తొలి రోజు కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, డీవోఎల్ఆర్ జాయింట్ సెక్రెటరీ కునాల్ సత్యార్థి, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.జయలక్ష్మి, డీవోఎల్ఆర్ సెక్రెటరీ మనోజ్ జోషి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. భూమి రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తిగా రాష్ట్రాలదే అయినప్పటికీ ఈ పని చేస్తే రూ.కోట్లలో ప్రోత్సాహకాలిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా నేటికీ చాలా రాష్ట్రాలు అడుగులు ముందుకు వేయడం లేదన్నారు. ఏపీతోపాటు గుజరాత్‌లో భూముల రీసర్వే ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. '2000లో నేను అమెరికాకు వెళ్లాను. 2005లో స్థిరాస్తి కొనుగోలు చేసే ఆర్థిక శక్తి కలిగింది. రిజిస్ట్రేషన్ రోజున టైటిల్ కంపెనీ, ప్రభుత్వ అధికారి, రియల్టర్ ఇంటికే వచ్చి 10 పేపర్లపై సంతకాలు పెట్టించుకొని చెక్కు ఇవ్వమన్నారు. చెక్కు ఇచ్చిన వెంటనే ఇంటి తాళాలు చేతికిచ్చారు. దాంతో రిజిస్ట్రేషన్ అయిపోయింది' అని వివరించారు. కాగా ఏపీలో 90 శాతం ఆర్‌వోఆర్ పూర్తయిందని, సర్వే, రీసర్వే కొంత పెండింగ్ ఉందని చెప్పారు. భూ రికార్డుల డిజిటలైజేషన్ పూర్తయితే బ్యాంకులు సులభతరంగా రుణాలు ఇస్తాయని, పెట్టుబడిదారులు వ్యాపారాలు పెట్టేందుకు ముందుకొస్తారని, రైతుకు అన్ని విధాలుగా మద్దతు చేకూరుతుందని అన్నారు.

వైసీపీ హయాంలో రీసర్వే అస్తవ్యస్తం: అనగాని

గత వైసీపీ ప్రభుత్వం భూముల రీసర్వేని అస్తవ్యస్తం చేసిందని రెవెన్యూ మంత్రి అనగాని అన్నారు. తక్కువ సమయంలోనే 6,688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసిందని, భూ యజమానులు అభ్యంతరాలు చెప్పుకొనేందుకు సరైన అవకాశం కూడా ఇవ్వలేదని చెప్పారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో 2.80 లక్షల ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరించామన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డీఐఎల్ఆర్ఎంపీ పూర్తి చేస్తున్నామని, తమకు ప్రోత్సాహకంగా రూ.400 కోట్లు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

పీఎం సహాయనిధికి 'తిరుమల గుబ్బా సత్రం' రూ.కోటి విరాళం

అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికుల కోసం తిరుమల గుబ్బా సత్రం రూ.కోటి విరాళం ప్రకటించింది. ఈ మేరకు ప్రధానమంత్రి సహాయనిధికి అందజేయాలని రూ.కోటి చెక్కును వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం విజయవాడలో అందజేశారు. యుద్ధంలో ఎందరో సైనికులు అమరులయ్యారని, వారి పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ఈ విరాళం అందజేస్తున్నట్లు సత్రం ధర్మకర్తలు చెక్కా నాగకుమార్, శ్రీహరి, దారా సంతోష్‌కుమార్, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

దక్షిణాసియా దేశాలపై ట్రంప్ పెత్తనమేంటి?: డీ రాజా

తిరుపతి, మే 15(ఆంధ్రజ్యోతి): 'దక్షిణ ఆసియా దేశాలపై ట్రంప్ పెత్తనమేంటి? ఆయనకు భారత ప్రధాని తలొగ్గి వ్యవహరించడం ఏమిటి?' అని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రశ్నించారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఉగ్రవాదాన్ని సమూలంగా రూపుమాపేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ట్రంప్ మాటకు భారత ప్రధాని కట్టుబడి వ్యవహరించడం అత్యంత బాధాకరం. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం వెనుక అంశాలపై ప్రజల నుంచి అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్న వేళ ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలి.' అని రాజా కోరారు.

'జర్నలిస్టుల అక్రిడిటేషన్ల'పై మంత్రివర్గ ఉపసంఘం

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీకి అవసరమైన మార్గదర్శకాలు రూపొందించేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. మంత్రులు కొలుసు పార్థసారథి, కందుల దుర్గేష్, పయ్యావుల కేశవ్ ఇందులో సభ్యులుగా ఉన్నారు.

దేశ ప్రయోజనాలు అమెరికాకు తాకట్టు

- 20 నుంచి సమైక్యతా యాత్రలు: సీపీఎం

విశాఖపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా దేశ సార్వభౌమత్వాన్ని బీజేపీ ప్రభుత్వం అమెరికాకు తాకట్టు పెట్టిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. విశాఖలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత దేశాన్ని మోదీ నడుపుతున్నారా? ట్రంప్ నడుపుతున్నారా? అని ప్రజల్లో చర్చ జరుగుతోందన్నారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటం గురించి ప్రజలకు వాస్తవాలను చెప్పడం ద్వారా వారిని సమాయత్తం చేయడమే లక్ష్యంగా ఈ నెల 20 నుంచి పది రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా సమైక్యతా యాత్రలు, సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

ఏపీ ఫిల్మ్ డెవలప్మెంట్ బోర్డు ఏర్పాటు

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫిల్మ్, టీవీ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బోర్డును ప్రభుత్వం పునరుద్ధరించింది. చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన ఏర్పాటైన బోర్డులో పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ అదనపు కార్యదర్శి, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి డైరెక్టర్లుగా ఉంటారు. సమాచార ప్రజా సంబంధాల డైరెక్టర్ ఎండీగా వ్యవహరిస్తారు.

ఆర్‌వోఆర్ పారదర్శకంగా అమలు చేయాలి

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పారదర్శకంగా అమలుచేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మద్ది బాబురాజేంద్రప్రసాద్, చందోలు వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మంగళగిరిలో పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజును కలిసి వినతిపత్రం అందజేశారు.

గీతాసారం

సమత్వ సాధనే మోక్ష మార్గం

అజ్ఞానంతో జీవించడం చీకట్లో జీవించడం లాంటిది. చీకట్లో తడుముకుంటూ, పడుతూ, లేస్తూ...మనల్ని మనం గాయపరుచుకుంటాం. తదుపరి స్థితి... కొన్ని వెలుగు రేఖలను అనుభూతి చెందడం లాంటిది. అప్పుడు కూడా క్షణకాలం పాటు అవగాహన పొంది, తిరిగి అజ్ఞానంలోకే జారిపోతాం. చివరి స్థితి సూర్యకాంతి లాంటి శాశ్వతమైన కాంతిని పొందడం. ఇక్కడ అవగాహన అత్యున్నత స్థాయికి చేరుకుంటుంది. అక్కడి నుంచి ఇక వెనక్కి తిరిగి రావడం అనేది ఉండదు. ఇటువంటి స్థితిని 'మోక్షం' అంటారు. ఇది 'నేను' (సంబంధిత వ్యక్తి) పొందే స్వేచ్ఛ కాదు, 'నేను' (అనే భావన) నుంచి స్వేచ్ఛ. ఎందుకంటే బాధలన్నిటికీ కారణం ఈ 'నేను' కనుక.

"ఎవరైతే తమ మనసును, బుద్ధిని ఆత్మలో స్థిరపరుచుకుంటారో... వారు జ్ఞాన సాధనతో పాపరహితులై, పునరావృతరహితమైన పరమగతిని (మోక్షాన్ని) పొందుతారు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. మరి ఆ స్థితిని పొందాలంటే కావలసింది ఏమిటి? సమత్వం. విద్యాసంపన్నులైన ఉన్నత వర్ణాలవారి పట్ల, నిమ్న కులాల వారిపట్ల, అలాగే గోవు, ఏనుగు, శునకం లాంటి జంతు



వుల పట్ల జ్ఞానులు సమదృష్టిని కలిగి ఉంటారన్నాడు శ్రీకృష్ణుడు. ఈ 'సమత్వం' అనేది భగవద్గీతకు పునాదుల్లో ఒకటి. అందరిలోనూ స్వయాన్ని (తనను), స్వయంలో అందరినీ చూడగలగడం అనేది సమత్వానికి కేంద్రం లాంటిది. అంటే ఇతరులలో కూడా మనలాగే మంచి విషయాలు ఉన్నాయని, మనలో కూడా ఇతరుల మాదిరిగా చెడు విషయాలు ఉన్నాయని గుర్తించడం. కనిపించే వైరుధ్యాలను సమానంగా చూడడం, అజ్ఞానం నుంచి ఉద్భవించిన ద్వేషాల్ని, అయిష్టాల లాంటి వాటిని త్యజించడం తరువాతి స్థాయిలు. 'ఒకే కారణం వల్ల ఒకసారి లాభం కలగవచ్చు, మరోసారి నష్టం కలుగవచ్చని తెలుసుకొని... మనం నిమిత్రమాత్రులం' అని గ్రహించాలి. సమతుల్యత లేని మనసుతో చేసిన కర్మ దుఃఖాన్ని తీసుకువస్తుందని అర్థం చేసుకోవాలి. ఈ అవగాహన నుంచి సమత్వభావం ఉద్భవిస్తుంది. "వర్తమానంలో ఎవరైతే సమత్వ భావంలో స్థిరపడతారో... వారు నిష్పక్షపాతులవుతారు. లోపరహితులై... పరమాత్మతో ఏకత్వాన్ని పొంది, జీవన్ముక్తులవుతారు" అని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు.

కె.శివప్రసాద్

పుష్కరాలు



మన దేశంలోని మహా నదుల్లో ఒకటైన సరస్వతి నదిని వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు అద్భుతంగా కీర్తించాయి. అయిదు వేల ఏళ్ళకు పూర్వమే ఆవిర్భవించిన ఈ నది... భూమిపై తన ప్రవాహశీలతను క్రమంగా కోల్పోయింది. ఇప్పుడు అంతర్వాహినిగా భక్తుల ఆరాధనలను అందుకుంటోంది.

జన హృదయాంతర్వాహిని

జలాన్ని చైతన్య దేవతగా 'చాందగ్యోపనిషత్తు' వర్ణించింది. భారతీయ జీవన విధానం నదులతో పెనవేసుకుంది. వాటిలో ఒకటైన సరస్వతి నది వేదకాలం నాటిది. 'అంబితమే... నదీతమే... దేవీతమే సరస్వతి' అని స్తుతించాయి వేదాలు. ఒకప్పుడు మహా ధారగా ప్రవహించిన ఈ నది కాలక్రమంలో వచ్చిన భౌగోళిక మార్పులతో ఒడుదొడుకులకు లోనై క్షీణించింది. మహా భారత కాలానికే ఈ స్థితి ఏర్పడినట్టు చరిత్ర చెబుతోంది. ఇంతకీ ఈ నది గురించి పురాణాలు ఏం చెబుతున్నాయి?

ఏడు రూపాలతో...

సరస్వతి నది ఆవిర్భావం గురించి ఎన్నో కథలు ఉన్నాయి. పరమ శివుడి ఆద్యంతాలు తెలుసుకున్నానని బ్రహ్మ అసత్యం పలుకగా, దాన్ని గుర్తించిన శివుడు... బ్రహ్మ వాక్కుకు మూలమైన సరస్వతిని "నదివి కమ్ము" అని శపించాడని, అలా సరస్వతి నదీ రూపాన్ని పొందిందని 'బ్రహ్మాండ పురాణం' చెబుతోంది. ఇక సరస్వతిని విష్ణుపత్నిగా 'బ్రహ్మవైవర్త పురాణం', 'దేవీ భాగవతం' పేర్కొన్నాయి. అసూయతో సరస్వతిని భూలోకంలో నదిగా జన్మించాలని గంగ శపించగా, గంగను కూడా అదే విధంగా సరస్వతి శపించినట్టు మరికొన్ని కథలు వెల్లడిస్తున్నాయి. కాగా... 'బ్రహ్మ చేతి నుంచి ఆయన కమండలం జారిపడి, అందులోని పవిత్రజలం సరస్సుగా మారింది. అదే బ్రహ్మ సరస్సు (పుష్కరతీర్థం)గా ప్రసిద్ధి పొందింది. దానిలోనుంచి సరస్వతి నది పుట్టింది' అనేది స్థలపురాణం. ఆ జలంతో బ్రహ్మ చేసిన యాగం వల్ల 'సుభద్ర', నైమిశారణ్యంలో చేపట్టిన సత్ర యాగం వల్ల 'కనకాక్షి', గయుడు చేసిన క్రతువు ద్వారా 'విశాల', ఉద్దాలకుడు నిర్వహించిన యాగం వల్ల 'సురతన్వి', వశిష్టుడు ఆచరించిన యజ్ఞం ద్వారా 'ఓఘమాల', బృహస్పతి చేసిన యాగం వల్ల 'సువేణి', బ్రహ్మ చేసిన మరో యాగం వల్ల 'విమలోదక' అనే పేర్లు పొందిన సరస్వతి... ఏడు రూపాలతో 'సప్త సారస్వతం'గా ప్రసిద్ధి చెందింది.

ఎన్నో చోట్ల... ఎన్నెన్నో పేర్లతో...

సరస్వతి నదీ తీరంలో నివసించిన రాజుల చరిత్రను, ఋషులు చేసిన ప్రస్తావనలను, ప్రజల విశ్వాసాలను గమనిస్తే అనేక విషయాలు తెలుస్తాయి. సరస్వతి నది హిమాలయాల్లో పుట్టి... వితస్తా (జీలం), అసిక్ని (చీనాబ్), పరుష్ణి (రావి), శతద్రు (సట్లెజ్), విపాశ (బియాస్), సింధు నదులతో కలిసి... కశ్మీర్, పంజాబ్, ఉత్తర భారతం మీదుగా... ఈనాటి పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో ప్రవహించి, అరేబియా నదిలో సంగమిస్తుంది. ఈ ఏడు నదులు ప్రవహించిన ప్రదేశమే 'సప్తసింధు' ప్రాంతంగా పేరుపొందింది. నేటికీ ఈ నదిపట్ల ప్రజలలో విశ్వాసం సన్నగిల్లలేదు. దేశంలోని ఎన్నో ప్రదేశాలలో... ఈ నది అంతర్వాహినిగా ప్రవహిస్తోందనేది జనం నమ్మకం. ఈ నదిపై విశేషమైన పరిశోధనలు జరిగాయి. ఫ్రెంచి రచయిత మైఖేల్ దామినో ది 'లాస్ట్ రివర్' (లుప్త నది) అనే పేరుతో ఒక గ్రంథాన్నే రచించాడు. శివాలిక్ ప్రాంతంలో పుట్టిన సరస్వతి... కురుక్షేత్రంలో లుప్తమయిందనే పురాణ కథ కూడా ఉంది. ఇప్పటికీ అక్కడ ఒక నది ప్రవహిస్తోంది. దాన్ని 'గగ్గర్ నది'గా వ్యవహరిస్తారు. శ్రీకృష్ణుడు నిర్యాణం చెందిన ప్రభాస పట్టణంలోని నదిని 'ప్రభాస తీర్థం' అంటారు. పుష్కర తీర్థంలో పుట్టి కొంతదూరం ప్రవహించి, లవణా నదిలో కలిసే నదిని 'పుష్కర సరస్వతి' అంటారు. సరస్వతి నది లుప్తమైనప్పటికీ... భూగర్భంలో ప్రవహిస్తూ, బదరీనాథ్ ఆలయానికి సమీపంలోని మానా గ్రామంలో 'బిందు సరోవరం'గా దర్శనమిస్తుంది. దీన్ని 'సరస్వతీ కుండం'గా వ్యవహరిస్తారు. ఈ ప్రదేశాలన్నిటినీ పుష్కర సమయంలో వేలాది భక్తులు దర్శించి, పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. అలాగే దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన తెలంగాణలోని కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, అంతర్వాహినిగా సరస్వతీ సంగమించే 'త్రివేణ సంగమ' ప్రదేశంలో... సరస్వతి పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విశేషమేమిటంటే... ఈ మూడూ పుష్కర నదులే. ఈనెల 26వ తేదీవరకూ కొనసాగే పుష్కరాల్లో నదీ స్నానాలు, దాన ధర్మాలు, పితృకార్యాలు చేయడం వల్ల శుభ ఫలితాలు కలుగుతాయనేది పెద్దల మాట.



• ఆయపిళ్ళ రాజపాప

ఫొటోలు: వీరగోని హరీష్, మధు, వరంగల్

తెలుసుకుందాం

పాండవ పక్షాన కౌరవుడు



దుర్యోధనాది కౌరవుల గురించి అందరికీ తెలుసు. కానీ ధృతరాష్ట్రుడి మరో కుమారుడైన యుయుత్సుడిది కూడా మహా భారతంలో విశిష్టమైన పాత్రే. అతని తల్లి సుఖద అనే వైశ్య వనిత. యుయుత్సుడు మహా వీరుడు. అతిరథుల్లో ఒకడు. మొదటి నుంచీ దుర్యోధనుడితోనే కలిసి ఉండేవాడు. కౌరవ-పాండవ సమరం ప్రారంభమయ్యే సమయంలో "మేము అస్త్ర శస్త్రాలు పట్టింది ధర్మాన్ని రక్షించడానికి. మమ్మల్ని వ్యతిరేకించి, మమ్మల్ని ఎదిరించి పోరాడేవారందరూ ధర్మ విధ్వంసానికి పాల్పడేవారే. అలాకాకుండా ధర్మం వైపు నిలబడి ఎవరైనా పోరాడాలనుకుంటే వారికి స్వాగతం పలుకుతున్నాం" అని ధర్మరాజు చెప్పిన మాటలు యుయుత్సుణ్ణి ఆకర్షించాయి. ధర్మం పాండవులవైపే ఉందని గ్రహించాడు. తనవంతు సైన్యంతో సహా పాండవుల పక్షాన చేరి, కౌరవుల మీద యుద్ధం సాగించాడు. భారత యుద్ధం ముగిసింది. ధృతరాష్ట్రుడి కుమారుల్లో మిగిలినది యుయుత్సుడొక్కడే. "ధర్మానికి కట్టుబడిన యుయుత్సుణ్ణే కౌరవ సామ్రాజ్యానికి రాజును చేస్తాను. ఆ విధంగానైనా ధృతరాష్ట్రుడికి మనశ్శాంతి కలుగుతుంది" అని ధర్మరాజు ప్రకటిస్తాడు. అయితే ధర్మవేత్తలు దానికి అభ్యంతరం చెబుతూ... క్షత్రియ సంతతికి చెందని యుయుత్సుడు రాజు కావడానికి అనర్హుడని అంటారు. అప్పుడు పాండవ సామ్రాజ్యానికి సైన్యాధ్యక్షుడిగా యుయుత్సుణ్ణి ధర్మరాజు నియమిస్తాడు. ఆ తరువాత స్వర్గారోహణకు బయలుదేరిన పాండవులు... అభిమన్యుడి కుమారుడైన పరీక్షిత్తు సంరక్షణ బాధ్యతను యుయుత్సుడికే అప్పగిస్తారు. పాండవ పక్షాన నిలిచి పోరాడిన కౌరవుడైన యుయుత్సుడు... మహా భారతంలోని విలక్షణమైన పాత్రల్లో ఒకటి.

'ఆంధ్రజ్యోతి లక్కీడ్రా'

తెలంగాణ విజేతకు కారు చెక్కు అందజేత

ఖమ్మం, మే 15 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో కారును గెల్చుకున్న రైతు గుడిపూడి శ్రీనివాసరావుకు బుధవారం ఖమ్మం యూనిట్ కార్యాలయంలో చెక్కు అందజేశారు. హైదరాబాద్‌లోని 'ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంలో గత నెల 11న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని డ్రా తీసి విజేతలను ప్రకటించారు. అందులో ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం రామాపురానికి చెందిన రైతు గుడిపూడి శ్రీనివాసరావును అదృష్టం వరించింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఖమ్మం 'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయంలో ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య చేతుల మీదుగా కారుకు సంబంధించిన నగదు చెక్కును అందజేశారు. శ్రీనివాసరావు, ఆయన సతీమణి నాగేంద్రలు కమిషనర్ చేతుల మీదుగా చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకుని రావడంలో 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక స్థానం ఉందన్నారు. పాఠకుల కోసం 'ఆంధ్రజ్యోతి' లక్కీ డ్రా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.



కారు విజేత గుడిపూడి శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆంధ్రజ్యోతి ఖమ్మం బ్రాంచ్ మేనేజరు పుల్లారావు, సిబ్బంది

కారులేని లోటును 'ఆంధ్రజ్యోతి' తీర్చింది

'మాది వ్యవసాయ కుటుంబం. మాకున్న పది ఎకరాలతో పాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ఎప్పటినుంచో కారు కొనాలని అనుకుంటున్నా అది సాధ్యపడలేదు. ఇప్పుడు మాకు కారులేని లోటును 'ఆంధ్రజ్యోతి' తీర్చింది. లక్కీ డ్రాలో గెలుపొందినట్లు ఫోన్ వచ్చిన తర్వాత కారు బుక్ చేసుకున్నాం. గత మూడేళ్లుగా 'ఆంధ్రజ్యోతి' పత్రికను చదువుతున్నాను. లక్కీ డ్రాలో రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవడం గొప్ప అనుభూతినిచ్చింది'

- విజేత శ్రీనివాసరావు, నాగేంద్ర

దోపిడీకే 'మద్యం' నగదు లావాదేవీలు!

- రూ.99,413 కోట్ల మేర క్యాష్ రూపంలోనే..
- నాడు డిజిటల్ చెల్లింపులు ఎందుకు నిలిపేశారు?
- వైసీపీని నిలదీసిన ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర
- జగన్ పత్రిక అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆగ్రహం

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు లేకుండా చేసి, రూ.99,413.5 కోట్ల మేర లావాదేవీలను నగదు రూపంలో ఎందుకు చేశారో వైసీపీ నేతలు సమాధానం చెప్పగలరా?' అని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నేతల అరాచకాలు నేడు ఒక్కొక్కటిగా సిట్ విచారణలో బయటకొస్తుంటే ఓర్వలేని జగన్ విషపత్రిక అబద్ధాలను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. వేల కోట్లు దోచుకొని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడి.. ఇప్పుడు విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తులను టీడీపీకి ముడిపెట్టాలని వైసీపీ చూడటం సిగ్గుచేటన్నారు. 'మద్యం కుంభకోణంలో విచారణ ఎదుర్కొంటున్న విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, రాజ్ కసిరెడ్డి, గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి.. వీరంతా టీడీపీ నాయకులా..? 2019 వరకు వీరిలో ఎవరికైనా మద్యం వ్యాపారాలతో సంబంధాలు ఉన్నాయా?' అని రవీంద్ర ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకి రాగానే వీరు మద్యం వ్యాపారంలోకొచ్చి దోపిడీకి తెరదీశారన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి వైసీపీ పెద్దలు తమ జేబులు నింపుకొన్నారని అన్నారు. వైసీపీ హయాంలో మద్యం షాపులు తగ్గించినట్లు సిగ్గు లేని రాతలు రాస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2020 నాటికి 2,934 దుకాణాలు ఉంటే, 2024లో వైసీపీ దిగిపోయే నాటికి 3,396కు పెంచారని పేర్కొన్నారు. 2019-24 మధ్య కేవలం 43 బ్రాండ్లకు మాత్రమే ఆర్డర్లు ఇచ్చారని, అవన్నీ వైసీపీ నేతల సొంత బ్రాండ్లేనన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు 300 బ్రాండ్లకు ఆర్డర్లు ఇస్తోందని తెలిపారు. '2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే నాటికి మద్యం ఆదాయ విషయంలో తెలంగాణకు, మనకు వ్యత్యాసం రూ.4,186 కోట్లు మాత్రమే. మీరు అధికారం నుంచి దిగిపోయే నాటికి ఇది రూ.42762 కోట్లకు చేరుకుంది. ఈ ఆదాయం అంతా ఏమైంది' అని వైసీపీ నేతలను నిలదీశారు.



యాదగిరిగుట్ట ఆలయ ప్రాంగణంలో కోలాటం ఆడుతున్న ప్రపంచ సుందరీమణులు



యాదగిరీశుడి సేవలో అందాల భామలు

- సంప్రదాయబద్ధంగా స్వామి వారి దర్శనానికి..
- ఆలయ ప్రాంగణంలో కోలాటం ఆడిన అందగత్తెలు

యాదాద్రి, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలైన యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లిలో మిస్ వరల్డ్ పోటీదారులు సందడి చేశారు. గురువారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రాన్ని ప్రపంచ సుందరీమణులు సందర్శించారు. కరేబియన్ గ్రూప్‌కు చెందిన తొమ్మిది దేశాల భామలు యాదగిరిగుట్టలో స్వామివారికి పూజలు నిర్వహించగా, ప్రపంచ పర్యాటక కేంద్రం భూదాన్‌పోచంపల్లిలో 25 దేశాలకు చెందిన ఆఫ్రికన్ అందగత్తెలు సందడి చేశారు. సుందరాంగులు తలలో మల్లెపూలు పెట్టుకుని.. లంగా వోణీలు, చీరలు ధరించి వచ్చారు. సాయంత్రం 5 గంటలకు బ్యాటరీ వాహనాల్లో ఆలయ ప్రాంగణంలోకి వెళ్లారు. 5.48 గంటలకు ఆలయ మాడవీధుల్లోకి చేరుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అధికారులు వారికి స్వాగతం పలికారు. అన్నామాచర్య ట్రస్ట్ కళాకారుల నృత్య ప్రదర్శన, కోలాటం మధ్యలో అందాల భామలు నడుచుకుంటూ వెళ్లారు. బంగారు తాపడం ఉన్న గోపురాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. స్వర్ణ ధ్వజ స్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తూర్పు రాజగోపురం నుంచి త్రితల రాజగోపురం ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. క్షేత్రపాలకుడు అంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. పంచనరసింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ముఖ మండపంలో వేద పండితులతో ఆశీర్వచనం పొందారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి స్వామివారి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం అతిథి గృహానికి వెళ్లారు. అక్కడే కాసేపు సేదతీరిన తర్వాత 7.15 గంటలకు హైదరాబాద్ బయలుదేరారు. ప్రపంచ సుందరీమణులు 2.15 గంటల పాటు ఆలయంలో ఉన్నారు. వీరి రాకతో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు భక్తులకు స్వామివారి దర్శనాలను నిలిపివేశారు.

పిడుగులు.. ఈదురుగాలులతో వర్షాలు

- మధ్యాహ్నం వరకు వడగాడ్పులు, ఉక్కపోత
- నేడు పలు జిల్లాల్లో భారీ వానలు



అనంతపురం జిల్లా రాప్తాడు మండలం రామినేపల్లిలో భారీ వర్షానికి నీట మునిగిన కారు

విశాఖపట్నం, అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): ఉత్తర తమిళనాడుకు ఆనుకొని నైరుతి బంగాళాఖాతం, ఉత్తర కర్ణాటక పరిసరాల్లో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. ఇంకా ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉన్న ఆవర్తనం ప్రభావంతో సముద్రం నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి వీస్తున్నాయి. వీటన్నింటి ప్రభావంతో గురువారం రాష్ట్రంలో పలుచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. కోనసీమ జిల్లా అమలాపురం, ఏలూరు జిల్లా నిడమర్రులో 54, కాకినాడ జిల్లా కాజులూరులో 42, అనకాపల్లి జిల్లా పాతవలసలో 41, కాకినాడ జిల్లా కరపలో 32.2, పిఠాపురంలో 31.7, అల్లూరి జిల్లా దళపతిగూడలో 31.5 మిల్లీమీటర్ల వాన పడింది. కాగా, వాయవ్య భారతం నుంచి వీచే పొడిగాలులతో కోస్తాలో పలుచోట్ల వడగాడ్పులు వీయడంతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు వడగాడ్పులు, ఉక్కపోత కొనసాగాయి. బాపట్ల జిల్లా ఇంకొల్లులో 42.6, పల్నాడు జిల్లా వినుకొండ, నెల్లూరు జిల్లా దగదర్తిలో 42.5, ఎన్టీఆర్ జిల్లా ముచ్చినపల్లిలో 41.9, ప్రకాశం జిల్లా వేమవరంలో 41.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం రాయలసీమలో అనేకచోట్ల, కోస్తాలో ఎక్కువ ప్రాంతాల్లో పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగుతాయని పేర్కొంది.

పిడుగులు పడతాయ్: విపత్తుల సంస్థ

రాష్ట్రంలో రానున్న రెండు రోజులు 40 డిగ్రీలకుపైబగా ఉష్ణోగ్రతలతో పాటు ఆకస్మికంగా పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం అల్లూరి, మన్యం, అనకాపల్లి, కాకినాడ, చిత్తూరు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం, కడప, శ్రీసత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, పలు జిల్లాల్లో 41-42 ఉష్ణోగ్రతలతోపాటు మన్యం, విజయనగరం జిల్లాల్లోని 10 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని తెలిపింది.

కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

కాళేశ్వరం, మే 15(ఆంధ్రజ్యోతి): సరస్వతీ నది పుష్కర సంరంభానికి గురువారం అంకురార్పణ జరిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో త్రివేణీ సంగమం వద్ద 12 రోజుల పాటు ఘనంగా జరిగే ఈ పుష్కరాలకు స్వామీ మాధవానంద సరస్వతి తెల్లవారుజామున 5.44 గంటలకు శ్రీకారం చుట్టారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య సరస్వతీ నదికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, చీర, సారె, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, పంచామృతాలు సమర్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్నానమాచరించారు. పుష్కరాల్లో తొలిరోజు సుమారు 20 వేలకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని అంచనా. 600 మంది వేద పండితులు పాల్గొన్నారు.

కండువాతోపాటు బాధ్యతలూ ఉంటాయి

» పార్టీలో చేరిన ఎన్‌ఆర్‌ఐలతో పురందేశ్వరి

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): 'కండువా కప్పుకోవడం కాదు... దాంతో పాటు బాధ్యతలూ ఉంటాయి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దుగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. అమెరికాలో 17 సంవత్సరాలుగా సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తోన్న సుధారెడ్డి, వేమూరు నాగేశ్వరరావు గురువారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఒకప్పుడు అమెరికా అంటే క్రేజ్ ఉండేదని గత పదేళ్లగా ఇండియాలో జరుగుతోన్న అభివృద్ధి చూస్తుంటే ఇక్కడ ఉండటమే సబబు అనిపిస్తోందని ఎన్‌ఆర్‌ఐలు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జరుగుతోన్న 'వన్ నేషన్... వన్ ఎలక్షన్...' సమావేశాలపై పురందేశ్వరి సమీక్షించారు. ఈ ఎన్నికతో దేశానికి, ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉంటుందో సమాజానికి వివరించాలని కార్యక్రమ కన్వీనర్ వల్లూరు జయప్రకాశ్ నారాయణకు ఆమె సూచించారు.

నేడు బెజవాడలో తిరంగా ర్యాలీ

భారత సైనికులకు సంఘీభావంగా విజయవాడలో శుక్రవారం నిర్వహించే ర్యాలీలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొంటారని పురందేశ్వరి తెలిపారు. సాయంత్రం 6గంటలకు ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ బెంజ్ సర్కిల్ వరకూ కొనసాగుతుందని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆహ్వానించారు.

ఆరోగ్యశాఖలో ఖాళీల భర్తీకి ప్రణాళిక: సత్యకుమార్

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో వివిధ విభాగాల్లో భారీ స్థాయిలో నెలకొన్న ఖాళీలను భర్తీ చేయడానికి త్వరలో ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కానున్నందున ఆరోగ్యశాఖలోని తొమ్మిది విభాగాల పనితీరు, సాధించిన ఫలితాలపై మంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గత 11 నెలలుగా నమోదైన వైద్యులు, సహాయక సిబ్బంది హాజరు, ఓపీ, ఐపీ సేవల తీరు, మౌలిక సదుపాయాల కల్పన వంటి పలు అంశాలను సమీక్షించారు. గత ప్రభుత్వం చెప్పుకున్న దానికి భిన్నంగా ఖాళీలు భారీగా ఉన్నాయన్నారు. సత్వర నియామకాల కోసం ఈ ప్రక్రియను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరిధి నుంచి ఆరోగ్యశాఖ నియామక బోర్డుకు మార్చడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌లో నెలకొన్న అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అందరికీ రూ.25లక్షల ఆరోగ్యబీమా కల్పించేందుకు మిశ్రమ పద్ధతిని త్వరలో అమల్లోకి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు.

వర్షాలు వచ్చేలోగా వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వండి

» డిస్కమ్‌ల సీఎండీలకు మంత్రి గొట్టిపాటి ఆదేశం

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): వర్షాలు వచ్చేలోగా వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు సాధ్యమైనన్ని ఎక్కువగా ఇవ్వాలని విద్యుత్తు పంపిణీ సంస్థలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. గిరిజనులకు సూర్యఘర్ కింద సోలార్ ప్యానల్‌తోపాటు బ్యాటరీ స్టోరేజీ కింద బల్బు, ఫ్యాన్ సదుపాయం కల్పించాలన్నారు. స్టోర్స్‌లో ఉన్న కరెంటు పరికరాలపై ఆడిట్ నిర్వహించాలని, అవి వాడిన తర్వాతే కొత్తవి కొనుగోలు చేయాలని చెప్పారు. వెలగపూడి సచివాలయంలో గురువారం సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డితో ప్రత్యక్షంగా, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావుతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మంత్రి మాట్లాడారు. సూర్యఘర్ పథకానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ గృహ సముదాయాలకు దీనికింద సోలార్ విద్యుత్తు అందించాలని ఆదేశించారు. కొండ ప్రాంతంలో సోలార్ ప్యానళ్లను అందజేసినా రాత్రివేళల్లో కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, అందువల్ల గిరిజన గ్రామాలకు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ (బీఈఎస్‌ఎస్) ద్వారా బల్బు, ఫ్యాను అందజేయాలని చెప్పారు. భారీ వర్షాలూ, గాలులకు విద్యుత్ తీగలు తెగిపడే ప్రాంతాల్లోని ప్రజలకు ముందుగా సమాచారం ఇవ్వడం వల్ల మరణాలను నివారించవచ్చని సూచించారు.



అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేశ్ అభివాదం. హాజరైన కార్యకర్తలు



ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

» హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం.. కూటమి మధ్య చిచ్చుపెట్టే వైసీపీ కుట్రలను తిప్పికొట్టండి

» పార్టీ కేడర్‌ను ఇబ్బంది పెట్టిన వారిని వదిలేది లేదు.. 'అనంత' కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేశ్

ఉత్తమ కార్యకర్తల కుటుంబ సభ్యులకు సత్కారం

అనంతపురం, మే 15(ఆంధ్రజ్యోతి): 'ఏడాది పాలనలో మన ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. పది మందికి చెప్పాలి' అని మంత్రి లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే కసిగా పనిచేయాలని సూచించారు. అనంతపురం జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా తొలి రోజు గురువారం గుంతకల్లు నియోజకవర్గంలో పర్యటించారు. గుత్తి మండలం రామరాజుపల్లి సమీపంలో పార్టీ ఉత్తమ కార్యకర్తలు, శ్రేణులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ముందుగా 32 మంది ఉత్తమ కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులను సత్కరించారు. కార్యకర్తల సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ... ఎన్నికల హామీ మేరకు రూ.4 వేల పింఛన్ ఇస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను ప్రారంభించామని తెలిపారు. ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించామని, చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చామని, రోడ్లపై గుంతలన్నీ పూడ్చుకుంటూ వస్తున్నామని అన్నారు. ఈ ఏడాది జూన్‌లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేస్తామని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు వెళతామని అన్నారు. '16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చాం. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి పెద్ద ఎత్తున కంపెనీలు వచ్చాయి. అనంతపురానికి రూ.22వేల కోట్ల విలువైన భారీ సోలార్, విండ్ ప్రాజెక్టు వస్తోంది. విశాఖకు టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ వస్తోంది. రాబోవు ఐదేళ్లలో యువతకు ఉద్యోగాలు వస్తాయి' అని అన్నారు.

వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

'మన ప్రభుత్వం పాఠశాలలను మూసివేస్తోందని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది. ఒక్క పాఠశాలనూ మూయడం లేదు. అది మన లక్ష్యం కాదు. ఒక క్లాస్‌కు ఒక టీచర్ ఉండాలన్నదే మన ధ్యేయం. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో 45 లక్షల మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం 33 లక్షలకు పడిపోయారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతాం. మంత్రి నారాయణ సహకారంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మంచి ఫలితాలొచ్చాయి. జనసేనతో కలిసి పోటీ చేశాం. భవిష్యత్తులో కలిసే ప్రయాణం చేస్తాం. మా మధ్య ఎలాంటి అరమరికలు లేవు. వైసీపీ నాయకులు మన మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారు. వారి విమర్శలు, ఆరోపణలను సమర్థంతంగా తిప్పికొట్టాలి. పార్టీ కేడర్ రెడ్‌బుక్ గురించి అడుగుతున్నారు. మన కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదలను. రెడ్‌బుక్‌ను మరువను. నా అంతకు నేనుగా ఎవరితో గొడవ పెట్టుకోను. మన జోలికి వస్తే మాత్రం వదలను. కార్యకర్తల బాగు కోసం నేను పనిచేస్తున్నాను. ఇది మన కుటుంబం.. మన పార్టీ. అన్యాయం జరిగితే నన్ను, పార్టీలోని ఇతర పెద్దలను కలవండి. సీనియర్లు, జూనియర్లను గౌరవిస్తా. పనిచేసే వారిని గుర్తిస్తా' అని లోకేశ్ అన్నారు.

[redacted] పర్యటన ముగించుకుని గుత్తి మండలం బేతాపల్లి వద్ద హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న లోకేశ్‌కు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణి శ్రీ, పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సహా పలువురు ముఖ్యనేతలు స్వాగతం పలికారు.



లోకేశ్‌కు కృతజ్ఞతలు చెబుతున్న టీడీపీ కార్యకర్త ప్రభాకర్ భార్య, కుమార్తెలు (కుడి వైపున)

లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థినులు

'కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయి, దిక్కుతోచని స్థితిలో ఉన్న మమ్మల్ని అన్నలా ఆదుకున్నారు. మీరు చేసిన సాయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాం' అని గుంతకల్లు నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్త ప్రభాకర్ కుమార్తెలు పురందేశ్వరి, స్నేహలత.. మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. లోకేశ్ చేసిన సాయంతో తాను బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నానని పురందేశ్వరి, ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేశానని స్నేహలత తెలిపారు. నంద్యాలలో పాదయాత్ర జరుగుతున్న సందర్భంలో ప్రభాకర్ భార్య, కూతుళ్లు లోకేశ్‌ను కలిసి వారి కష్టాలను చెప్పుకొన్నారు. ఆ సమయంలో ఇద్దరిని చదివిస్తానని లోకేశ్ మాట ఇచ్చారు. ఆ మాటను నిలబెట్టుకోవడంతో ప్రభాకర్ కుటుంబం మంత్రికి కృతజ్ఞతలు తెలిపింది. ఆ ఇద్దరు విద్యార్థినుల చదువు పూర్తయ్యే వరకు తాను అండగా ఉంటానని లోకేశ్ మరోసారి భరోసా ఇచ్చారు.



సర్క్యులర్ ఎకానమీపై సచివాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్ తదితరులు

జీరో వేస్ట్ ప్రభుత్వ విధానం

» వ్యర్థాల సమర్థ నిర్వహణతో గ్రామాలను స్వచ్ఛంగా మలచాలి

» తడిచెత్తను ఎరువుగా మార్చేందుకు డ్వాక్రా మహిళలకు బాధ్యత

» సర్క్యులర్ ఎకానమీపై సమీక్షలో చంద్రబాబు

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): వ్యర్థాల సమర్థ నిర్వహణతో రాష్ట్రంలోని అన్ని గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దేలా కార్యాచరణ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గురువారం సచివాలయంలో సర్క్యులర్ ఎకానమీపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజూ ఇళ్ల నుంచి చెత్తను సేకరించి తడి చెత్తను కంపోస్టుగా మార్చేలా, పొడి చెత్తను ఏజెన్సీలకు అప్పగించేలా చూడాలని చెప్పారు. ఇందుకు సంబంధించి ఏజెన్సీలను ఆహ్వానించేందుకు వచ్చే నెలలో టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. అలాగే తడి చెత్తను ఎక్కడికక్కడ ఎరువుగా మార్చేలా డ్వాక్రా మహిళలకు బాధ్యతలు అప్పగించాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో, అలాగే జిల్లాకు రెండు చొప్పున రాష్ట్రంలో మొత్తం 52 క్లస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. చెత్తను గ్రేడింగ్ చేసి దానిని కావాల్సిన ఏజెన్సీలకు విక్రయించడమో? లేదా అక్కడ నుంచి చెత్తను తరలించడమో చేయాలన్నారు. ఏ పంచాయతీలోనూ చెత్తను తీసుకొచ్చి రోడ్లపై వేయడానికి వీల్లేదని చెప్పారు. వ్యర్థాల నిర్వహణ సమర్థంతంగా నిర్వహించిన పంచాయతీలకు, వ్యక్తులకు అక్టోబరు 2న అవార్డులు అందించాలని సూచించారు. 2026 అక్టోబరు 2 కల్లా మొత్తం వ్యవస్థ గాడిలో పడాలన్నారు. జీరో వేస్ట్ అనేది మన లక్ష్యంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో అమలు చేసేలా కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని చంద్రబాబు అన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్, కాలుష్య నియంత్రణ మండలితో కలిసి పంచాయతీరాజ్ శాఖ సమన్వయం చేసుకోవాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు ఏర్పాటు చేసి చెత్తను సేకరించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. వ్యవసాయ వ్యర్థాలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల్లో వచ్చే వ్యర్థాలు సర్క్యులర్ ఎకానమీకి దోహదం చేసేలా అధ్యయనం జరగాలని సూచించారు. సర్క్యులర్ ఎకానమీ పాలసీ రూపొందించాలని ఆదేశించారు. సర్క్యులర్ ఎకానమీలో ముందున్న రాజస్థాన్ మోడల్‌ను పరిశీలించాలని ముఖ్యమంత్రి అన్నారు. మరోవైపు నెల్లూరు, రాజమండ్రి, కడప, కర్నూలులో ఏర్పాటు చేస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

కిశోర్‌కు 14 రోజుల రిమాండ్

» గుంటూరు జిల్లా జైలుకు తరలింపు

మాచర్లటౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): భూకబ్జా, హత్యాయత్నం కేసులో పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్, వైసీపీ నేత తురకా కిశోర్‌కు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. తమ ఇంటి స్థలాన్ని తురకా కిశోర్, అతని అనుచరులు కబ్జా చేశారని, చంపేస్తామని బెదిరించారని పట్టణానికి చెందిన చల్లా శివకుమార్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే పలు కేసుల్లో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న కిశోర్.. తనపై ఉన్న పీడీ యాక్టును తొలగించాలని అడ్వయిజరీ బోర్డును ఆశ్రయించారు. బోర్డు సూచనల మేరకు ఈ నెల 12న పీడీ యాక్టు కేసు రద్దయి ఆయనకు బెయిల్ మంజూరైంది. అదేరోజు పోలీసులు పీటీ వారంట్ దాఖలు చేశారు. కోర్టు అనుమతి మేరకు గురువారం మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కిశోర్‌ను హాజరుపరిచారు. కిశోర్ తరఫున న్యాయవాది గుంజె వరప్రసాద్, ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీంద్ర వాదనలు వినిపించారు. అనంతరం న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించడంతో కిశోర్‌ను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

బోరుగడ్డకు బెయిల్

అనంతపురం క్రైం, మే15(ఆంధ్రజ్యోతి): అనంతపురం త్రీటౌన్ సీఐ మురళీకృష్ణను బెదిరించిన కేసులో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు బెయిల్ మంజూరైంది. ఈ కేసులో విచారణ కోసం అనంతపురం జిల్లా జైలు నుంచి బోరుగడ్డ అనిల్‌ను గురువారం స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ (మొబైల్ కోర్టు) కోర్టులో హాజరుపరిచారు. ఇన్‌చార్జి న్యాయాధికారి హారిక రావూరి.. బోరుగడ్డకు బెయిల్ మంజూరు చేశారు. పోలీసులు సరైన సాక్ష్యాధారాలు చార్జ్‌షీట్‌లో పొందుపరచలేకపోయారని, కేసు కొట్టివేయాలని అనిల్ తరఫు న్యాయవాది నారాయణరెడ్డి డిశ్చార్జి పిటిషన్ దాఖలు చేశారు. కేసు విచారణను ఈనెల 28కి వాయిదా వేశారు. ఇదివరకే ఫోర్త్‌టౌన్ స్టేషన్‌లో నమోదైన కేసులోనూ బెయిల్ రావడంతో అనంతపురంలో నమోదైన రెండు కేసుల్లోనూ బోరుగడ్డకు బెయిల్ లభించినట్లయింది.

అట్రాసిటీ కేసు కదా.. ట్రయల్ కోర్టుకే వెళ్లాలి!

» సజ్జల భార్గవ్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ముందస్తు బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకే వెళ్లాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ వైసీపీ నేత సజ్జల భార్గవ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ మేరకు వ్యాఖ్యానించింది. గతేడాది నవంబరులో భార్గవ్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిపై కడప జిల్లా పులివెందులలో హరి అనే దళితుడి ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదైంది. ఆ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన కోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ఎదుట గురువారం విచారణకు వచ్చింది. సీనియర్ న్యాయవాదులు అందుబాటులో లేని కారణంగా విచారణను వాయిదా వేయాలని భార్గవ్ రెడ్డి తరఫు న్యాయవాదులు కోరారు. అట్రాసిటీ కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం ట్రయల్ కోర్టునే ఆశ్రయించాల్సి ఉంటుంది కదా? అని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. కేసు విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

'సంపద'పై శోకాలు!

జగన్ పత్రిక రోత రాతలు

» ఆదాయం తగ్గిందంటూ అబద్ధాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'సంపద సృష్టిస్తాం' అని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హయాంలో రాష్ట్ర ఆదాయం తగ్గిపోతోందట! అప్పులే తప్ప ఆదాయం లేదట! వైసీపీ హయాంలో మాత్రం అంతా భేషుగ్గా వెలిగిపోయిందట! ఇవి.. జగన్ రోత పత్రిక రాసిన రాతలు! ఆదాయం తగ్గడం నిజమే! కానీ... అది రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కాదు! జగన్ సొంత ఆదాయం. ఆయన అధికారంలో ఉన్నప్పుడు సొంత మీడియాకు అడ్డగోలుగా ప్రకటనల రూపంలో కొన్ని వందల కోట్లు సమర్పించుకున్నారు. ఇక మద్యం, ఇసుకలో వేల కోట్లు ముడుపుల ఆరోపణలు సరేసరి! వెరసి... జగన్ సొంత ఆదాయం పడిపోయింది. ఆయన రోత పత్రిక చెప్పినట్లుగా... రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం ఏమాత్రం తగ్గలేదు. పైగా పెరిగింది.

అర్ధసత్యాలు... వక్రీకరణలు..

జగన్ హయాంలో 2023-24తో పోలిస్తే.. చంద్రబాబు పాలనలో 2024-25లో రెవెన్యూ రాబడి, కేంద్ర గ్రాంట్లు తగ్గాయంటూ రోతపత్రిక గురువారం అబద్ధాలు వల్లె వేసింది. 2024-25 గణాంకాలను కాగ్ వెల్లడించిందంటూ అర్ధ సత్యాలు, అసత్యాలతో మభ్యపెట్టే యత్నం చేసింది. 'జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2023-24లో రెవెన్యూరాబడి రూ.1,73,963 కోట్లు. చంద్రబాబు సీఎం అయ్యాక 2024-25లో రెవెన్యూ రాబడి రూ.1,68,443 కోట్లు. ఏడాదిలో రెవెన్యూ రాబడి రూ.5,520 కోట్లు పడిపోయింది' అని రాసింది. వాస్తవం ఏంటంటే... రాష్ట్ర విభజన తర్వాత 2014-15 నుంచి కేంద్రం నుంచి రావాల్సిన రెవెన్యూ లోటు గ్రాంటు 2023-24లో రూ.10,460 కోట్లు వచ్చింది. దీనికి తోడు 15వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు 2023-24లో రూ.2,691 కోట్ల నిధులు వచ్చాయి. ఆ ఆర్థిక సంఘం నుంచి కొన్నేళ్లపాటు రావాల్సిన నిధులన్నింటినీ... ఎన్నికల ముందు జగన్ సర్కారు ఒకేసారి తీసేసుకుంది. దీంతో 2023-24లో రెవెన్యూ రాబడి బాగా పెరిగినట్లు కనిపిస్తుంది. జగన్ పత్రిక ఈ విషయం దాచిపెట్టి ఆయన హయాంలో రెవెన్యూ రాబడి ఎక్కువగా ఉన్నట్టు చూపించింది. కేంద్రం ఇచ్చిన రెవెన్యూ లోటు గ్రాంటు రూ.10,460 కోట్లు, ఆర్థిక సంఘం సిఫారసు మేరకు వచ్చిన నిధులు రూ.2,691 కోట్లు.. మొత్తం దాదాపు 13,151 కోట్లు మినహాయిస్తే జగన్ ప్రభుత్వంలో 2023-24లో వచ్చిన రెవెన్యూ రాబడి రూ.1,60,813 కోట్లు మాత్రమే. చంద్రబాబు సీఎం అయ్యాక 2024-25లో రెవెన్యూ రాబడి రూ.1,68,443 కోట్లు. అంటే... జగన్ ప్రభుత్వంతో పోలిస్తే చంద్రబాబు హయాంలో ఏడాదిలో 4.74 శాతం ఎక్కువ.

ఇదీ రాబడి

ట్యాక్స్ రెవెన్యూ

- జగన్ ప్రభుత్వం హయాంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ట్యాక్స్ రెవెన్యూ రూ.1,31,632 కోట్లు.
- చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25లో వచ్చిన ట్యాక్స్ రెవెన్యూ రూ.1,41,515 కోట్లు. జగన్ ప్రభుత్వంతో పోలిస్తే ఏడాదిలో 7.5 శాతం ఎక్కువ. మరి... ఆదాయం పెరిగినట్లా? తగ్గినట్లా?

జీఎస్టీ వసూళ్లు

- 2023-24లో జీఎస్టీ వసూళ్ల రూ.45,002.73 కోట్లు
- 2024-25లో జీఎస్టీ వసూళ్ల రూ.47,853.14 కోట్లు. జగన్ ప్రభుత్వంలో కంటే చంద్రబాబు హయాంలో ఏడాదిలో దాదాపు 2,850 కోట్లు ఎక్కువ.

ఎక్సైజ్ సుంకం

- 2023-24లో వసూలైన ఎక్సైజ్ సుంకం రూ.15,997.60 కోట్లు.
- 2024-25లో వసూలైన ఎక్సైజ్ సుంకం 19,882.06 కోట్లు. జగన్ ప్రభుత్వంలో కంటే చంద్రబాబు హయాంలో ఏడాదిలో దాదాపు 3,900 కోట్ల రాబడి పెరిగింది.

కేంద్ర పన్నుల్లో వాటా

- 2023-24లో కేంద్ర పన్నుల్లో వాటా రూ.31,838.14 కోట్లు.
- 2024-25లో కేంద్ర పన్నుల్లో వాటా రూ.36,869.53 కోట్లు. దీని ప్రకారం జగన్ ప్రభుత్వంలో కంటే చంద్రబాబు హయాంలో ఏడాదిలో దాదాపు 5 వేల కోట్లు ఎక్కువ.
- చంద్రబాబు సీఎం అయ్యాక పన్నులు పెంచకున్నా రాబడి పెరగడం విశేషం.

తెలీదు.. సంబంధం లేదు..!

» 'సిట్' విచారణలో ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి తీరిదీ

» నేడు మరోసారి విచారణ

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో కీలక నిందితులు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) సహనానికి పరీక్ష పెడుతున్నారు. ఏ ప్రశ్న అడిగినా 'తెలీదు.. సంబంధం లేదు..' అని మాత్రమే సమాధానం ఇస్తున్నట్లు తెలిసింది. ఈ ఇద్దరి ముందస్తు బెయిలు పిటిషన్ సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణకు రానున్నందున అదేరోజు సిట్ కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం. బుధవారం 6గంటలకు పైగా సాగిన విచారణలో అధికారులకు నిందితులు ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. దీంతో గురువారం ఉదయం 10.15 నుంచి రాత్రి 11.15 వరకూ దాదాపు 13 గంటల పాటు వీరిద్దరినీ సుదీర్ఘంగా విచారించారు. ఈసారి కూడా విచారణకు సహకరించకపోవడంతో కొన్ని ఆధారాలు ముందుంచి ప్రశ్నించినట్లు తెలిసింది. వైఎస్ ప్రభుత్వంలో హైదరాబాద్ జీహెచ్‌ఎంసీలో అడిషనల్ కమిషనర్‌గా పనిచేసిన ధనుంజయ్ రెడ్డికి అక్కడి కాంట్రాక్టర్‌తో ఉన్న ఆర్థిక లావాదేవీలపై సిట్ ఆరా తీసింది. అప్పట్లో ఒక ఊపు ఊపిన ఆ కాంట్రాక్టర్ ఏపీలో మళ్లీ జగన్ పాలనలో భారీగా లావాదేవీలు జరిపారు. అందులో అధిక భాగం ధనుంజయ్ రెడ్డికి చెందిన నల్లడబ్బేనని తెలుసుకున్న అధికారులు ఆ వివరాలు సైతం అడిగినట్లు తెలిసింది. దీంతో కంగుతిన్న ఆయన.. 'సర్వీసులో ఎందరో పరిచయం అవుతుంటారు.. వాళ్లందరూ నాకు బినామీలు అవుతారా?' అని ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం. రాయచోటి ప్రాంతానికి చెందిన శ్రీధర్ గుంటూరులో పాగావేసి 2019 నుంచి ఐదేళ్ల పాటు తాడేపల్లికి వచ్చిపోతూ చేసిన దందాలు, సంపాదించిన ఆస్తుల వివరాలు సేకరించిన సిట్ అధికారులు కర్ణాటక, తెలంగాణలో స్థిరాస్తి వ్యాపారాల్లో పెట్టుబడుల రహస్యం గురించి ప్రశ్నించినట్లు తెలిసింది. మరోవైపు కృష్ణమోహన్ రెడ్డి కుమారుడి పేరుతో ఉన్న కంపెనీల్లో పెట్టుబడులు, ఆర్థిక లావాదేవీలు పరిశీలించిన అధికారులు అందులో అనుమానాస్పద అంశాలపైనా ప్రశ్నించినట్లు సమాచారం. కృష్ణమోహన్ రెడ్డి ఎప్పుడెప్పుడు, ఎవరెవరితో మాట్లాడారు.. రాజ్ కసిరెడ్డి నుంచి తీసుకున్న డబ్బులు ఎక్కడి చేర్చారు.. తదితర కీలక సమాచారాన్ని ఇప్పటికే సేకరించిన సిట్... ఆ విషయాలను ఆయన నోటి నుంచి చెప్పించేందుకు చేసిన ప్రయత్నం పూర్తిస్థాయిలో ఫలించలేదని తెలిసింది. దీంతో శుక్రవారం మరోమారు వీరిద్దరినీ విచారించి కీలక అంశాలపై నిగ్గు తేల్చేందుకు సిద్ధమయ్యారు. గురువారం విచారణ సందర్భంగా ఇద్దరి ఫోన్లను అధికారులు పరిశీలించి, తర్వాత తిరిగి ఇచ్చేశారు. అలాగే ధనుంజయ్‌రెడ్డి ఈ-మెయిల్‌ను కూడా పరిశీలించారు. కానీ కృష్ణమోహన్ రెడ్డి మాత్రం తన ఈ-మెయిల్ పాస్‌వర్డ్ చెప్పడానికి నిరాకరించారు. ఇద్దరినీ కలిపి కాసేపు, విడివిడిగా మరికొంతసేపు విచారించారు. ముందస్తు బెయిలుపై సుప్రీంకోర్టు తీసుకునే నిర్ణయం ఆధారంగా దర్యాప్తు దిశ మార్చే అవకాశం ఉంది.

రాజ్ కసిరెడ్డికి ఈడీ ఉచ్చు

» వాంగ్మూలం నమోదుకు అనుమతివ్వండి .. కోర్టులో పిటిషన్ దాఖలు

విజయవాడ, మే 15(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డికి ఈడీ ఉచ్చు బిగిస్తోంది. రాష్ట్రంలో జరిగిన మద్యం కుంభకోణానికి సంబంధించిన వివరాలు అందజేయాలని సిట్ అధికారులకు ఇటీవల ఈడీ లేఖ రాసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న రాజ్ వాంగ్మూలం నమోదు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఈడీ తరఫు న్యాయవాది జయప్రకాశ్ ఏసీబీ కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. జైల్లో ఉన్న నిందితుల నుంచి వాంగ్మూలం తీసుకునే ప్రక్రియకు సంబంధించిన ఈడీ నిబంధనల గురించి న్యాయాధికారి పి.భాస్కరరావు ప్రశ్నించారు. ఆ కాపీని ఇవ్వాలని అడిగారు. ఈ కాపీ అందుబాటులో లేదని, త్వరలో సమర్పిస్తానని జయప్రకాశ్ తెలిపారు. ఈ కేసులో రూ.3,250 కోట్ల కుంభకోణం జరిగినట్టుగా సిట్ అధికారులు నిర్ధారించారు. ఇప్పుడు ఈడీ రంగ ప్రవేశంతో కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయని భావిస్తున్నారు.

ఏ, బీ కేటగిరీ బ్యారక్ కేటాయించండి

» కోర్టులో గోవిందప్ప బాలాజీ పిటిషన్

విజయవాడ, మే 15(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో అరెస్టయిన గోవిందప్ప బాలాజీ జైల్లో తనకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆయన తరఫు న్యాయవాది జి.నరసింహారావు(జీఎస్‌ఆర్) విజయవాడ ఏసీబీ కోర్టులో గురువారం పిటిషన్ వేశారు. జైల్లో ఏ, బీ కేటగిరీ బ్యారక్ కేటాయించాలని, ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించాలని, నిద్రపోవడానికి మంచం, దిండు ఏర్పాటు చేయాలని, దోమల నుంచి రక్షణగా కాయిల్ వెలిగించుకోవడానికి అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీన్ని పరిశీలించిన న్యాయాధికారి పి.భాస్కరరావు ఇంటి నుంచి భోజనాన్ని ఎవరికీ అనుమతించడం లేదని స్పష్టం చేశారు. బయట నుంచి కూరగాయలు కొనుగోలు చేసుకుంటే పిటిషనరే జైల్లో వంట చేసుకోవచ్చని సూచించారు. మంచం, దిండు, దోమల కాయిల్‌ను అనుమతిస్తామని తెలిపారు. ఏ, బీ కేటగిరి బ్యారక్‌లకు సంబంధించిన మాన్యువల్‌ను అందజేయాలని న్యాయవాదిని అడిగారు. ఈ మాన్యువల్ ఎక్కడా అందుబాటులో లేదని నరసింహారావు వివరించారు. తదుపరి వాదనలను 19వ తేదీకి వాయిదా వేశారు.

సిట్ కస్టడీకి సజ్జల శ్రీధర్‌రెడ్డి, దిలీప్

మద్యం కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి, రాజ్ కసిరెడ్డి పీఏ దిలీప్‌ను సిట్ అధికారులు గురువారం కస్టడీకి తీసుకున్నారు. ఇద్దరినీ ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించిన అనంతరం సిట్ కార్యాలయానికి తీసుకెళ్లి వేర్వేరుగా విచారించారు. అనంతరం వారిని జైలుకు తరలించారు. గురువారంతో దిలీప్ కస్టడీ ముగిసింది. శ్రీధర్‌రెడ్డి కస్టడీ మరో రెండు రోజులు కొనసాగుతుంది. కాగా, శ్రీధర్‌రెడ్డి, దిలీప్ బెయిల్ పిటిషన్లపై విజయవాడ ఏసీబీ కోర్టులో గురువారం విచారణ జరిగింది. శ్రీధర్ రెడ్డి పిటిషన్‌పై 20న, దిలీప్ పిటిషన్‌పై 16న కౌంటర్ దాఖలు చేయాలని న్యాయాధికారి పి.భాస్కరరావు ప్రాసిక్యూషన్‌ను ఆదేశించారు.

పీఎస్‌ఆర్, మధు బెయిల్ పిటిషన్లపై నేడు విచారణ

విజయవాడ, మే 15(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 జవాబు పత్రాలను డిజిటల్ మూల్యాంకనం చేసిన కేసులో జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్‌ఆర్ ఆంజనేయులు, పమిడికాల్వ మధుసూదన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ ఇద్దరూ బెయిల్ పిటిషన్లు వేసిన తెలిసిందే. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని న్యాయాధికారి దేవిక ప్రాసిక్యూషన్‌ను ఆదేశిస్తూ విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

19లోగా వంశీని కోర్టులో హాజరుపరచండి

నూజివీడు, మే 15(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని 19లోగా నూజివీడు సెకండ్ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచాలని గురువారం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో గన్నవరం ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వంశీ బాపులపాడు మండలంలో ఓటర్లను ప్రభావితం చేయడానికి నకిలీ పట్టాలు ఇచ్చారనే అభియోగంతో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసు విచారణ నిమిత్తం వంశీని కస్టడీ కోరుతూ బాపులపాడు పోలీసులు గురువారం నూజివీడు కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు.

రేషన్ డోర్‌డెలివరీ వాహనాల

నిలిపివేతకు కసరత్తు!

- ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లతో మంత్రి నాదెండ్ల చర్చలు
- మరోసారి చర్చలు జరిపి నిర్ణయం తీసుకునే అవకాశం



అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా ప్రవేశ పెట్టిన రేషన్ డోర్ డెలివరీని నిలిపివేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో ఆశాఖ ఉన్నతాధికారులు గురువారం రాష్ట్రంలోని రేషన్ డీలర్ల సంఘాల ప్రతినిధులతోనూ, ఎండీయూ ఆపరేటర్స్ (ఎండీయూ ఆపరేటర్స్) సంఘ నాయకులతోనూ విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో విడివిడిగా చర్చలు జరిపారు. రేషన్ సరుకుల పంపిణీ కోసం ఎండీయూ వాహనాలను కొనసాగించాలా? అనే దానిపై సూచనలు, సలహాలు ఇవ్వాలని మంత్రి కోరగా, ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లు భిన్నమైన అభిప్రాయాలను వెల్లడించారు. ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టిన తర్వాత ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని రేషన్ డీలర్లు ఆరోపించగా, వాహనాలను ఇప్పటికిప్పుడు నిలిపివేస్తే తామంతా వీధిన పడతామని ఎండీయూ ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తమతో కుదుర్చుకున్న ఒప్పందం 2027 జనవరితో ముగుస్తుందని, అప్పటి వరకు రేషన్ వాహనాలను కొనసాగిస్తే.. ఈలోగా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూసుకుంటామని ఎండీయూ ఆపరేటర్ల సంఘంప్రతినిధులు పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలోని ఎండీయూ ఆపరేటర్లందరి ఏకాభిప్రాయంతో వారంలోగా ఏదో ఒక నిర్ణయం చెప్పాలని ఆపరేటర్ల ప్రతినిధులకు మంత్రి సూచించినట్లు సమాచారం. మరోసారి సారి చర్చలు జరిపిన తర్వాత రేషన్ వాహనాల నిలిపివేతపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పౌరసరఫరాలశాఖ వర్గాలు భావిస్తున్నాయి.

ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం: మంత్రి నాదెండ్ల

ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల సహకారంతో ముందడుగు వేస్తోందని మంత్రి మనోహర్ తెలిపారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల ప్రతినిధులతోచర్చల అనంతరం ఓప్రకటన విడుదల చేశారు.

2027 వరకు కొనసాగించాలి: ఎండీయూ ఆపరేటర్లు

గత ప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్ మేరకు 2027-జనవరి వరకు ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలని ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతోపాటు అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకాలకు సరుకులు రవాణా చేసినందుకు తమకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరారు. తమకు అన్యాయం చేయకుండా ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే, గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలకు బీమా ప్రీమియం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, అయితే, ప్రస్తుత ప్రభుత్వం ప్రీమియం సొమ్మును తమ వ్యక్తిగత ఖాతాల నుంచి కట్ చేసిందని పేర్కొన్నారు.

ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణకు జైకా నిధులు

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణ కోసం జపాన్ ఇంటర్నేషల్ కార్పొరేషన్ ఏజెన్సీ (జైకా) ఆర్థిక సహాయాన్ని తీసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ నిర్ణయించింది. వెలగపూడి సచివాలయంలో గురువారం జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌తో జపాన్ వాటర్ ఏజెన్సీ(జేడబ్ల్యూఏ) బృందం సమావేశమైంది. డ్యాములు, వంతెన పునరుద్ధరణలో తమకు ఉన్న నైపుణ్యాలను గురించి సాయిప్రసాద్‌కు ఈ బృందం వివరించింది. 'బ్యారేజీలు, రిజర్వాయర్లు, బ్రిడ్జిల పటిష్ఠతపై అధ్యయనం చేస్తాం. ఇరిగేషన్ కట్టడాలను పునరుద్ధరించడంపై నివేదికలనూ ఇస్తాం. ఈ నెలలోనే మేం కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను అధ్యయనం చేశాం. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతం 2,59,000 చ.కిలోమీటర్లు ఉంది. ఇది జపాన్ భూభాగంలో 70 శాతం. వరల్డ్ బ్యాంకు, జపాన్ ఇంటర్నేషల్ కార్పొరేషన్ ఏజెన్సీ ద్వారా సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు తోడ్పడతాం' అని జేడబ్ల్యూఏ బృందం వివరించింది. డ్రిప్ పథకం కోసమూ జైకా ఆర్థిక సహాయాన్ని తీసుకోవచ్చన్న అభిప్రాయాన్ని సాయిప్రసాద్ వ్యక్తం చేశారు.

ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- నేటి నుంచి జూన్ 2 వరకు ట్రాన్స్‌ఫర్లు
- మే 31 నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తయితే తప్పనిసరి
- ఉమ్మడి జిల్లాలు యూనిట్‌గా ప్రక్రియ
- జూన్ 3 నుంచి బదిలీలపై మళ్లీ నిషేధం

అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 16 నుంచి జూన్ 2 వరకు బదిలీలు నిర్వహించేందుకు అనుమతిచ్చింది. ఈ మేరకు బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆర్థిక శాఖ మార్గదర్శకాలతో గురువారం ఉత్తర్వులు జారీచేసింది. 2025, మే 31 నాటికి ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని మార్గదర్శకాల్లో సూచించారు. ఐదేళ్ల సర్వీసు పూర్తికాని వారు కూడా బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వారి విజ్ఞాపనలను పరిగణనలోకి తీసుకుని, పరిపాలనా సౌలభ్యం మేరకు బదిలీలు చేయవచ్చని తెలిపారు.

అనారోగ్య బాధితులకు ప్రాధాన్యత..

దృష్టిలోపం ఉన్న ఉద్యోగులు, మానసిక దివ్యాంగ పిల్లలు కలిగిన ఉద్యోగులకు వైద్యవసతి కలిగిన ప్రదేశాలకు బదిలీల్లో ప్రాధాన్యత కల్పిస్తారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల కంటే ఎక్కువ కాలం పనిచేసిన ఉద్యోగులు, 40 శాతంపైగా అంగవైకల్యం కలిగిన ఉద్యోగులకు, దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ తదితర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి, కారుణ్య నియామకాల ద్వారా నియమితులైన వితంతు ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యత కల్పిస్తారు. కాగా, దివ్యాంగ ఉద్యోగులు కోరుకుంటే తప్ప వారిని బదిలీ చేయరాదని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. ఈ తరహా ఉద్యోగులను వారు కోరిన చోట ఖాళీలను బట్టి ట్రాన్స్‌ఫర్ చేసేలా వెసులుబాటు కల్పించారు. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే ఇద్దరినీ ఒకే చోట ఉంచేందుకు, అలా వీలుకాకపోతే పక్క పక్క ప్రాంతాల్లో సర్దుబాటు చేసేలా చూడాలని సూచించారు. పదోన్నతి పొందిన ఉద్యోగులను కచ్చితంగా బదిలీ చేయాలని, ఆ పోస్టు ఇతర ప్రాంతాల్లో లేకపోతే అదే స్థానంలో కొనసాగించవచ్చని తెలిపారు. ఐటీడీఏ పరిధిలో లోకల్ కేడర్, జోనల్ కేడర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు రెండేళ్ల సర్వీసు పూర్తిచేసుకుంటే వారు కోరుకున్న చోటకు బదిలీ చేయాలని సూచించారు. ఐటీడీఏ ప్రాంతానికి బదిలీలు కోరుకునే వారు 50 ఏళ్లలోపు వారై ఉండాలని, గతంలో ఐటీడీఏ ప్రాంతంలో పనిచేసిన వారిని ఈ బదిలీలకు పరిగణనలోకి తీసుకోరాదని మార్గదర్శకాల్లో తెలిపారు.

ఉమ్మడి జిల్లాలు యూనిట్‌గా బదిలీల ప్రక్రియ

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సంబంధిత శాఖలు ఈ బదిలీలు చేపడతాయి. జిల్లా, జోనల్, మల్టీ జోనల్ కేడర్ ఉద్యోగుల బదిలీలను ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా పరిగణించి చేపడతారు. ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు రాకుండా సకాలంలో సంబంధిత శాఖలు బదిలీలు నిర్వహించాలని, అందుకు ఆయా శాఖల విభాగాధిపతులు బాధ్యత వహించాలని మార్గదర్శకాల్లో సూచించారు. గుర్తింపు పొందిన రాష్ట్ర, జిల్లా, డివిజన్/మండల స్థాయి ఉద్యోగుల బదిలీలు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మూడు టర్మ్‌లు కానీ, తొమ్మిదేళ్ల సర్వీసు ఒకే చోట పూర్తి చేసి ఉంటేనే బదిలీ చేయాలని పేర్కొన్నారు. తాలూకా, జిల్లా స్థాయి గుర్తింపు పొందిన ఉద్యోగుల అసోషియేషన్ ఆఫీసు బేరర్స్ జాబితాను జిల్లా కలెక్టర్ ద్వారా ఆయా శాఖల హెచ్‌ఓడీలకు పంపాలని తెలిపారు. రాష్ట్ర స్థాయి ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్ల జాబితాను సాధారణ పరిపాలనశాఖ ద్వారా ఆయా హెచ్‌ఓడీలకు పంపించాలన్నారు. మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు నిర్వహించరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. జూన్ 3 నుంచి బదిలీలపై నిషేధం తిరిగి అమల్లోకి వస్తుందని ఆర్థికశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

18న నింగిలోకి నిఘా నేత్రం

- పీఎస్‌ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ఈఓఎస్-09 ప్రయోగం
- సరిహద్దులు, తీరప్రాంతంపై రేయింబవళ్లు నిఘా



ప్రత్యేక వాహనంలో షార్‌కు తీసుకెళ్తున్న నిసార్ ఉపగ్రహం

సూళ్లూరుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఆదివారం ఉదయం 5:59 గంటలకు పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా అత్యాధునిక రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహం ఈఓఎస్-09 (రీశాట్-1బీ)ను ప్రయోగించనుంది. ఈ ఉపగ్రహం దేశ సరిహద్దుల్లో భద్రత, రక్షణ నిమిత్తం శత్రువుల కదలికలపై నిఘా పెట్టనుంది. ఈ ప్రయోగం కోసం ఇస్రో శాస్త్రవేత్తలు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే షార్‌లోని మొదటి ప్రయోగ వేదికపై రాకెట్ నాలుగు దశల అనుసంధాన పనులను పూర్తిచేసి శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చి ప్రయోగానికి సిద్ధం చేశారు. ప్రయోగానికి 22 గంటల ముందు కౌంట్‌డౌన్ మొదలు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దేశ సరిహద్దు భద్రత, రక్షణకు సంబంధించిన ప్రయోగం కావడంతో ఇస్రో ఆ వివరాలేవీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. 1,710 కిలోల బరువున్న ఈఓఎస్-09 ఉపగ్రహాన్ని భూమికి 529 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలో ప్రవేశ పెట్టనున్నారు. రీశాట్-1బీగా పిలిచే ఈఓఎస్-09 (ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్)లో అత్యాధునిక సీ-బ్యాండ్ సింథటిక్ అపెర్చర్ రాడార్ (ఎస్ఏఆర్)ను అమర్చారు. పగలు రాత్రి అన్న తేడా లేకుండా వర్షం పడుతున్నా, దట్టమైన పొగమంచు కమ్ముకున్నా, మేఘాలు అడ్డుగా ఉన్నా.. భూ ఉపరితలాన్ని హై-రిజ ల్యూషన్‌తో ఫొటోలు తీయగలగడం దీని ప్రత్యేకత. ఇది రక్షణ శాఖకు ఎంతో ఉపయోగపడుతుంది.

షార్‌కు చేరిన నిసార్ ఉపగ్రహం

ఇస్రో-నాసా సంయుక్తంగా వచ్చే నెలలో చేపట్టనున్న నిసార్ ఉపగ్రహ ప్రయోగానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఉపగ్రహం గురువారం బెంగళూరు నుంచి షార్ కేంద్రానికి చేరుకుంది. బెంగళూరులోని ఉపగ్రహ కేంద్రం నుంచి రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ ప్రత్యేక వాహనంలో దీన్ని తీసుకొచ్చారు. వచ్చే నెలలో ప్రయోగించే జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా నిసార్‌ను రోదసిలోకి పంపనున్నారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక వద్దనున్న వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధాన పనులు జరుగుతున్నాయి. ఉపగ్రహాన్ని క్లీన్ రూంలో పెట్టి తుది పరీక్షలు నిర్వహించిన అనంతరం రాకెట్ శిఖర భాగాన అమర్చి ప్రయోగానికి సిద్ధం చేస్తారు.

పీఎస్ఆర్ కేసు వివరాలివ్వండి: హైకోర్టు

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుపై నమోదు చేసిన కేసుకి సంబంధించి పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని సీఐడీ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈనెల 22కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. సినీనటి కాదంబరీ జెత్వాని ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులు ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. విజయవాడ రెండవ అదనపు జిల్లా కోర్టు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయడంతో ఆయన తాజాగా హైకోర్టును ఆశ్రయించారు.

ఏపీ భవన్‌లో కూల్చివేతలపై ఢిల్లీ హైకోర్టు స్టే

న్యూఢిల్లీ, మే 15(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఏపీ భవన్‌లో కూల్చివేతలపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఈనెల 19 వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ పరిసరాల్లోని శ్రీ శివ వేంకటేశ్వర మందిరాన్ని కూల్చివేస్తారన్న ప్రచారం నేపథ్యంలో ఆలయ అర్చకుడు గోపాల్ కుమార్ మిశ్రా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. 1970లో నిర్మించిన ఆలయాన్ని కూల్చివేయాలని ఏపీ భవన్ అధికారులు ప్రయత్నిస్తున్నారని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ పిటిషన్ జస్టిస్ సచిన్ దత్తా ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం, ఈనెల 19 వరకు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు 50 కోట్లు

- 5 'స్ట్రయిక్స్'కు 150 కోట్లు.. ఐటీ శాఖ ఉత్తర్వులు

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఏర్పాటు చేయదలచిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు ప్రాథమికంగా రూ.50 కోట్లను, విశాఖ, తిరుపతి, రాజమండ్రి, ఎన్‌టీఆర్, అనంతపురం జిల్లాల్లో ఏర్పాటు చేసే ఒక్కో స్ట్రయిక్స్‌కు రూ.30 కోట్ల చొప్పున రూ.150 కోట్లను విడుదల చేస్తూ గురువారం ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఉత్తర్వు జారీ చేశారు.

జిల్లా కేంద్రాల్లో సమాచార కేంద్రాలు

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని సంస్థ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ ప్రకటించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రభుత్వశాఖలన్నింటికీ ఏపీటీఎస్ సాంకేతిక సేవలు అందిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకూ రూ.55,486 కోట్ల విలువైన పరికరాలు, సాఫ్ట్‌వేర్ కోసం టెండర్లను పిలిచాం. ఇది ఏపీటీఎస్ మొత్తం ప్రాజెక్టుల విలువ రూ.41,000 కోట్ల కంటే ఎక్కువ. ఏపీటీఎస్ ద్వారా ఇ-ప్రొక్యూర్‌మెంట్ కింద రూ.110 కోట్ల మేర లావాదేవీలు జరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.600 కోట్ల మేర లావాదేవీలను నిర్వహించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం' అని మోహన కృష్ణ ప్రకటించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.